www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 7-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 338

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, పాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: అష్టమి ఉ.9.19 తదుపరి నవమి; నక్షత్రం: మృగశిర రా.11.32 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: శే. ఉ.7.07; అమృతఘడియలు: మ.2.56-4.29; దుర్ముహూర్తం: ఉ.8.54-9.41, మ.12.49-1.36; రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.32; సూర్యాస్తమయం: 6.19

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

## బడికి శ్రీవిద్య

బాలికను బడిలో చేర్పించాలంటూ సీఎం ఆదేశం

సనత్‌నగర్‌లోని శ్రీవిద్య ఇంటికి డీఈవో రోహిణి

పాఠశాలలో చేర్పించి.. పుస్తకాలు అందజేత

చిన్నారికి జనన ధ్రువీకరణ పత్రం ఇచ్చే దిశగా జీహెచ్‌ఎంసీ చర్యలు

14

## సమన్వయలేమితోనే ఓటమి

గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలపై క్యాబినెట్ భేటీలో చర్చ

ఇకపై జిల్లాలవారీగా సమావేశాలు, సమీక్షలు జరపాలని..

ప్రభుత్వంపై దుష్ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టాలని నిర్ణయం

స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి బలపడాలని నిశ్చయం

ఇకపై రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి అనుగుణంగానే ముందుకు!

నియోజకవర్గాల పునర్విభజనపైనా సుదీర్ఘంగా చర్చ

బీసీ బిల్లును ఆమోదించుకునేలా కేంద్రంతో చర్చలు

13



క్యాబినెట్ భేటీ వివరాలను మీడియాకు తెలియజేస్తున్న మంత్రులు పొంగులేటి, పొన్నం

# ఎస్సీ.. బీసీ.. సై!

### వర్గీకరణ, రిజర్వేషన్ల పెంపునకు ఓకే

స్థానికంతోపాటు విద్య, ఉద్యోగాల్లోనూ బీసీలకు 42%

రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో మూడు బిల్లులు

ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకూ ఫ్యూచర్ సిటీ

30 వేల ఎకరాల్లో అభివృద్ధి.. 'ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ' ఏర్పాటు

హెచ్‌ఎండీఏ పరిధిలోని 36 గ్రామాలు కూడా బదిలీ

మహిళా సంఘాల సభ్యుల వయసు 15 నుంచి 65

టీటీడీ తరహాలోనే యాదగిరిగుట్టకూ ట్రస్టు బోర్డు

10,954 గ్రామ పాలన అధికారుల నియామకం

అర్హులైన పాత వీఆర్‌ఓ, వీఆర్‌ఏలకు మళ్లీ చాన్స్

తెలంగాణకు పర్యాటక పాలసీ.. ఐదేళ్లకు ఆమోదం

కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాలకు 361 పోస్టులు

రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డు కులాల (ఎస్సీ) వర్గీకరణ, బీసీ రిజర్వేషన్లపై చట్టాలను రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ సర్వేలు, కమిషన్ల నివేదికలు, మేధావులు, కుల సంఘాల అభిప్రాయాల ఆధారంగా విస్తృత కసరత్తు చేసి, చట్టాల రూపకల్పనకు మార్గాన్ని సుగమం చేసింది. ఈ మేరకు మూడు ముసాయిదా బిల్లులకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. ఎస్సీ వర్గీకరణ ముసాయిదా బిల్లుతోపాటు బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం; విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు సంబంధించి రెండు ముసాయిదా బిల్లులకు ఆమోద ముద్ర వేసింది. వీటిని రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి, ఆమోదించాలని నిర్ణయించింది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో దక్షిణాది రాష్ట్రాలు.. ముఖ్యంగా తెలంగాణకు అన్యాయం జరగకుండా కేంద్రానికి తమ వాణిని వినిపించాలని తీర్మానించింది. ఇందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మాజీ మంత్రి జానారెడ్డి ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశంజరిగింది. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన సమావేశం

మిగతా 13వ పేజీలో...

### సీతారామపై మంత్రుల సంవాదం!

అంచనాల పెంపుపై వాడివేడి చర్చ

పథకం పాత పేర్లను ప్రస్తావించిన కీలక మంత్రి

13

కొర్రీలు వేసుకుంటూపోతే ఫలితం ఉండదని మరో మంత్రి ఆగ్రహం

అంచనాలను పరిశీలించే బాధ్యత రామకృష్ణారావుకు అప్పగింత

**12 నుంచి బడ్జెట్ సమావేశాలు!**

ఎస్సీ, బీసీ బిల్లులకు ఆమోదం

సమావేశాలకు విరామమిచ్చి సీఎం నేతృత్వంలో ఢిల్లీకి అఖిలపక్షం

## అమెరికన్లు, ఎన్నారైలే లక్ష్యంగా.. సైబర్ దోపిడీ

### మాదాపూర్‌లో 62 మందితో కాల్‌సెంటర్.. పేపాల్ పేరిట ఫోన్లు

ఉద్యోగులుగా ఈశాన్య రాష్ట్రాల యువత

అక్రమ లావాదేవీలంటూ బెదిరించి సొమ్ము వసూలు

ఆ డబ్బును క్రిప్టో కరెన్సీగా మార్చి దుబాయ్‌కి మళ్లింపు

నిర్వాహకురాలు, ఉద్యోగుల అరెస్ట్

గుజరాత్‌కు చెందిన సూత్రధారి, మరో ఇద్దరు పరార్

అమెరికా వేళలతో నడిచే కాల్‌సెంటర్లపై నిఘా పెట్టండి.. పోలీసులకు డీజీ షికా గోయల్ సూచన



పోలీసులు స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అమెరికా పౌరులనే లక్ష్యంగా చేసుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముఠా గుట్టు రట్టయింది. ఇందుకోసం ఏర్పాటు చేసిన కాల్‌సెంటర్ నిర్వాహకురాలు, 62 మంది ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ షికా గోయల్ గురువారం విలేకరులకు వెల్లడించారు. మాదాపూర్‌లో ఎక్సిటో సొల్యూషన్స్ పేరిట హైదరాబాద్‌కు చెందిన చందా మనస్విని ఓ కాల్ సెంటర్‌ను ప్రారంభించారు. ఇందులో పనిచేయడానికి ఈశాన్య రాష్ట్రాలకు చెందిన యువతీయువకులను నియమించుకున్నారు. వీరంతా అమెరికన్

మిగతా 14వ పేజీలో...

### ఏసీబీ పేరిట సైబర్ వల

ప్రభుత్వ ఉద్యోగి నుంచి రూ.లక్ష కాజేసిన సైబర్ నేరగాళ్లు

అరెస్టని బెదిరించి బురిడీ

హైదరాబాద్‌లో ఘటన

14

## ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం!

ఆ ప్రాధాన్యాన్ని అమెరికా-భారత్ గుర్తించాయి

ఒప్పందం దిశగా అడుగులు పడుతున్నాయి

ట్రంప్ నేతృత్వంలో బహుళధ్రువ ప్రపంచంవైపు అమెరికా.. ఇది భారత్‌కు అనుకూల పరిణామమే

బ్రిటన్‌లో విదేశాంగమంత్రి జైశంకర్

మంత్రి వాహనం మీదికి దూసుకొచ్చిన ఖలిస్థానీ

**వసతులు ఊరికేరావు.. పన్నులకు కారణాలున్నయ్**

భారత ఎగుమతిదార్ల ప్రయోజనాలు కాపాడతాం

చర్చల కోసమే గోయల్ అమెరికాకు: నిర్మల



లండన్, మార్చి 6: ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం అవసరాన్ని అమెరికా-భారత్‌లు గుర్తించాయని విదేశాంగ మంత్రి జైశంకర్ తెలిపారు. గత నెల ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్య జరిగిన చర్చల నేపథ్యంలో.. ఈ ఒప్పందం దిశగా అడుగులు పడుతున్నాయన్నారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రస్తుతం ఈ అంశంపైనే అమెరికా పర్యటనలో ఉన్నారని

మిగతా 2వ పేజీలో...



## కాంగ్రెస్ కుట్ర ఫలించలేదు

11

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ దుష్ప్రచారాన్ని జనం పట్టించుకోలేదు

మంత్రులకు ప్రజలు కర్రు కాల్చి వాతపెట్టారు

ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చేది బీజేపీనే

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



ఎమ్మెల్సీలుగా గెలిచిన బీజేపీ నేతలతో కిషన్‌రెడ్డి



మే చివరికి శ్రీశైలం మరమ్మతులు

### పూర్తి కావాలి

ఏపీకి ఎన్‌డీఎస్‌ఏ డెడ్‌లైన్

120 మీటర్ల భారీ గొయ్యితో డ్యామ్ భద్రతకే ముప్పు

ఏడాదిగా పనులు ఎందుకు చేపట్టలేదని నిలదీత

3

ప్రాజెక్టుల నిర్వహణ చూసే వారే వాటి ఓనర్లని స్పష్టీకరణ

**ముప్పు ముంగిట శ్రీశైలం!**

స్పిల్‌వే దిగువన భారీ గొయ్యి

ఏడాది కిందటే ఏపీకి ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల నివేదిక

తాజాగా తెలంగాణ ఈఎన్‌సీ ఫిర్యాదుతో వెలుగులోకి

### మధ్యభారత రాష్ట్రాలకే లాభం

నియోజకవర్గాల పునర్విభజనతో వాటికి మాత్రమే ప్రయోజనం

దక్షిణాదికే కాదు.. ఉత్తరాది రాష్ట్రాలకూ నష్టమే

డీలిమిటేషన్‌కు కొత్త సూత్రం లేదా శాశ్వతంగా నిలిపివేయాలి

కాంగ్రెస్ ఎంపీ మనీశ్‌తివారీ

14

లగచర్ల, హకీంపేట భూసేకరణ

### నోటిఫికేషన్లపై స్టే

అత్యవసరంగా భూసేకరణ ఎందుకు?

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

తదుపరి విచారణ 7కు వాయిదా

గ్రామస్థుల సంబరాలు

# ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం!

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. బుధవారం లండన్‌లో ఛాతమ్‌హౌస్ మేధోసంస్థ 'భారత్ ఉత్థానం.. ప్రపంచంలో పాత్ర' అనే అంశంపై జరిగిన చర్చలో జైశంకర్ ప్రసంగించారు. ట్రంప్ సారథ్యంలో అమెరికా బహుళ ధ్రువ ప్రపంచంవైపు అడుగులు వేస్తోందని, అది భారత్‌కు మంచిదేనన్నారు. ట్రంప్ అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత బలంగా ముందుకు తీసుకొస్తున్న సుంకాల అంశాన్ని ప్రస్తావిస్తూ.. దానిపై ఇరుదేశాలూ మనసు విప్పి మాట్లాడుకున్నాయని, దాని ఫలితంగానే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం అవసరాన్ని ఆమోదించాయన్నారు. మరోవైపు, 'భారత్-బ్రిటన్ స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందం' దిశగా కసరత్తు జరుగుతోందని, అయితే, అది కొన్ని సంక్లిష్టతలతో కూడుకొని ఉన్నందున దాని సాకారానికి కొంత సమయం పడుతుందని జైశంకర్ వెల్లడించారు. చైనాతో భారత్‌కు ఉన్న సంబంధాల గురించి ప్రస్తావిస్తూ.. 'ప్రపంచంలో 200 కోట్లకుపైగా జనాభా ఉన్న దేశాలు చైనా, భారత్. మా ప్రయోజనాలకు, అభిప్రాయాలకు గౌరవం దక్కే విధంగా చైనాతో సంబంధాలు ఉండాలని మేం కోరుకుంటున్నాం. టిబెట్‌లో ఉన్న కైలాస పర్వత తీర్థయాత్రకు చైనా అనుమతించటం ఒక మంచి పరిణామం' అని తెలిపారు. కశ్మీర్ అంశంపై ఓ సభికుడు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. 370 ఆర్టికల్‌ను రద్దు చేసి కశ్మీర్ అభివృద్ధికి ఇప్పటికే దారులు పరిచామని తెలిపారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ భూభాగం తిరిగి భారత్‌లో చేరినప్పుడే కశ్మీర్ సమస్య సంపూర్ణంగా పరిష్కారం అవుతుందన్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ప్రస్తావిస్తూ.. ఆ రెండు దేశాలతోనూ భారత్ సంప్రదింపులు జరుపుతున్నదని.. తన అవసరం ఉన్నదని భావించిన ప్రతి సందర్భంలోనూ భారత్ ముందుకొస్తోందని చెప్పారు. అమెరికా, భారత్, ఆస్ట్రేలియా, జపాన్‌లతో కూడిన క్వాడ్ కూటమి మంచి పురోగతి సాధిస్తోందని, కూటమిలో ఉన్న సభ్యదేశాలందరికీ తగిన ప్రాతినిధ్యం దక్కుతోందన్నారు. జైశంకర్ ప్రస్తుతం బ్రిటన్, ఐర్లండ్‌లలో ఆరు దేశాల పర్యటనలో ఉన్నారు.

### ఖలిస్థానీల దాడి యత్నం

ఛాతమ్‌హౌస్‌లో జైశంకర్ ప్రసంగిస్తున్న సమయంలో అక్కడ కొందరు ఖలిస్థానీ మద్దతుదారులు నిరసన చేపట్టారు. ఛాతమ్‌హౌస్ నుంచి జైశంకర్ వెళ్లిపోతుండగా.. ఆయనను ఎగతాళి చేస్తూ భారత వ్యతిరేక నినాదాలు చేశారు. వారిలోంచి ఓ వ్యక్తి భారత్ జెండాను చింపివేసి, జైశంకర్ వాహనంవైపు దూసుకురావటానికి ప్రయత్నించాడు. భద్రతా సిబ్బంది అతడిని అడ్డుకున్నారు. విదేశాంగమంత్రి భద్రతనే ఉల్లంఘించిన ఈ ఘటనను భారత్ తీవ్రంగా ఖండించింది. దీనిపై బ్రిటన్ గట్టి చర్యలు చేపట్టాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో, బ్రిటన్ ఒక ప్రకటన జారీ చేస్తూ.. ప్రజాభద్రతను ఉల్లంఘించే, బెదిరించే ఈ తరహా ఘటనలు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. విదేశాల ప్రతినిధులకు పూర్తి భద్రత కల్పిస్తామని పేర్కొంది.

## యూఏఈలో ఇద్దరు కేరళీయులకు మరణ శిక్ష

» వేర్వేరు హత్య కేసుల్లో శిక్ష అమలు

న్యూఢిల్లీ, మార్చి 6: వేర్వేరు హత్య కేసుల్లో దోషులుగా తేలిన ఇద్దరు భారతీయులకు యూఏఈలో మరణ శిక్ష అమలు చేశారు. ఈ విషయాన్ని భారత విదేశీ వ్యవహారాల శాఖ గురువారం వెల్లడించింది. శిక్ష పడ్డ ఇద్దరు ముహమ్మద్ రినాష్ అరంగిలొట్టు (29), మురళీధరన్ పెరుమ్‌థట్ట వాలప్పిల్ (43) కేరళకు చెందిన వారు. ఎమిరేట్స్‌కు చెందిన వ్యక్తిని హత్య చేసిన కేసులో ముహమ్మద్ రినాష్‌కు, భారత్‌కే చెందిన వ్యక్తిని హత్య చేసిన కేసులో మురళీధరన్‌కు మరణ శిక్ష విధించారు. ఈ తీర్పును యూఏఈ అత్యున్నత న్యాయస్థానం కోర్టు ఆఫ్ కాసేషన్ సమర్థించిన మీదట శిక్షను అమలు చేశారు. మరణ శిక్ష విషయంపై గతనెల 28న భారత ఎంబసీకి యూఏఈ సమాచారం ఇచ్చింది. వీరి శిక్షను నిలుపుదల చేసేందుకు శాయశక్తులా ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయిందని భారత విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది.

## భారత్‌కు అప్పగించొద్దు.. చిత్రవధ చేస్తారు

» అమెరికా సుప్రీంకోర్టులో తహవూర్ రాణా పిటిషన్

న్యూఢిల్లీ, మార్చి 6: దేశాన్ని కుదిపేసిన 26/11 ముంబై దాడుల కేసులో కీలక సూత్రధారి తహవూర్ రాణా తనను భారత్‌కు అప్పగించొద్దంటూ అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. భారత్‌కు పంపిస్తే అక్కడ తనను చిత్రహింసలు పెడతారని ఆరోపించాడు. తన అప్పగింతపై తక్షణమే స్టే విధించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశాడు. రాణాను భారత్‌కు అప్పగించేందుకు తమ ప్రభుత్వం అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో న్యాయస్థానంలో పిటిషన్ వేసిన రాణా.. తాను పాకిస్థాన్ సంతతికి చెందిన ముస్లింనని, గతంలో పాక్ ఆర్మీలో పనిచేశానని.. తన గుర్తింపు కారణంగా భారత్‌లో తనను చిత్రవధ చేస్తారని ఆరోపించాడు. కాగా, ఇటీవల ఆయన దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను అమెరికా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

## రన్యా రావు వెనుక రాజకీయ నేత..?

» బంగారం స్మగ్లింగ్ కేసులో ట్విస్ట్

బెంగళూరు, మార్చి 6: దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తీసుకొస్తూ బెంగళూరు ఎయిర్‌పోర్టులో దొరికిపోయిన కన్నడ నటి రన్యా రావు వ్యవహారం సంచలన మలుపులు తిరుగుతోంది. నటి బంగారం స్మగ్లింగ్ వెనుక ఓ ప్రముఖ రాజకీయ నాయకుడి హస్తం ఉన్నట్లు కథనాలు బయటికొచ్చాయి. దీంతో ఈ కేసు కన్నడ నాట రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. బెంగళూరు విమానాశ్రయంలో రన్యా రావు వద్ద నుంచి 14.2 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్న డీఆర్‌ఐ అధికారులు.. తర్వాత ఆమె నివాసంలోనూ స్వర్ణ ఆభరణాలు, భారీగా నగదు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఆభరణాలను బెంగళూరులోని ఓ షాపు నుంచి కొనుగోలు చేసినట్లు గుర్తించారు. ఆ ఆభరణాలను ఓ రాజకీయ నాయకుడి తరఫున కొనుగోలు చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు తెలుస్తోంది. ఆ నగలకు డబ్బును ఎవరు చెల్లించారు? ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందన్న విషయాలపై విచారణ అధికారులు ఆరా తీస్తున్నారు.

## షమీ మహాపాపి, నేరగాడు!

» భారత జట్టు ఫాస్ట్‌బౌలర్ మహమ్మద్ షమీపై ఆల్ ఇండియా ముస్లిం జమాత్ చీఫ్ షహబుద్దీన్ విమర్శలు

న్యూఢిల్లీ, మార్చి 6: భారత జట్టు పేస్ బౌలర్ మహమ్మద్ షమీ రంజాన్ నెలలో ఉద్దేశపూర్వకంగా రోజా (ఉపవాసం)ను వదిలేయడం ద్వారా మహా పాపానికి ఒడిగట్టారని ఆల్ ఇండియా ముస్లిం జమాత్ అధ్యక్షుడు మౌలానా షహబుద్దీన్ రజ్వీ బరేల్వీ అన్నారు. చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా మార్చి 4న ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్ సందర్భంగా మైదానంలో షమీ కూల్ డ్రింక్ తాగడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఇస్లాంలో రోజా అనేది ఓ బాధ్యత అని.. మ్యాచ్ సందర్భంగా ఉపవాసాన్ని విడిచిపెట్టడం ద్వారా షమీ నేరానికి పాల్పడ్డారని మండిపడ్డారు. షమీ చర్య ఇస్లాం నిర్దేశించిన సూత్రాలకు వ్యతిరేకం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రోజాను కొనసాగించకుండా వదిలేసిన షమీ ఓ నేరగాడు. తన చర్యలపై ఆయన దేవుడికి కచ్చితంగా సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుంది' అని షహబుద్దీన్ వ్యాఖ్యానించారు. అయితే పర్యటనల్లో ఉన్నవారికి రోజా నుంచి వైదొలిగేందుకు మినహాయింపు ఉంటుందని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఎగ్జిక్యూటివ్ మెంబర్ మౌలానా ఖలీద్ రషీద్ ఫరంగీ మహ్లీ పేర్కొన్నారు.

## ఎగ్జిక్యూటివ్ పిటిషన్లపై నిర్ణయాలకు ఆరు నెలలే గడువు: సుప్రీం కోర్టు

» లేకుంటే సంబంధిత జడ్జీలదే బాధ్యత: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మార్చి 6: వివిధ కేసుల్లో కోర్టులు ఇచ్చిన ఆదేశాలు అమలు కావడం లేదంటూ దాఖలయ్యే ఎగ్జిక్యూటివ్ పిటిషన్లపై న్యాయస్థానాలు సకాలంలో నిర్ణయాలు తీసుకోవడం లేదంటూ సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎగ్జిక్యూటివ్ పిటిషన్లపై ఆరు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని గురువారం స్పష్టం చేసింది. లేకుంటే సంబంధిత జడ్జియే బాధ్యత వహించాల్సి ఉంటుందని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం హెచ్చరించింది. హైకోర్టుకు సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందని తెలిపింది. కోర్టులు ఇచ్చిన డిక్రీలు అమలు కావడంలేదంటూ దాఖలయ్యే ఎగ్జిక్యూటివ్ పిటిషన్లపై మూడునాలుగేళ్లపాటూ నిర్ణయాలు తీసుకోవడం లేదంటూ తప్పులను ఎత్తిచూపింది. దీనిపై జిల్లా న్యాయవ్యవస్థకు అవగాహన కలిగించాలని అన్ని హైకోర్టులకు సూచించింది.

## సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా కలకత్తా హైకోర్టు జడ్జి పేరు సిఫార్సు

న్యూఢిల్లీ, మార్చి 6: సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా కలకత్తా హైకోర్టు జడ్జి జస్టిస్ జోయ్‌మాలా బాగ్చిని నియమించాలని గురువారం కొలీజియం సిఫార్సు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆధ్వర్యంలోని ఐదుగురు సభ్యుల కొలీజియం కేంద్రానికి ఆయన పేరును ప్రతిపాదించింది. ఈ నియామకాన్ని కేంద్రం ఆమోదిస్తే ఆయన ఆరేళ్ల పాటు సుప్రీంకోర్టులో విధులు నిర్వర్తించనున్నారు. అన్ని సీనియార్టీలను పరిగణనలోకి తీసుకుంటే జస్టిస్ బాగ్చీ ప్రధాన న్యాయమూర్తి పదవిని చేపట్టే అవకాశం ఉంది. ఆ పదవిలో నియమితులైతే 2031 అక్టోబరు రెండో తేదీ వరకు కొనసాగుతారు.

## లోకం తీరు




## వామ్మో.. ఆ భారం భరించలేం!

» అక్రమ వలసదారుల తరలింపులో అమెరికా సైనిక విమానాలకు స్వస్తి

వాషింగ్టన్ డీసీ, మార్చి 6: అక్రమ వలసదారులను దేశం నుంచి తరలించేందుకు అమెరికా ప్రభుత్వం సైనిక విమానాల వినియోగాన్ని నిలిపివేసింది. వాటి వినియోగానికి భారీగా వ్యయం అవుతుండటమే తాజా నిర్ణయానికి కారణమని న్యూయార్క్ నగరానికి చెందిన ఒక పత్రిక కథనాన్ని ప్రచురించింది. ఈ ఆపరేషన్‌లో సైనిక విమానాలను చివరిసారిగా ఈనెల 1న వినియోగించారు. రానున్న కొన్ని రోజుల వరకు సైనిక విమానాలు పంపే షెడ్యూల్ ఏమీ లేదని అమెరికా రక్షణవిభాగం అధికారులు తెలిపారు. మరికొంత కాలం ఈ ఆపరేషన్లకు సైనిక విమానాలను వినియోగించకపోవచ్చని, లేదా శాశ్వతంగా ఈ ఆపరేషన్లకు వాటిని వాడకపోవచ్చని చెప్పారు. అక్రమ వలసదారుల వ్యవహారాలు చూసే హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఈ ఆపరేషన్లకు సాధారణంగా కమర్షియల్ విమానాలను వినియోగిస్తోంది. అయితే, ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక అక్రమ వలసలపై గట్టి సందేశం ఇచ్చేందుకే వారిని సైనిక విమానాలలో తరలించినట్టు ఆ కథనం పేర్కొంది.

## పాక్ పౌరులను అమెరికాలోకి రానీయొద్దు!

» అఫ్ఘాన్‌పైనా ట్రంప్ 'ప్రయాణ నిషేధం'

న్యూఢిల్లీ, మార్చి 6: భద్రతా కారణాల దృష్ట్యా పలు దేశాలపై ప్రయాణ నిషేధం (ట్రావెల్ బ్యాన్) విధించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యోచిస్తున్నారు. ఈ నేపథ్యంలో అమెరికాలోకి ప్రవేశించకుండా పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ వాసులపై నిషేధం విధించే అవకాశం ఉంది. వచ్చేవారం నుంచే ఈ నిషేధం అమలులోకి రావచ్చని అంతర్జాతీయ మీడియా పేర్కొంది.

## అమెరికాలో భారతీయులకు మరో గండం!

» 1.35 లక్షల మందికి స్వీయ బహిష్కరణ ముప్పు

» హెచ్-1బీ వీసాదారుల పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకం




న్యూఢిల్లీ, మార్చి 6: అమెరికాలో లక్షలాది మంది భారతీయులు ప్రస్తుతం స్వీయ బహిష్కరణ ముప్పును ఎదుర్కొంటున్నారు. గతంలో హెచ్-4 వీసాపై అమెరికాకు మైనర్లుగా వలస వెళ్లిన వీరికి ఇప్పుడు 21ఏళ్ల వయసు రావడంతో ఆందోళన మొదలైంది. అమెరికా ఇమిగ్రేషన్ చట్టాల ప్రకారం ఇకపై వీరంతా హెచ్-1బీ వీసాదారులైన తల్లిదండ్రులపై ఆధారపడిన వారిగా అర్హత కోల్పోతారు. హెచ్-1బీ వీసాదారుల పిల్లలు డిపెండెంట్ వీసాతో అమెరికాకు వెళ్లే అవకాశం ఉంది. వారికి 21 సంవత్సరాల వయసు వచ్చేవరకూ ఈ వీసా అమలులో ఉంటుంది. ఆ తర్వాత వీరు మరో వీసా హోదాకు మారడానికి రెండేళ్ల గడువు ఉండేది. అయితే ఇటీవల ఇమిగ్రేషన్ విధానంలో వచ్చిన మార్పులు వారి భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చాయి. ఈ నేపథ్యంలో సరళమైన వీసా విధానాలున్న కెనడా, యూకే తదితర దేశాలకు వలస వెళ్లేందుకు పలువురు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. గ్రీన్‌కార్డు దరఖాస్తుల్లో బ్యాక్‌లాగ్ భారీగా ఉండటం కూడా భారతీయ వలసదారులపై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. 2023 మార్చి నాటికి డిపెండెంట్ వీసా గడువు ముగింపు దశకు చేరుకున్న భారతీయుల పిల్లలు దాదాపు 1.35 లక్షల మంది వరకూ ఉన్నారు.

## భారత ఎగుమతిదారుల ప్రయోజనాలు కాపాడతాం

» అన్నింటికీ పన్నులు కడుతున్నామంటే కారణాలు ఉన్నాయ్: నిర్మలా సీతారామన్



విశాఖపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భారతదేశంపై పెద్దఎత్తున సుంకాలు విధిస్తామని ప్రకటిస్తున్న నేపథ్యంలో ఇక్కడి ఎగుమతిదారుల ప్రయోజనాలు కాపాడేందుకు యత్నిస్తున్నామని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఇందులో భాగంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ అమెరికాకు వెళ్లి చర్చలు జరుపుతున్నారని తెలిపారు. విశాఖపట్నంలో గురువారం వివిధ వ్యాపార, వాణిజ్య సంస్థలు, చార్టెడ్ అకౌంటెంట్లతో ఆమె సమావేశమయ్యారు.

### వేర్వేరు ప్రయోజనాల కోసమే పన్నులు

ఒక కారును రూ.12 లక్షలు పెట్టి కొంటే జీఎస్టీ, రోడ్ ట్యాక్స్, ఇన్సూరెన్స్ ట్యాక్స్.. ఇలా సుమారు మరో రూ.10 లక్షలు అదనంగా పన్నుల రూపంలో చెల్లించాల్సి వస్తోందని, ఇది న్యాయమా అని ఒకరు ప్రశ్నించగా మంత్రి దానికి సవివరంగా సమాధానమిచ్చారు. సాధారణ పౌరుల దృష్టిలో అది పన్నుల భారంగానే కనిపిస్తుందని, కానీ అవన్నీ వేర్వేరు అవసరాల కోసం చెల్లిస్తున్నారనే విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. తయారుచేసిన కారు కొన్నందుకు జీఎస్టీ, రహదారిపై ఆ వాహనం నడుపుతున్నందుకు ఆ రోడ్డు నిర్మాణానికి అయిన ఖర్చు కోసం పన్ను, పెట్రోల్ పోయించుకుంటే దానిని దిగుమతి చేసుకున్నందుకు పన్ను, ఇలా అన్ని వేర్వేరు ప్రయోజనాల కోసం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇవన్నీ కారు కొన్నవారు, రోడ్డును ఉపయోగించుకునేవారు, పెట్రోల్ కొనేవారు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రజలకు ఏ సదుపాయమూ ఊరకనే రాదని తెలుసుకోవాలన్నారు. న్యూజెర్సీ వంటి రహదారులు, అమెరికా వంటి విమానాశ్రయాలు కావాలంటే భారీగా నిధులు వెచ్చించాలని, వాటిని రాబట్టుకోవడానికే ప్రభుత్వం పన్నులు వేస్తుందన్నారు.

### 3 కోట్ల మందే పన్ను చెల్లింపుదారులు

దేశంలో ఐటీ రిటర్న్స్ దాఖలు చేసేవారు 9 కోట్ల మంది ఉంటే వారిలో కేవలం 3 కోట్ల మంది మాత్రమే పన్ను చెల్లింపుదారులు ఉన్నారని కేంద్ర మంత్రి వివరించారు. సెంట్రల్ జీఎస్టీ, స్టేట్ జీఎస్టీ అని రెండు రకాలు వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారని, రెండింటిని కలిపి ఒకటిగానే వసూలు చేయవచ్చు కదా అని ఒకరు ప్రశ్నించగా, అది ఫెడరల్ విధానంలో భాగమని ఆమె సమాధానమిచ్చారు.

## 'యువికా' కోసం విద్యార్థులకు ఇస్రో పిలుపు

అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థుల్లో అవగాహన పెంచి, వారిలో స్ఫూర్తి నింపేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఏటా 'యువ విజ్ఞాన కార్యక్రమం' (యువికా) నిర్వహిస్తోంది. ఈ ఏడాది చేపట్టబోయే వేడుకకు దేశవ్యాప్తంగా తొమ్మిదో తరగతి విద్యార్థులను ఆహ్వానిస్తోంది. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 23లోగా https://www.isro.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వచ్చిన దరఖాస్తులను వడపోసి ఎంపికైన విద్యార్థుల జాబితాను ఏప్రిల్ 7న ప్రకటిస్తారు. 'యువికా-2025' కార్యక్రమం మే 19 నుంచి 30వ తేదీ వరకు ఉంటుంది. ఎనిమిదో తరగతిలో సాధించిన మార్కులకు 50 శాతం, గ్రామీణ విద్యార్థులకు 15 శాతం వెయిటేజీ ఉంటుంది. ఎంపికైన వారికి ప్రయాణ, వసతి, భోజన సౌకర్యాలు అన్నీ ఇస్రోనే కల్పిస్తుంది. విద్యార్థులకు దగ్గరలో ఉండే ఏడు ఇస్రో కేంద్రాల్లో ఒక దానికి తీసుకుని వెళతారు.

## కేంద్రీయ విద్యాలయాల్లో అడ్మిషన్లు

కేంద్రీయ విద్యాలయాల సంఘటన్ (కేవీఎస్) 2025-26 సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. బాల్‌వాటిక-1, 2, 3 (ప్రీ ప్రైమరీ)తో పాటు, ఒకటో తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం వరకు అడ్మిషన్లు నిర్వహించనున్నారు. బాల్‌వాటికా క్యాటగిరీ తప్ప మిగిలిన తరగతుల సీట్లను అందుబాటులో ఉన్న ఖాళీల ఆధారంగా భర్తీ చేస్తారు. భద్రతా దళాలు, కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు అలాగే ఏక సంతానంగా ఆడపిల్లలు ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు. దరఖాస్తుల దాఖలుకు ఈ నెల 21న చివరి తేదీ. ఆ తరువాత నాలుగైదు రోజుల్లో ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రకటిస్తారు. కేంద్రీయ విద్యాలయ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాల కోసం https://kvsangathan.nic.in/en/ వెబ్‌సైట్ చూడవచ్చు.

## 357 అసిస్టెంట్ కమాండెంట్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

పారా మిలిటరీ ఫోర్సుల్లో అసిస్టెంట్ కమాండెంట్ ఉద్యోగాల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్‌కు చెందిన ఈ ఉద్యోగాల దరఖాస్తుల దాఖలుకు ఈ నెల 25న చివరి తేదీ. రాత పరీక్ష 2025 ఆగస్టు 3వ తేదీన జరుగుతుంది. మొత్తం 357 పోస్టుల్లో బీఎస్ఎఫ్‌లో 24, సీఆర్‌పీఎఫ్‌లో 204, సీఐఎస్ఎఫ్‌లో 92, ఇండో టిబెటిన్ బోర్డర్ పోలీస్‌లో 4, సశస్త్ర సీమబల్‌లో 33 ఖాళీలు ఉన్నాయి. బ్యాచిలర్ డిగ్రీతోపాటు, నిర్దేశిక శారీరక ప్రమాణాలు ఉన్న పురుష, మహిళా అభ్యర్థులు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. 2025 ఆగస్టు 1వ తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 20 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్ క్యాటగిరీ వారికి గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. ఎన్‌సీసీ 'సీ', 'బీ' ధ్రువపత్రం ఉన్నవారికి మౌఖిక పరీక్షలో కొంత ప్రాధాన్యం ఉంటుంది. పూర్తి వివరాల కోసం https://upsc.gov.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

## ముంబైలో ఉండేవారు మరాఠీ నేర్చుకోనక్కర్లేదు!

» ఆరెస్సెస్ నేత భయ్యాజీ జోషి వివాదాస్పద వ్యాఖ్య

» ముంబై భాష.. మహారాష్ట్ర భాష.. మరాఠీయే

» అసెంబ్లీ సాక్షిగా తేల్చిచెప్పిన సీఎం దేవేంద్ర ఫడణవీస్

» ముంబై భాష మరాఠీయేననడంలో సందేహం లేదు

» విమర్శల వెల్లువ నేపథ్యంలో భయ్యాజీ జోషీ వివరణ



ముంబై, మార్చి 6: "ముంబైకి ఒక ప్రత్యేక భాష అంటూ ఏమీ లేదు. నగరంలోని ఒక్కో ప్రాంతంలో ఒక్కో భాష మాట్లాడతారు. ఘట్‌కోపర్ భాష గుజరాతీ. గిర్‌గావ్‌లో కొందరు హిందీ మాట్లాడతారు. అంచేత, ముంబైలో నివసించేవారు మరాఠీ నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఏమీ లేదు" అంటూ ఆరెస్సెస్ సీనియర్ నేత సురేష్ భయ్యాజీ జోషీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు! కేంద్ర ప్రభుత్వ హిందీ రుద్దుడుపై దక్షిణాది రాష్ట్రాలు ఒకవైపు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, తమ భాషలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో.. ముంబైలో ఉండేవారు మరాఠీ నేర్చుకోవాల్సిన అవసరం లేదంటూ భయ్యాజీ జోషీ వ్యాఖ్యానించడంపై మరాఠాలు భగ్గుమన్నారు. విపక్ష నేతలు ఆయనపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భయ్యాజీ జోషిపై రాజద్రోహం కేసు పెట్టాలని మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే డిమాండ్ చేయగా.. ఇది దేశ ద్రోహమని శివసేన (ఠాక్రే) నాయకుడు సంజయ్ రౌత్ దుయ్యబట్టారు. భయ్యాజీ వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతుండడంతో.. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ దీనిపై అసెంబ్లీ సాక్షిగా స్పందించారు. "భయ్యాజీ ఏమన్నారో నేను వినలేదు. కానీ.. ముంబై, మహారాష్ట్ర భాష మరాఠీయే. ఇక్కడ ఉండే ప్రతి ఒక్కరూ మరాఠీ భాష నేర్చుకోవాలి. మాట్లాడాలి. మహారాష్ట్ర సంస్కృతిలో, ఉనికిలో మరాఠీ విడదీయలేని భాగం. మరాఠీ నేర్చుకోవడం ఇక్కడి పౌరులందరి కర్తవ్యం" అని ఫడణవీస్ తేల్చిచెప్పారు. అదే సమయంలో తమ ప్రభుత్వం అన్ని భాషలనూ గౌరవిస్తుందని ఆయన పేర్కొన్నారు. తాను చేసిన వ్యాఖ్యలపై అన్ని వైపుల నుంచీ విమర్శలు రావడంతో భయ్యాజీ జోషి గురువారం ఈ అంశంపై వివరణ ఇచ్చారు. "భారతదేశంలో రకరకాల భాషలు మాట్లాడేవారంతా కలిసి మెలిసి ఉంటారు. ముంబై కూడా అలాంటి ఒక ఆదర్శవంతమైన ఉదాహరణ అని.. ఇక్కడ కూడా వివిధ భాషలు మాట్లాడేవారు కలిసి ఉంటారని నా ఉద్దేశం" అని వివరించారు. ముంబై భాష మరాఠీయేనని, అందులో సందేహమేమీ లేదని ఆయన స్పష్టం చేశారు. తన మాతృభాష మరాఠీయేనని, తాను అన్ని భాషలనూ గౌరవిస్తానని చెప్పారు. ముంబైకి వచ్చేవారు మరాఠీ నేర్చుకోవాలని ఆశించడం సహజమని కూడా ఆయన అభిప్రాయపడ్డారు.

## సంగీత విద్వాంసురాలితో బీజేపీ ఎంపీ తేజస్వి వివాహం



బెంగళూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఓ కచేరీలో సంగీత విద్వాంసురాలితో పరిచయం బీజేపీ ఎంపీ తేజస్విని పెళ్లిపీటల దాకా తీసుకొచ్చింది. బెంగళూరు దక్షిణ లోక్‌సభ సభ్యుడు, బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు తేజస్విసూర్య, చెన్నైకి చెందిన గాయని శివశ్రీ స్కంద ప్రసాద్ ఒక ఇంటివారయ్యారు. కొన్నాళ్ల క్రితం చెన్నైలో జరిగిన ఓ సంగీత కచేరీలో శివశ్రీ స్కందప్రసాద్‌ను తేజస్వి తొలిసారి చూశారు. ఆపై ఇరువురూ పెద్దలను ఒప్పించి పెళ్లిపీటలెక్కారు. గురువారం ఉదయం బెంగళూరు కనకపుర రోడ్డులోని ఓ రిసార్టులో జరిగిన వీరి వివాహానికి రెండు కుటుంబాలవారి సమీప బంధువులు, ఆప్తులు, పలువురు బీజేపీ నేతలు మాత్రమే హాజరయ్యారు.

# చిత్రజ్యోతి
SINCE 1965

## నయనతార కొత్త చిత్రం



నయనతార ప్రధాన పాత్రలో సుందర్ సి. దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'మూకుత్తి అమ్మన్ 2'. వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మిస్తున్నాయి. గురువారం పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ ప్రారంభమైంది. 'మూకుత్తి అమ్మన్'కు సీక్వెల్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. ధునియా విజయ్, రెజీనా కసాండ్రా, యోగి బాబు, ఊర్వశి, అభినయ, రామచంద్ర రాజు, అజయ్ ఘోష్, సింగం పులి, విచ్చు విశ్వనాథ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. బలమైన కథాంశంతో పూర్తి స్థాయి వినోదాత్మకంగా ఈ చిత్రం రూపొందుతుందని యూనిట్ తెలిపింది. ఈ సినిమా అన్ని దక్షిణాది భాషలతో పాటు హిందీలోనూ విడుదల కానుంది. సాధారణంగా చిత్రం ఓపెనింగ్ కార్యక్రమాలకు హాజరుకాని నయనతార 'మూకుత్తి అమ్మన్ 2' పూజా కార్యక్రమాలలో పాల్గొనడం విశేషం.

## జాన్వీ న్యూ లుక్



రామ్‌చరణ్, జాన్వీకపూర్ జంటగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఓ చిత్రం (ఆర్‌సి 16 వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. గురువారం జాన్వీ కపూర్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ స్పెషల్ పోస్టర్‌ని రిలీజ్ చేసింది. 'ఇది బిహైండ్ ది సీన్‌కు సంబంధించిన ఫొటో. మొదటి షెడ్యూల్ చిత్రీకరణ సందర్భంగా మైసూర్‌లో తీసింది. అఫీషియల్ లుక్ కాదు' అని చిత్ర బృందం స్పష్టం చేసింది. హైదరాబాద్‌లో గురువారం ప్రారంభమైన కొత్త షెడ్యూల్‌లోనూ ఆమె పాల్గొనబోతున్నారు. ఈ షెడ్యూల్ 12 రోజులపాటు కొనసాగుతుందని, హీరో, హీరోయిన్, ఇతర ఆర్టిస్టులపై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నామని చిత్రబృందం పేర్కొంది.

## దేశానికి దక్కిన గౌరవం



సింఫనీ కచేరి తనకు లభించిన వ్యక్తిగత గౌరవం కాదని, దేశానికి లభించిన గౌరవమని ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా పేర్కొన్నారు. లండన్‌లో ఈ నెల 8న తన తొలి వెస్ట్రన్ క్లాసికల్ సింఫనీ కచేరీలో ఇళయరాజా పాల్గొననున్నారు. 'వాలియంట్' అనే శీర్షికతో ఇళయరాజా కంపోజ్ చేసిన సింఫనీ లండన్‌లోని అపోలో ఆడిటోరియంలో తొలిసారి లైవ్‌షోగా ప్రదర్శితం కానుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం ఆయన చెన్నై నుంచి లండన్ బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఇళయరాజా విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ... ఇది ప్రపంచంలోనే అత్యుత్తమ సంగీత ఉత్సవం కానుందన్నారు. 'ఇన్‌క్రెడిబుల్ ఇండియా' లాగా తాను 'ఇన్‌క్రెడిబుల్ ఇళయరాజా' అన్నారు. భవిష్యత్తులో తన స్థాయికి చేరేవారు ఎవరూ లేరని, రాబోరని ఇళయరాజా వ్యాఖ్యానించారు.

-చెన్నై, ఆంధ్రజ్యోతి

## మీ ముందుకు వస్తున్నందుకు గర్వంగా ఉంది

- హీరో విక్కీకౌశల్



విక్కీకౌశల్, రష్మిక మందన్న జంటగా లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో తెరకెక్కి హిందీలో ఘన విజయం సాధించిన చిత్రం 'ఛావా'. నేడు తెలుగులో విడుదలవుతోంది. 550కిపైగా థియేటర్లలో సినిమాను విడుదల చేస్తున్నట్లు గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ తెలిపింది. ఈ సందర్భంగా హీరో విక్కీకౌశల్ ఓ వీడియో సందేశంలో తెలుగు ప్రేక్షకులను ఉద్దేశించి మాట్లాడుతూ 'మా 'ఛావా' చిత్రం తెలుగులో మీ ముందుకు వస్తున్నందుకు గర్వంగా ఉంది. ఈ చిత్రం మీ హృదయాలను తాకుతుందని, గొప్ప మరాఠా యోధులలో ఒకరైన ఛత్రపతి శంభాజీ మహారాజ్ కీర్తి, అజేయమైన శౌర్యం, త్యాగాన్ని చూసే అవకాశం మీకు లభిస్తుందని ఆశిస్తున్నాను' అని అన్నారు.

# రాహుల్‌ను కలిసేందుకు.. ఢిల్లీకి జగ్గారెడ్డి

- సంగారెడ్డిలో రాహుల్‌గాంధీ సభ సందర్భంగా ఎంత కష్టపడ్డానో వివరించేందుకేనని వెల్లడి
- ఎమ్మెల్సీ సీటు అడిగేందుకుకాదంటూ వివరణ
- తనది పడి పడి అడిగే గుణం కాదని స్పష్టీకరణ
- ఊహాగానాలతో కూడిన వార్తలు రాయొద్దని వినతి

హైదరాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసేందుకు టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి రైలులో ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. 2017లో సంగారెడ్డిలో తాను రాహుల్‌గాంధీ సభను భారీ ఎత్తున నిర్వహించానని, ఆ సభ ఏర్పాట్ల కోసం తాను ఎంత కష్టపడిందీ వివరించేందుకే ఢిల్లీకి వెళ్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీటు కోసం జగ్గారెడ్డి ఢిల్లీ వెళుతున్నారంటూ మీడియాలో వార్తలు రావడంతోనే గురువారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. తాను ఎమ్మెల్సీ సీటు అడగట్లేదని, అడగబోనని తెలిపారు. సంగారెడ్డి నుంచి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినా.. పరిస్థితులు అనుకూలించక ఓటమి పాలయ్యానని చెప్పారు. మూడు సార్లు సంగారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా గెలిచానని, ఎమ్మెల్సీ కావాలంటూ పడి పడి అడిగే గుణం తనది కాదని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ సీటు విషయంలో తనపై ఊహాగానాలతో కూడిన వార్తలు రాయవద్దని మీడియాను కోరారు. సంగారెడ్డిలో సభ సందర్భంగా తాను ఎంత కష్ట పడిందీ.. రాహుల్‌కు వివరించేందుకు ఢిల్లీ వెళ్లాలని ఆరు నెలల నుంచీ అనుకుంటున్నానని తెలిపారు. ఆ సభ ఎలాంటి పరిస్థితుల్లో ఏర్పాటు చేశాం? ఎలా నిర్వహించాం? అనే వివరాలను ఆయనకు స్వయంగా వివరించేందుకే ఢిల్లీకి వెళ్తున్నట్లు తెలిపారు. ఢిల్లీకి వెళ్లాక రాహుల్‌గాధీ అపాయింట్‌మెంట్ కోరతానని, దొరికితే ఆయనతో మాట్లాడతానని వెల్లడించారు.


రైలులో ఢిల్లీ వెళ్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

# ముప్పు ముంగిట శ్రీశైలం!

## స్పిల్‌వే దిగువన 120 మీటర్ల లోతైన గుంత
## పునాదుల కిందకూ విస్తరించిందని అనుమానం

- ఏడాది కిందటే ఏపీకి ఎన్‌డీఎస్‌ఏ నివేదిక
- తాజాగా తెలంగాణ ఈఎన్‌సీ ఫిర్యాదుతో వెలుగులోకి..

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టు ప్రమాదపు అంచున ఉందని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ ఏడాది క్రితమే తేల్చింది. జలాశయం కింద భూగర్భంలోని రాతిఫలకాల మధ్య బలహీన అతుకులున్నాయని, అనుబంధ జాయింట్ల మధ్య దూరం పెరిగితే డ్యామ్ పునాదులు రక్షణను కోల్పోయే ప్రమాదం ఉందని అంచనా వేసింది. డ్యామ్ దిగువన ఏర్పడిన భారీ గొయ్యి 120 మీటర్ల లోతు ఉందని, డ్యామ్ పునాదుల కన్నా కిందకు ఆ గుంత విస్తరించి ఉండే అవకాశం ఉందని పేర్కొంది. జలాశయం భద్రత దృష్ట్యా తక్షణమే తగిన అధ్యయనాలు చేసి, మరమ్మతులకు ఉపక్రమించాలని సిఫారసు చేసింది. ఈ మేరకు 2024 ఫిబ్రవరి 7-9 మధ్య ఎన్‌డీఎస్‌ఏ సభ్యులు(విపత్తుల నిర్వహణ) వివేక్ త్రిపాఠి నేతృత్వంలో నిపుణుల కమిటీ శ్రీశైలం జలాశయాన్ని సందర్శించి.. అదే నెలలో నివేదికను సమర్పించింది. తాజాగా శ్రీశైలం డ్యామ్ ప్రమాదపు అంచున ఉన్నా ఏపీ పట్టించుకోవడం లేదంటూ తెలంగాణ ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ ఎన్‌డీఎస్‌ఏకు లేఖ రాయగా.. ఏడాది కిందట నిపుణుల బృందం ఇచ్చిన నివేదిక తాజాగా వెలుగులోకి వచ్చింది.

ఇవీ సిఫారసులు..

- శ్రీశైలం జలాశయం దిగువన డైక్/కాఫర్ డ్యామ్ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలి.
- భారీ గొయ్యికి రెండు వైపులా రాతిఫలకాలకు బోల్టులు అమర్చి కాంక్రీట్‌తో రీఎన్‌ఫోర్స్ చేయాలి.
- గొయ్యి పరిమాణం మరింత పెరగకుండా జలాశయం గేట్ల నిర్వహణలో మార్పులు చేయాలి.
- జలాశయం పునాదుల వరకు గుంత విస్తరించిందా? లేదా? అని డ్రిల్లింగ్ ద్వారా నిర్ధారించాలి.
- ఎగువన ఎడమగట్టుకు రక్షణగా నిర్మించిన గోడ, పియర్, స్పిల్‌వే ఎగువ భాగానికి మరమ్మతు చేపట్టాలి.
- 17/18 బ్లాకులకు రెండో చోట్ల అడ్డంగా వచ్చిన పగుళ్లకు మరమ్మతు చేయాలి.
- డ్యామ్ దిగువన 4, 9, 10 నంబర్ల గేట్ల వద్ద ఏర్పడిన గుంతల లోతును అధ్యయనం చేసి, దాని ఆధారంగా మరమ్మతులను నిర్వహించాలి.
- 16, 17వ బ్లాకుల వద్ద ఏర్పాటు చేసిన రివర్ స్లూయిస్‌ల నుంచి లీకేజీని అరికట్టడానికి అత్యంత ప్రాధాన్యతతో మరమ్మతులు చేయాలి.
- డ్యామ్ ఫౌండేషన్ గ్యాలరీలో ఆందోళనకర రీతిలో సీపేజీ జరుగుతోంది. సీపేజీ అధికంగా ఉన్న బ్లాకులకి కర్టెన్ గ్రౌటింగ్ చేయాలి.
- డ్రెయిన్ రంధ్రాల నుంచి పూడిక తొలగించి సీపేజీ నీళ్ల బయటకి వెళ్లే ఏర్పాట్లు చేయాలి. పూడిక తొలగింపు సాధ్యం కాని పక్షంలో అత్యంత జాగ్రత్తగా కొత్త రంధ్రాలు వేయాలి. భూకంపాల ముప్పు, ప్రాజెక్టుకు వచ్చే వరదపై మళ్లీ అధ్యయనాలు చేపట్టాలి.

### మే చివరికి మరమ్మతులు పూర్తవ్వాలి

- ఏపీ సర్కార్‌కు డెడ్‌లైన్ విధించిన ఎన్‌డీఎస్‌ఏ

హైదరాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతు పనులను మే నెలాఖరులోగా పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వాన్ని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) చైర్మన్ అనిల్ జైన్ ఆదేశించారు. స్పిల్‌వేకు దిగువన ఏర్పడిన భారీ గొయ్యితో డ్యామ్ భద్రతకే పెను ప్రమాదం పొంచి ఉందంటూ ఏడాది కిందటే నిపుణుల బృందం నివేదిక ఇచ్చినా ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. 120 మీటర్ల లోతైన భారీ గొయ్యిని తక్షణమే పూడ్చాలని సూచించారు. శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతు పనులు, ప్లంజ్‌పూల్‌తో పొంచి ఉన్న ప్రమాదంపై తెలంగాణ ఈఎన్‌సీ(జనరల్) అనిల్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఢిల్లీ నుంచి ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ అనిల్‌జైన్ వర్చువల్ విధానంలో గురువారం సమీక్ష జరిపారు. ఇందులో ఏపీ నీటిపారుదలశాఖ ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు, శ్రీశైలం చీఫ్ ఇంజనీర్ కబీర్ బాషా, ఎస్‌ఈ మోహన్, తెలంగాణ ఈఎన్‌సీ అనిల్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీశైలం ప్రాజెక్టు ఎవరి పరిధిలో ఉందని అనిల్‌జైన్ ప్రశ్నించగా.. ఇప్పటిదాకా స్పష్టత లేదని, నిర్వహణను మాత్రం తామే చూస్తున్నామని ఏపీ బదులిచ్చింది. నిర్వహణ చూసే వారే యజమానులని పేర్కొన్న అనిల్‌జైన్.. శ్రీశైలం ప్రాజెక్టు యజమానిగా శ్రీశైలం సీఈ, నాగార్జునసాగర్ యజమానిగా నల్లగొండ సీఈ ఉంటారని స్పష్టం చేశారు. ఆయా రిజర్వాయర్లను రక్షించుకోవడం, మరమ్మతులు చేయించడం ఓనర్ల బాధ్యత అని, విస్మరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. 2009లో వచ్చిన వరదలతో రిజర్వాయర్ దిగువ భాగంలో భారీ గుంత ఏర్పడిందని, ప్రెజర్ సెల్స్ పనిచేయడం లేదని, డ్రెయినేజీ రంధ్రాలు మూసుకుపోయాయని తెలంగాణ ఈఎన్‌సీ అనిల్‌కుమార్ గుర్తు చేశారు. ప్లంజ్ పూల్‌ను వెంటనే కాంక్రీట్ దిమ్మెలతో నింపాలని కోరారు. అయితే, ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ప్రకారం అధ్యయనం చేసి, సిఫారసు చేయడానికి వీలుగా కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన కేంద్రానికి(సీడబ్ల్యూపీఆర్‌ఎస్‌కు) బాధ్యతలు అప్పగించామని ఏపీ వివరణ ఇచ్చింది. వానాకాలం లోపు పూర్తి చేసేందుకు వీలుగా ఇప్పటి నుంచే మరమ్మతులు ప్రారంభించాలని, మే ఆఖరులోగా పూర్తి చేయాలని అనిల్‌జైన్ సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే.. జరిగే నష్టానికి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కాగా, ప్రాజెక్టు వద్ద ప్లంజ్‌పూల్‌ను పూడ్చేందుకు శుక్రవారం నుంచే రంగంలోకి దిగాలని ఏపీ జలవనరుల శాఖ నిర్ణయించింది. గొయ్యి పూడ్చివేతకు వినియోగించిన టెక్నాలజీపై మేధోమధనం చేపట్టనున్నట్లు తెలిసింది.


తిగుల్ పాఠశాలలో విద్యాబోధన చేస్తున్న రిటైర్డ్ టీచర్ బాల్‌రెడ్డి

# అవిశ్రాంత ఉపాధ్యాయుడు!

- ఉద్యోగ విరమణ చేసినా.. 19 ఏళ్లుగా పిల్లలకు పాఠాలు
- ఏడో క్లాసు వరకు తెలుగు, లెక్కలు, ఇంగ్లీషు చెబుతారు
- పైసా తీసుకోరు.. ప్రయాణ ఖర్చులు తానే పెట్టుకుంటారు
- సిద్దిపేట జిల్లా తిగుల్‌కు చెందిన బాల్‌రెడ్డి సార్ ఆదర్శమిది

జగదేవ్‌పూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బోధన పట్ల ఎంతో మక్కువ ఉంటే తప్ప.. పిల్లలకు అభ్యసనం చేయించాలనే ఎంతో తపన ఉంటే తప్ప తిగుల్ బాల్‌రెడ్డి సార్ మాదిరిగా ఉండటం కష్టమేమో! ఆయన ఓ అవిశ్రాంత ఉపాధ్యాయుడు. ఉద్యోగ విరమణ చేసిన తర్వాత కూడా ఆయన బడికి వెళ్లి పిల్లలకు పాఠాలు చెబుతున్నారు. అదీ ప్రతిఫలంగా నయా పైసా తీసుకోకుండానే! పైగా ప్రయాణ ఖర్చులన్నీ తానే పెట్టుకుంటారు. ఆటో ఎక్కి.. 15 కి.మీ దూరం ప్రయాణించి ఉదయం తొలిగంట కొట్టే వేళకు బడికి చేరుకుంటారు. పొద్దంతా పాఠాలు చెప్పి.. సాయంత్రం బడి విడిచాకే ఇంటికి తిరిగొస్తారు! ఇలా ఆయన గత 19 ఏళ్లుగా పిల్లలకు ఫ్రీగా చదువు చెబుతున్నారు. 78 ఏళ్ల వయసులోనూ ఆయన అలసట అనేదే లేకుండా బడి పిల్లలకు తెలుగు, గణితం, ఆంగ్లం సబ్జెక్టులను బోధిస్తున్నారు. బాల్‌రెడ్డి సార్ స్వస్థలం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామం. 1970లో ములుగు మండలం అచ్చాయిపల్లిలో ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా చేరారు. 2004లో జగదేశ్‌పూర్ మండలం అనంతసాగర్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ చేశారు. రిటైర్‌మెంట్‌కు కొన్నేళ్ల ముందే ఆయన గజ్వేల్‌లో స్థిరపడ్డారు. ఉద్యోగ విరమణ చేశాక కొన్ని నెలలు ఇంట్లో విశ్రాంతి తీసుకున్నారు. 2005 నుంచి దాచారం, క్యాసారం, ప్రజ్ఞాపూర్, తిమ్మక్కపల్లి తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో పాఠాలు బోధించారు. గత పదేళ్లుగా తన స్వగ్రామమైన తిగుల్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పాఠాలు చెబుతున్నారు. ప్రభుత్వ బడులకు నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలే వస్తారని.. వారికి బయట ట్యూషన్లు చెప్పించుకునే స్తోమత ఉండదని.. అందుకే వారికి చక్కని చదువు అబ్బాలనే ఉద్దేశంతో చదువు చెబుతున్నానని బాల్‌రెడ్డి సార్ చెప్పారు. పిల్లలకు బోధిస్తూ వారి మధ్య గడుపుతుండటం ఎంతో సంతోషాన్నిస్తోందని.. ఆరోగ్యం సహకరించినన్ని రోజులూ ఉచిత బోధనను కొనసాగిస్తానన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో నైతిక విజయం మాదే

- ఓటమి బాధ్యతను పెంచింది: నరేందర్‌రెడ్డి



కరీంనగర్ అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-నిజామాబాద్-మెదక్-ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నైతిక విజయం కాంగ్రెస్‌దేనని ఆ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పట్టభద్రులంతా తనకు అండగా నిలిచి ఓట్లు వేశారని అన్నారు. ఓటమి తన బాధ్యతను మరింత పెంచిందని, కాంగ్రెస్ వాదిగా పార్టీలో మరింత చురుకుగా పని చేస్తూ ప్రత్యక్ష రాజకీయాల్లో కొనసాగుతానని చెప్పారు. కరీంనగర్ కాంగ్రెస్‌లో నాయకత్వలోపం స్పష్టంగా కనబడుతోందని, పార్టీ ప్రక్షాళనకు కృషి చేస్తానని తెలిపారు. 28,686 చెల్లుబాటు కాని ఓట్లే తన ఓటమికి కారణమని. అందులో పది వేల ఓట్లు తనకు వచ్చేవేనని చెప్పారు. చెల్లని ఓట్లపై పరిశీలన చేయాలని ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశానని తెలిపారు.

# 10 నుంచి ఐసెట్ దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఐసెట్ నోటిఫికేషన్ గురువారం విడుదలైంది. ఈనెల 10 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని తెలంగాణ ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డి తెలిపారు. మే 3వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని వివరించారు.

# ప్రేమ విషయం ఇంట్లో చెప్పలేక ప్రేమజంట ఆత్మహత్య!

- కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఘటన


అలేఖ్య(ఫైల్)


అరుణ్‌కుమార్ (ఫైల్)

కరీంనగర్ క్రైం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలో ఓ ప్రేమజంట బలవన్మరణానికి పాల్పడింది. చొప్పదండి మండలం భూపాలపట్నంకు చెందిన నాంపల్లి అలేఖ్య (21), చిట్యాలపల్లికి చెందిన కొండపర్తి అరుణ్ కుమార్ అలియాస్ అభి(24) సమీప బంధువులు. వీరిద్దరూ కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. అరుణ్‌కుమార్ జిల్లా కేంద్రంలోని వావిలాలపల్లిలో అద్దె ఇంట్లో ఉంటూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అలేఖ్య కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ కళాశాలలో డిగ్రీచదువుతోంది. ఇటీవల అలేఖ్య తల్లిదండ్రులు ఆమెకు మరో వ్యక్తితో పెళ్లి చేయాలని నిర్ణయించారు. అప్పుడు అలేఖ్య తన ప్రేమ విషయం తల్లిదండ్రులకు చెప్పే ధైర్యం చేయలేకపోయింది. ఈ క్రమంలో తల్లింద్రులు ఆమెకు నిశ్చితార్థం కూడా చేశారు. బుధవారం అలేఖ్య కళాశాల నుంచి ధ్రువపత్రాలు తెచ్చుకోవాలని చెప్పి అరుణ్‌కుమార్ ఉంటున్న అద్దె ఇంటికి వచ్చింది. ఫోన్ కూడా స్విచ్చాఫ్ చేసింది. ఎప్పటికీ తిరిగి రాకపోవడంతో అలేఖ్య తల్లిదండ్రులు వెతికినా ప్రయోజనం లేకపోయింది. మరోవైపు అరుణ్‌కు అతడి తల్లిదండ్రులు ఎన్నిసార్లు ఫోన్ చేసినా సమాధానం లేకపోవడంతో గురువారం అతడు ఉంటున్న ఇంటికి వచ్చారు. బలవంతంగా తలుపులు తెరిచి చూడగా అలేఖ్య, అరుణ్‌లు ఉరేసుకున్న స్థితిలో కనిపించారు. మృతుల తల్లిదండ్రుల ఫిర్యాదుల మేరకు విడివిడిగా కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# కొలంబియా అమ్మాయి.. తెలంగాణ అబ్బాయి

- కేసముద్రంలో ఘనంగా వివాహం


పెళ్లిలో వధూవరులు రియా- సాయి చైతన్య

కేసముద్రం, మార్చి 6: ప్రేమకు ఎల్లలు లేవని ఆ జంట నిరూపించింది. ఖండాలు దాటిన ఆ జంట ప్రేమ ఏడు అడుగులతో నూరేళ్ల వివాహ బంధంలోకి అడుగిడింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రానికి చెందిన వేల్పుల రాజేష్ యాదవ్- ప్రసన్నలత దంపతుల పెద్ద కొడుకు సాయి చైతన్య ఉన్నత చదువుల నిమిత్తం ఎనిమిదేళ్ల క్రితం ఆస్ట్రేలియా వెళ్లారు. చదువు పూర్తయ్యాక అక్కడే ఓ కంపెనీలో ఈవెంట్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. అదే కంపెనీలో అకౌంటెంట్‌గా చేరిన దక్షిణ అమెరికా ఖండంలోని కొలంబియా దేశానికి చెందిన యుక్లేడిస్ ఖింతేరో- వోల్గా మరియ దంపతులు కూతురు రియాతో సాయి చైతన్యకు నాలుగేళ్ల క్రితం ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దాంతో ఇరు కుటుంబాలను ఒప్పించుకుని గురువారం కేసముద్రం అమినాపురంలో హిందూ సంప్రదాయంలో ఘనంగా పెళ్లి చేసుకున్నారు. వధువు అన్న- వదిన సరియో- జులియానా పెళ్లికి హాజరయ్యారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# వికటించిన న్యాయం

వందేళ్ళ చరిత్ర ఉన్న తమిళ మీడియా సంస్థ వికటన్‌కు మద్రాస్ హైకోర్టులో తాత్కాలిక ఉపశమనం దక్కింది. ఈ మ్యాగ్‌జైన్ వెబ్‌సైట్‌ను అన్‌బ్లాక్ చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని గురువారం న్యాయమూర్తి ఆదేశించారు. అయితే, ఏ కార్టూన్ కారణంగా కేంద్ర ప్రభుత్వం ఆగ్రహంతో సదరు సంస్థ వెబ్‌సైట్‌ను బ్లాక్‌చేసిందో, ఆ కార్టూన్‌ను తీసివేయాలన్న ముందస్తు షరతు ఇందులో ఉంది. షరతుకు అంగీకరించిన పక్షంలోనే, సదరు వెబ్‌సైట్ మళ్ళీ తెరమీద ప్రత్యక్షమవుతుందన్న ఈ ఆదేశాలు మధ్యంతరం కావచ్చును, అంతిమతీర్పు మిగిలే ఉండవచ్చు. కానీ, న్యాయస్థానం ఇలా అతిజాగ్రత్తగా వ్యవహరించడం మిగతా మీడియా సంస్థలకు ఉత్తేజాన్నిచ్చే అంశమైతే కాదు.

అక్రమవలసదారులంటూ కాళ్ళకూ చేతులకూ గొలుసులు కట్టి, మొఖానికి మాస్కులు పెట్టి అమెరికా తన విమానాల్లో మన పౌరులను పంజాబ్‌లో దించేసినందుకు దేశం యావత్తూ బాధపడింది, అవమానపడింది. ఇంత అమానుషంగా, అగౌరవంగా వ్యవహరించడాన్ని ప్రశ్నించకపోతే ఎలా? అని విపక్షాలు ప్రభుత్వాన్ని విమర్శించాయి. ప్రభుత్వం మౌనంగా ఉండటం సరికాదని తప్పుబట్టాయి. ఆవేదనని అమెరికా సర్కారుకు తెలియచేశామని, అయితే, అక్రమార్కులను అలా గొలుసులు కట్టి పంపడం వాళ్ళ విధానమని మన ప్రభుత్వం వ్యాఖ్యానించింది. ఈ వివరణ మన పరువు మరింత దిగజార్చేట్టు ఉన్నదని మళ్ళీ విపక్షాలు తప్పుబట్టాయి. ఈ నేపథ్యంలో, ప్రధాని మోదీ అమెరికా పర్యటన జరిగింది. భేటీలో ఈ అంశాన్ని మోదీ ప్రస్తావించకపోవడంపైన కూడా విమర్శలు వచ్చాయి. ట్రంప్ పక్కనే మోదీ గొలుసులతో కూర్చుని ఉన్న ఈ కార్టూన్ తమిళనాడు బీజేపీ అధినేత అన్నామలైకి ఆగ్రహం కలిగించింది. వికటన్ మ్యాగజైన్ డీఎంకేకు ప్రచారసాధనంలాగా తయారైందని, ప్రధానికి వ్యతిరేకంగా నిరాధారమైన కథనాలు ప్రచురిస్తోందని ఆయన ఓ ఫిర్యాదు సంధించారు. అది ఢిల్లీ చేరిన కొద్దిగంటల్లోనే సదరు సంస్థ వెబ్‌సైట్, దాని యాప్‌లు పనిచేయడం మానేశాయి. కార్టూన్ ఫిబ్రవరి 10న ప్రచురితమైతే, ఐదురోజుల అనంతరం కేంద్రప్రభుత్వం తన వెబ్‌సైట్ బ్లాక్ చేసిందనీ, ఫిబ్రవరి 25వరకూ తనకు అధికారికంగా సమాచారమివ్వలేదని వికటన్ వాదన. కార్టూన్ మంచిచెడ్డలను అటుంచితే, వందేళ్ళ చరిత్ర ఉన్న ఒక సంస్థకు చెందిన వెబ్‌సైట్ మూసేయాలని కేంద్ర ప్రభుత్వం అంతవేగంగా ఎలా నిర్ణయానికి రాగలిగిందో అర్థం కాదు. ఫిర్యాదులో బలంకంటే, ఫిర్యాదిదారు బలవంతుడు కావడం వల్ల కాబోలు భావప్రకటనా స్వేచ్ఛలు, హక్కులు పక్కకు పోయి, కొద్ది గంటల్లోనే ఎదుటిపక్షానికి కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా మ్యాగజైన్‌ను మూసేశారు. ఈ కార్టూన్ దేశ ప్రయోజనాలకు వ్యతిరేకమైనదని నిర్ధారించి కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నదా, లేక ఆనందవికటన్ సంస్థ ప్రత్యర్థి పార్టీకి అనుకూలమనీ, బీజేపీకి వ్యతిరేకమని అన్నామలై చేసిన ఆరోపణతో ఏకీభవించి జరిగిందా?

కేంద్రం నిర్ణయం భావప్రకటనాస్వేచ్ఛకు వ్యతిరేకమని, ఇది పూర్తిగా రాజకీయ ప్రేరేపిత చర్య అనీ ఎడిటర్స్ గిల్డ్ నుంచి తమిళనాడులోని అన్ని మీడియా సంస్థల వరకూ విమర్శించాయి. ఆ కార్టూన్ భావప్రకటనా స్వేచ్ఛ పరిమితుల్లోనే ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది సమర్థించారు, ఇది విదేశాలతో మనకున్న బలమైన బంధాలను దెబ్బతీస్తుందని న్యాయస్థానంలో అడిషనల్ సొలిసిటర్ జనరల్ వాపోయారు. మంచీ చెడూ తేల్చేలోగా ఇచ్చిన ఈ తాత్కాలిక తీర్పులో సమపాళ్ళలో న్యాయం చేస్తున్నట్టు న్యాయమూర్తికి అనిపించి ఉండవచ్చు. కానీ, కేంద్రానికి నచ్చని కార్టూన్‌ని తీసివేయమని చెప్పడం ద్వారా ఆ నియంత్రణను సమర్థించినట్టే అయింది. విచారణ కొనసాగుతుందనీ, వెంటనే వెబ్‌సైట్‌ను పునరుద్ధరించాల్సిందేనని ఆదేశించివుంటే బాగుండేది. తద్వారా ఎటువంటి వివరణలు అడగకుండా, ఏకపక్షంగా, కేంద్రం తీసుకున్న ఆ నిర్ణయాన్ని ప్రశ్నించినట్టూ అయ్యేది. కార్టూన్‌ను తొలగించాల్సిందిగా ఆదేశించి, అందుకు సదరు సంస్థ నిరాకరించినపక్షంలో నిర్దిష్టమైన ప్రక్రియను అనుసరించాల్సిన బాధ్యత కేంద్రానికి ఉన్నది. ఈ కార్టూన్ ద్వారా చేసిన రాజకీయ విమర్శతో అమెరికాలో మనదేశం పరువుపోతుందనీ, ఆ దేశంతో మన సంబంధాలు దెబ్బతింటాయన్న వాదనతో ఏకీభవించడం కష్టం. డోనాల్డ్ ట్రంప్ చర్యలూ చేష్టలమీద అక్కడి మీడియాలో ఎటువంటి విశ్లేషణలు, వ్యాఖ్యలు, కార్టూన్లు వస్తున్నాయో, అవి ఎంత ఘాటుగా ఉంటున్నాయో మన పాలకులు ఒకసారి గమనిస్తే బాగుంటుంది.

# కాలుష్యరహిత నగరంగా ఢిల్లీ

ఢిల్లీ శాసనసభ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. కొత్త పార్టీ అధికారంలోకి వచ్చింది.. ప్రజాస్వామ్య నర్తన మహత్యమిది. అయితే ఈ సారి పాలక పక్షం మారిపోవడంలో ఒక కీలక వ్యత్యాసమున్నది. అధికారంలో ఉన్న పార్టీకి వ్యతిరేకంగా ఎందుకు ఓటు వేశారు అన్న ప్రశ్నకు సమాధానంగా పలు అపరిష్కృత సమస్యలను ఓటర్లు ప్రస్తావించారు.. అవన్నీ ఢిల్లీ ప్రజలను ఎడతెగకుండా వేధిస్తున్నవే. అయినప్పటికీ అధికార పార్టీ వాటిని పరిష్కరించేందుకు సరైన ప్రాధాన్యమివ్వలేదు. ఏమిటా సమస్యలు? ఢిల్లీ నగరంలో 22 కిలోమీటర్ల పొడవునా ప్రవహిస్తున్న యమునా నది కాలుష్య కూపంగా మారిపోవడం అన్ని సమస్యలలోకి అగ్రగణ్యమైనది. ఆరోగ్యకరమైన శ్వాసను నిరోధిస్తున్న వాయుకాలుష్యం, వీధుల్లో పేరుకుపోతున్న చెత్త కుప్పలు మొదలైనవి కూడా ఢిల్లీవాలాలను పీడిస్తున్న సమస్యలు. ఇటువంటి పర్యావరణ సమస్యలను రాజకీయ పక్షాలు తమ ఎన్నికల ప్రణాళికలలో తప్పక ప్రస్తావించేవి, వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చేవి. అయితే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఢిల్లీ వాసులు ఆ సమస్యల గురించి గొంతెత్తి చెప్పారు, ఎప్పుడు పరిష్కరిస్తారని రాజకీయ పార్టీలను, వాటి అభ్యర్థులను నిలదీశారు. ప్రజల ఈ నిక్కచ్చి వైఖరి పరిస్థితులలో మార్పుకు తప్పకుండా దారితీయగలదనే ఆశాభావం కలిగిస్తోంది.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

యమునా నదిని పరిశుభ్రం చేసి, నిర్మల వాహినిగా మార్చేందుకు పూనుకుంటున్న కొత్త ప్రభుత్వం కొన్ని వాస్తవాలను స్పష్టంగా గుర్తుంచుకోవాలి. మొదటిది–అధికారం నుంచి దిగిపోయిన ప్రభుత్వమూ, దానికి ముందున్న ప్రభుత్వమూ యమునా నదిని పరిపూర్ణంగా స్వచ్ఛపరిచేందుకు నిబద్ధతతో శ్రద్ధాసక్తులు చూపాయి. సందేహం లేదు. ఒక మురుగునీటి కాలువగా తయారయిన యమునా నదిలో పూర్వపు స్వచ్ఛతను పునరుద్ధరించేందుకు అన్ని ప్రభుత్వాలూ సంకల్పించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలూ రెండూ యమునానది ప్రక్షాళనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి, ఖర్చు చేశాయి. ఇక్కడ చెప్పవలసినదేమిటంటే ప్రభుత్వాల నిబద్ధత, ఆర్థిక వనరుల లభ్యతకు సంబంధించి ఎటువంటి లోటు లేదు.

ఇక రెండోది– యమునా నదిని సంపూర్ణంగా పరిశుభ్రం చేసేందుకు ఒక కార్యాచరణ ప్రణాళిక ఉన్నది. ఎంతయినా అది దేశ రాజధాని గుండా ప్రవహిస్తోంది కదా. అయితే ఈ కార్యాచరణ ప్రణాళిక అమలవుతున్న తీరుతెన్నులను ఉన్నత న్యాయస్థానాలు క్రమబద్ధంగా సమీక్షిస్తున్నాయి. ప్రతినెలా ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం చాలా శ్రద్ధగా ఒక నివేదిక కోర్టుకు సమర్పిస్తోంది. కనుక కొత్తగా అధికారాన్ని చేపట్టిన ప్రభుత్వం యమునా నది ప్రక్షాళనకు అసలేమీ జరగలేదని, ఆ విషయం గురించి పట్టించుకోలేదని ఎట్టి పరిస్థితులలోను భావించకూడదు. ఎన్నికల ప్రచార పర్వంలో మాత్రమే అటువంటి విమర్శలు అభియోగాలు చెల్లుబాటు అవుతాయి. అయితే ఇప్పుడు నిర్ణయాత్మకంగా చర్యలు చేపట్టవలసి ఉన్నందున అటువంటి వాద ప్రతివాదాలు ఎంతమాత్రం అర్థవంతమైనవి కాబోవు.



ప్రస్తుతం ఢిల్లీ నగరం యమునానది నుంచి నీటిని తీసుకుని మురికి నీటిని తిప్పి పంపిస్తుంది. అలా కాకుండా నీటిని తీసుకుని శుద్ధిచేసిన వ్యర్థజలాలను మాత్రమే తిరిగి నదికి పంపేలా జాగ్రత్త వహించాలి. అప్పుడు మాత్రమే ఢిల్లీలో యమునా నది స్వచ్ఛ వాహినిలా పునర్జీవిస్తుంది.

నిబద్ధతా పూర్వకమైన లక్ష్య శుద్ధితో, వేల కోట్ల రూపాయాలు ఖర్చు చేసినప్పటికీ యమునా నది పరిస్థితి ఎందుకు మెరుగుపడలేదు? ఈ విషయమై ఇప్పుడు నిశిత, నిష్పాక్షిక చర్చ జరగవలసి ఉన్నది. యమునా నది ఢిల్లీ నగరంలోకి ప్రవేశిస్తున్న పల్లా అనే ప్రదేశంలో యమునా జలాల నాణ్యత సంవత్సరం పొడుగునా అనేకనెలల్లో శ్రేష్ఠంగా ఉంటుందని ఢిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ నెలవారీ నివేదిక స్పష్టంగా పేర్కొంటోంది. అయితే ఢిల్లీలోకి ప్రవేశించి తన 22 కిలోమీటర్ల ప్రస్థానాన్ని ఆరంభించిన తరువాత కొద్ది కిలోమీటర్ల దూరంలోనే యమునా వాహిని కాలుష్యమయమైపోతోంది. ఇంటర్ స్టేట్ బస్ టెర్మినల్ వద్ద నీటి నాణ్యతను తనిఖీ చేసే సమయానికి నదీజలాల్లో ఆక్సిజన్ పూర్తిగా హరించుకుపోతోంది. ఆక్సిజన్ కొరవడడమంటే యమునా జలాలు జీవరహితంగా మారిపోవడమే. దీన్నిబట్టి ఢిల్లీ నగరంలో నది ఒక మృత వాహినిగా అయిపోయిందని చెప్పక తప్పదు. వాస్తవమేమిటంటే కార్యాచరణ పథకం ప్రభావవంతం కావాలంటే దాన్ని పునః రూపొందించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. యమునా నది ప్రక్షాళనకు మనం చేయవలసినవి సరిగ్గా చేయడం లేదు. ఇదొక నిష్ఠుర సత్యం. దీన్ని అర్థం చేసుకోవలసిన అవసరమున్నది. ఈ దృష్ట్యా యమునా నది ప్రక్షాళన అజెండా ఎలా ఉండాలి?

తొలుత మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టీపీ) నిర్మించడం పైనే కాకుండా నిలిపివేసి, శుద్ధికి తీసుకువెళ్లే మురుగు పరిమాణంపై కూడా దృష్టి పెట్టాలి. అంటే ఢిల్లీలోని చాలా విస్తృత ప్రాంతాలు భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థలతో అనుసంధానం కాబడలేదనే వాస్తవాన్ని అంగీకరించవలసి ఉన్నది. ప్రస్తుత కార్యాచరణ పథకం ఈ అనుసంధాన పనులకు పెద్దగా ప్రాధాన్యమివ్వడంలేదు. ఈ కారణంగానే సెప్టిక్ ట్యాంక్‌ల నిర్వహణకు డి–స్లడ్జింగ్ ట్యాంకర్స్‌పై ఆధారపడడం మినహా ప్రజలకు మరో ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. చేపట్టవలసిన కీలక చర్య డి–స్లడ్జింగ్ ట్యాంకర్లు అన్నిటినీ రిజిస్టర్ అయ్యేలా చూడాలి. వాటిలో జీపీఎస్ ఏర్పాటును తప్పనిసరి చేయాలి. ఆ ట్యాంకర్ల కదలికలను పర్యవేక్షించేందుకు ఒక కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేయాలి. సెప్టిక్ ట్యాంక్‌లలోని పంకంను విధిగా శుద్ధి కేంద్రాలకు తీసుకువెళ్లేలా చూడాలి. దీనివల్ల ఉపయోగించిన నీటిని, శుద్ధి చేసిన మలాన్ని పునః ఉపయోగించుకోవడం వీలవుతుంది. ఇక రెండోది శుద్ధి చేసిన వ్యర్థ జలాలను మోరీలలోకి వదలకూడదు. ఎందుకని? అలా చేయడం వల్ల అనుసంధానం కాబడని ప్రదేశాల నుంచి వచ్చిన శుద్ధిచేయబడని వ్యర్థజలాలతో కలిసిపోతాయి. శుద్ధిచేసిన మురికి ద్రవాలు, పదార్థాలను పునః ఉపయోగించాలి. ఢిల్లీ ఎకనామిక్ సర్వే ప్రకారం శుద్ధిచేసిన వ్యర్థ జలాలలో కేవలం 10 శాతాన్ని మాత్రమే తిరిగి ఉపయోగించుకోవడం జరుగుతోంది. చాలా ఎస్‌టీపీలు నది సమీప ప్రాంతాలలో ఉండడం లేదు. ఈ కారణంగా శుద్ధిచేసిన వ్యర్థజలాలను శుద్ధి చేయబడని మురుగునీటిని నదికి తీసుకువెళుతున్న మోరీలలోకి వదిలివేయడం జరుగుతోంది. మరి యమునా జలాల నాణ్యత మెరుగ్గా ఉండకపోవడంలో ఆశ్చర్యమేముంది? ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలోని 22 మోరీల నిర్వహణకు ప్రాధాన్యమిచ్చేలా కార్యాచరణ పథకంలో మార్పులు చేయవలసిన అవసరమున్నది. ప్రతి మోరీ నిర్వహణకు ఒక ప్రత్యేక ప్రణాళికను ఉండేలా ఢిల్లీ ప్రభుత్వం శ్రద్ధ చూపాలి. శుద్ధిచేయబడని మురుగునీరు నదిలోకి పారకుండా నిరోధించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించాలి. శుద్ధిచేసిన వ్యర్థ జలాలను శుద్ధిచేయబడని వ్యర్థ జలాలతో కలవకుండా చూడాలి.

ప్రస్తుతం ఢిల్లీ నగరం యమునానది నుంచి నీటిని తీసుకుని మురికి నీటిని తిప్పి పంపిస్తుంది. అలా కాకుండా నీటిని తీసుకుని శుద్ధిచేసిన వ్యర్థజలాలను మాత్రమే తిరిగి నదికి పంపేలా జాగ్రత్త వహించాలి. అప్పుడు మాత్రమే ఢిల్లీలో యమునా నది స్వచ్ఛ వాహినిలా పునర్జీవిస్తుంది.

(సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

# ఇన్ని అసమానతలతో ఆర్థికశక్తిగా నిలవగలమా?

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఇటీవల బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో మార్చి 10న సమావేశాలు తిరిగి ప్రారంభం కానున్నాయి. మలిదశ బడ్జెట్ సమావేశాల్లో బడ్జెట్ పద్దులు, జమాఖర్చులు, లెక్కల పైనే కాకుండా దేశ ఆర్థిక గమనం, గమ్యంపై చర్చ జరగాల్సిన అవసరముంది. ఆ చర్చ ఆర్థిక అసమానతలు రూపుమాపేలా ఉండాలి. ఇందుకు కొన్ని అధ్యయన వివరాలను, వాస్తవ స్థితిగతులను, పరిష్కార మార్గాలను కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల ముందు పెట్టాలి. ఇందుకు ఇటీవల విడుదలైన ఓ ప్రతిష్ఠాత్మక సర్వే దోహదపడుతుందని భావిస్తున్నాను.

ప్రపంచంలోని ప్రముఖ ఆర్థికవేత్తలు, నిపుణులతో కూడిన 'వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్' సంస్థ 'భారతదేశంలో ఆదాయం, సంపద, అసమానతలు: 1922–2023' పేరుతో విడుదల చేసిన ఓ నివేదిక భారతదేశంలోని ప్రజల గత వంద సంవత్సరాల స్థితిగతులను బహిర్గతం చేసింది. సంపద, ఆదాయంలో తారతమ్యాలు విస్తృతమయ్యాయని ఈ నివేదిక వెల్లడించింది. సామాజిక, ఆర్థిక విభజనను సృష్టించడంపై తక్షణం దృష్టి సారించాల్సిన ఆవశ్యకతను తెలియజేసింది. ఈ నివేదిక ప్రకారం– భారతదేశంలో అట్టడుగు 50శాతం జనాభా వద్ద 6.4శాతం సంపద మాత్రమే ఉంటే; 10శాతం ధనికుల వద్ద 65శాతం సంపద; 40శాతం మధ్యతరగతి ప్రజల వద్ద 28.6శాతం సంపద మాత్రమే ఉంది. ఈ గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. విధాన నిర్ణయకర్తలు, రాజకీయ పార్టీలు ప్రణాళికలను, ఆర్థిక విధానాలను, బడ్జెట్‌ను రూపొందించేటప్పుడు ఈ అసమానతలను పరిగణనలోకి తీసుకోవాలి.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలినాళ్లలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలోని భారత ప్రభుత్వం మిశ్రమ ఆర్థికవ్యవస్థ గురించి ఆలోచించింది. పెట్టుబడిదారీ విధానం, సామ్యవాదం రెండింటి సూత్రాలను సమన్వయంతో పాటిస్తూ దేశీయ పరిశ్రమలను సురక్షితం చేసింది. మిశ్రమ ఆర్థికవ్యవస్థ స్వావలంబన ఆర్థికవ్యవస్థకు పునాదులు వేసింది. కీలక రంగాల్లో అభివృద్ధి ప్రభుత్వ ఆధ్వర్యంలోనే జరగాల్సిన ఆవశ్యకతను తెలియజెప్పింది. ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడులు ఆర్థిక విస్తరణకు పునాదిగా దోహదపడ్డాయి. ప్రభుత్వరంగ సంస్థలు విజయాలు నమోదు చేసినప్పటికీ ప్రభుత్వరంగ సంస్థల్లో అసమర్థ పనితీరు, అధికారికమైన ఆటంకాలు, పరిమితమైన ప్రైవేటురంగం భాగస్వామ్యం వల్ల ఆర్థిక ప్రగతి కుంటుపడింది. ఈ లోపాల నేపథ్యంలో 1990 దశకంలో సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్పీజీ) సంస్కరణను స్వీకరించేందుకు దోహదం చేశాయి.

భారత మార్కెట్‌లో విదేశీ పెట్టుబడులకు దారులు తెరవడం వల్ల ప్రపంచ ఆర్థికవ్యవస్థతో ఏకమైంది. ఆర్థిక సంస్కరణలు అంతకు ముందెప్పుడూ లేనంత వృద్ధికి దారితీశాయి. సాంకేతిక, టెలీ కమ్యూనికేషన్స్, తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆర్థిక సంస్కరణలు ఉత్ప్రేరకంగా పనిచేశాయి. దీంతోపాటు అనేక సవాళ్లనూ సృష్టించాయి. ఆర్థిక సంస్కరణలు ఆచరణలోకి వచ్చిన సమయంలో సృష్టించిన సంపద కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమైంది. సంపద ఫలాలను పంపిణీ చేయడంలో నియంత్రణ వ్యవస్థలు విఫలమయ్యాయని చెప్పవచ్చు. పన్నుల విధింపులో ప్రగతిశీల విధానాలు, సాంఘిక సంక్షేమ పథకాల ద్వారా సంపద పునః పంపిణీకి చర్యలు తీసుకోకపోవడం వల్ల ఆర్థిక అసమానతలు పెరిగాయి. సరళీకరణ ఆర్థిక విధానాల ఫలాలను జనాభాలోని కొంతమంది మాత్రమే అందిపుచ్చుకున్నారు. విస్తృతమైన మెజారిటీ ప్రజలు పెరగని ఆదాయంతో, పెరిగిన జీవన వ్యయంతో, వ్యవస్థాగతమైన అసమానతలతో కొట్టుమిట్టాడుతూ ఉన్నారు.




భారత్ ఆర్థిక మహాశక్తిగా ఎదుగుతున్న ఈ కీలక తరుణంలో సమ్మిళిత అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వక తప్పదు. కాబట్టి ప్రభుత్వ రంగ సంస్థల్లోను, ప్రైవేట్ కంపెనీలోను ప్రజలు పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా ఆర్థిక విధానాల్లో సంస్కరణలు చేపట్టాల్సిన ఆవశ్యకత నెలకొంది. అదే విధంగా ప్రజలు, ముఖ్యంగా మధ్యతరగతి ప్రజానీకం, కూడా పెట్టుబడులు పెట్టేలా వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపర్చేందుకు ప్రభుత్వం తగు చొరవ చూపాలి. అప్పుడే కొందరి లాభమే కాకుండా అందరి శ్రేయస్సు సాధ్యమవుతుంది.

మధ్య తరగతి ప్రజల్లో కొనుగోలుశక్తి తగ్గుతుండగా, జీవన ప్రమాణాలు పెరుగుతున్నాయి. తగినంత నగదు లభ్యత కూడా ఉండటం లేదు. ఫలితంగా చాలా కుటుంబాలు ఆర్థికపరమైన ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నాయి. ప్రముఖ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు కూడా ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నట్టు పరిశీలనలు చెప్తున్నాయి. కొన్ని రోజుల క్రితం నేను టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంటల్ రీసెర్చ్‌కు వెళ్లినపుడు, అక్కడ ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయి ఉద్యోగులు కూడా విపరీతంగా పెరిగిన స్కూల్ ఫీజుల కారణంగా తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడం గగనమైపోయిందని వాపోతున్నారు. ఓ వైపు అధిక ధరలు, మరోవైపు జీవన ప్రమాణాలు పెంచలేని ఆర్థిక వనరులతో మధ్యతరగతి ప్రజలు అయోమయంలో చిక్కుకున్నారు.

ఆర్థిక అసమానతలు రూపుమాపేందుకు నిరంతరం తీసుకోవాల్సిన బహుముఖ మార్గాలను ప్రముఖ ఆర్థిక వేత్త సీహెచ్ హనుమంతరావు తన ప్రతిభావంతమైన పుస్తకం 'రైజింగ్ ఇన్‌కమ్ ఇనిక్వాలిటీస్ ఇన్ ద వేక్ ఆఫ్ గ్లోబలైజేషన్: ఎమర్జింగ్ ఛాలెంజెస్' (ప్రపంచీకరణ నేపథ్యంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలు: ఉద్భవిస్తున్న సవాళ్లు)లో సూచించారు. మౌలిక వసతుల కల్పనలోను, విద్య వైద్య రంగాల్లోను ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలని సూచించారు. గ్రామాల్లో వ్యవసాయాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ; వ్యవసాయేతర రంగాలకు, తయారీ రంగానికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే అసమానతలు తగ్గించేందుకు సరిపడా ఉపాధి అవకాశాలు కల్పించాలని ఉద్ఘాటించారు.



అలాగే కార్మిక హక్కులను బలోపేతం చేయాలని, న్యాయమైన వేతనాల భరోసాను కల్పించాలని, శ్రామికవర్గాల సాధికారత, ఆర్థిక వ్యవస్థలో మధ్యతరగతి భాగస్వామ్యాన్ని పెంచాలని చెప్పారు.

దేశంలో పాలకులు భారీ పరిశ్రమలను పూర్తిగా ప్రైవేటు రంగానికి వదిలేయకుండా ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయాలి. 1997 ఆసియా టైగర్స్ ఆర్థిక సంక్షోభం నుంచి, 2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం నుంచి ప్రభుత్వరంగ బ్యాంకులే దేశాన్ని కాపాడాయి. మన దగ్గర ఉన్న మానవ వనరులను సద్వినియోగం చేసుకోవాలి. కొత్త తరానికి ఉపాధి అవకాశాలు కల్పించాలి. రైల్వే, విమానయాన రంగాలు, ఉక్కు, బొగ్గు వంటి తయారీ రంగాల్లో ప్రభుత్వరంగ పెట్టుబడులు ఉపసంహరించుకోవడం సరికాదు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వహించడం అంటే నష్టాలను భరించడం కాదని పాలకులు గుర్తించాలి. ప్రభుత్వరంగ సంస్థల విజయాలెన్నో చరిత్రలో ఇందుకు నిదర్శనాలుగా ఉన్నాయి. ఏవైనా నష్టపోయిన సంస్థలుంటే అందుకు కారణమైన గత తప్పిదాలను గుర్తించాలి. పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి. మెరుగైన విధానాలను ప్రవేశపెట్టాలి. లిస్టెడ్ కంపెనీలకు కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్ (ఎంపీఎస్) అవసరంపై సెక్యూరిటీస్ అండ్ ఎక్స్‌ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) నిర్దేశాలు జారీచేసింది. ఎంపీఎస్ నియమం ప్రకారం ఒక కంపెనీ ఈక్విటీ షేర్లలో కనీసం 25శాతం ప్రజల వద్ద కలిగి ఉండాలి. ఎంపీఎస్ శాతాన్ని 50 శాతానికి పెంచితే ప్రైవేట్ సంపద సామాన్య మధ్యతరగతి ప్రజలకు చేరే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం దేశంలో బడా కంపెనీలలో కేవలం 3 శాతం ప్రజలే పెట్టుబడి పెడుతున్నారు. అమెరికా, యూరప్ వంటి దేశాల్లో 50–70 శాతం ప్రజలు కంపెనీలలో భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నారని తెలుస్తున్నది. భారత్ ఆర్థిక మహాశక్తిగా ఎదుగుతున్న ఈ కీలక తరుణంలో సమ్మిళిత అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వక తప్పదు. కాబట్టి ప్రభుత్వ రంగ సంస్థల్లోను, ప్రైవేట్ కంపెనీలోను ప్రజలు పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా ఆర్థిక విధానాల్లో సంస్కరణలు చేపట్టాల్సిన ఆవశ్యకత నెలకొంది. అదే విధంగా ప్రజలు, ముఖ్యంగా మధ్యతరగతి ప్రజానీకం, కూడా పెట్టుబడులు పెట్టేలా వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపర్చేందుకు ప్రభుత్వం తగు చొరవ చూపాలి. అప్పుడే కొందరి లాభమే కాకుండా అందరి శ్రేయస్సు సాధ్యమవుతుంది.


■ బోయినపల్లి వినోద్‌కుమార్
న్యాయవాది, పార్లమెంట్ మాజీ సభ్యులు

# స్వతంత్ర మహిళ.. రాహుల్‌జీ స్వప్నం

స్త్రీ జాతి పట్ల తరతరాలుగా వస్తున్న సంకుచిత, సాంప్రదాయ భావాలని మహాపండితుడు రాహుల్ సాంకృత్యాయన్ అంగీకరించరు. స్త్రీ జాతి కోసం మనుస్మృతిలో చెప్పిన నీతి నియమాలను ఆయన ఖండిస్తారు. మనుస్మృతిలో ఇలా ఉంది. "బాల్యావస్థలో స్త్రీ– తండ్రి సంరక్షణలో, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో పుత్రుని సంరక్షణలో ఉండాలి. స్త్రీ స్వాతంత్ర్యానికి అనర్హురాలు. తన కోర్కెలకి అనుగుణంగా ఏ పనీ చేయరాదు."

బాల్యావస్థలో సంరక్షణ అనివార్యమైనా, తరువాత స్త్రీ ఎవరి సంరక్షణలోనూ ఉండాల్సిన అవసరం లేదంటారు రాహుల్‌జీ. స్త్రీ పరాధీనురాలుగా ఉండటం, భర్తపైన ఆర్థికంగా ఆధారపడడం అనేది పాతకాలపు మాట. ఇప్పుడు ఆ రోజులు గతించిపోయాయి. పురుషులతో సమానంగా స్త్రీలు తమ హక్కులను పొందే నిజమైన హక్కుదారులు. మానవ సమాజం, మానవ జీవితం సాధించుకున్న అన్ని రంగాలలో ప్రవేశించడానికి స్త్రీలకి హక్కు ఉన్నది. ఆ రంగాల ద్వారాలు ఆమె కోసం తెరుచుకుని ఉన్నాయి. ఆమె ఎందుకు వెనుకబడి ఉండాలి?

ఇంటి నాలుగు గోడల మధ్యనే స్త్రీ స్థానం. ఆమె గడప బయట కాలు పెట్టరాదు. భర్త, కుటుంబానికి సేవ చేస్తూ ఇంటి పనులను చక్కబెట్టడమే ఆమె పని అనే అవగాహనని పాతకాలపు పురాణవాదుల బుర్ర నుంచి పుట్టిన నియమాలని రాహుల్‌జీ అనేవారు. వాస్తవానికి రాహుల్‌జీ జీవితంపైనా, స్త్రీ జాతి పట్ల వారి అవగాహనపైనా సామ్యవాద ఆలోచనా విధాన ప్రభావం చాలా ఉన్నది. స్త్రీని కేవలం భోగ వస్తువుగా కాకుండా సమాజంలో ఆమెకి కూడా సమాన అవకాశాలు ఉండాలని చెబుతూ అయన స్త్రీల పక్షాన నిలబడ్డారు. స్త్రీలలో కేవలం శారీరక ఆకర్షణ మాత్రమే ఉండదు. దానికంటే కూడా ఉన్నతమైన ప్రేమ పాత్రురాలు అయ్యే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది.



భారత స్త్రీల దయనీయమైన పరిస్థితిని వర్ణిస్తూ, వారిని ఉద్ధరించే మార్గాలను చెబుతూ 1942లోనే రాహుల్‌జీ భోజ్‌పురీ భాషలో చిన్న చిన్న నాటికలు చాలా రాశారు. 'మెహరారున్ దురవస్థ', 'మందలి ప్రపంచం' కథలలో స్త్రీ సమాజాల పట్ల, స్త్రీ పక్షపాతిగా వారి ఆలోచనలు మనకి కనిపిస్తాయి. కుసంస్కారాలు, భయంకరమైన నీతి శాసనాలలో బంధించబడి ఉన్న భారత సమాజ స్త్రీ జాతి దుర్భర పరిస్థితులను చూసి రాహుల్‌జీ హృదయం ద్రవించిపోయింది. స్త్రీ జాతి దుస్థితి పట్ల తన తిరుగుబాటు స్వభావాన్ని చాలా మార్మిక శబ్దాలలో ఇలా చిత్రించారు.

"ఒకే తల్లి, ఒకే గర్భం/ ఇద్దరూ జన్మించారు/ కొడుకు జన్మించినందుకు ఆనందం/ కూతురు జన్మించినందుకు దుఃఖం/ సంపదపై కొడుక్కి హక్కు/ కూతురుకి ఏ హక్కులూ లేవు."

రాహుల్‌జీ తన ప్రఖ్యాత రచన 'పారిపోకు ప్రపంచాన్ని మార్చుకో'లో ఒక అధ్యాయం మొత్తాన్ని స్త్రీ జాతికి అంకితం చేశారు. భారత సమాజంలో స్త్రీ జాతి పట్ల పురుషుల అన్యాయానికి వ్యతిరేకంగా గొంతెత్తారు. "మహిళని బానిసని చేసి పురుషుడు తన ఇంటికి తెస్తాడు. దీన్ని పెళ్లి అంటారు. తండ్రి తన కూతురు కోసం వరుడిని వెతుకుతాడు, ఎందుకు? కూతురికి తిండి, బట్ట తప్పక దొరకాలి. పురుషునికి తప్పనిసరి అవసరం లేదు. ఎందుకంటే తండ్రి ఆస్తిపాస్తులు మొత్తం అతడికే లభిస్తాయి. అతడు దుకాణం తెరవగలడు లేదా ఆఫీసులో ఉద్యోగం చేయగలడు. సంపాదించుకోవడానికి అతడికి అన్ని దారులూ తెరచి ఉన్నాయి. కానీ మహిళలకి అన్ని దారులూ మూసి ఉన్నాయి. అందుకని ఆమెకి తిండి, బట్టలు ఇచ్చేవాడు ఎవరన్నా ఒకడు కావాలి. తిండి బట్టలనే డబ్బులంటారు కదా!"

ఇంకా తీవ్రంగా చర్చిస్తూ రాహుల్‌జీ ఇలా అంటారు. "నేను పెళ్లిని తప్పు అనడం లేదు. కానీ పెళ్లి పేరుతో ధనం, బేరసారాలు సాగటం మహిళలను అగౌరపరచటమే. ప్రేమ అనే పునాదిపై పెళ్లి ఆధారపడాలి. ప్రేమ అనేది ఇరువురు సమాన వ్యక్తుల మధ్యనే ఉంటుంది. యజమాని, కొనబడిన దాసిల మధ్య ప్రేమ ఉండదు. అందుకే సంపాదనలో, తల్లిదండ్రుల ఆస్తిపాస్తులలో సమాన అధికారం వచ్చేవరకూ మహిళ, పురుషునికి సమానం కాలేదు."

ఇంకా కఠిన పదాలలో రాహుల్‌జీ ఇలా ప్రశ్నిస్తారు. "మహిళలు ఎప్పటికీ గొర్రెలుగా ఉండలేరు. చదువుకున్న మహిళలు చాలాచోట్ల బహిరంగసభలు పెట్టి ప్రశ్నిస్తున్నారు. మానవ పొట్ట నుండి మగపిల్లలు పుడితే, ఆడపిల్లలేమన్నా చింతచెట్టు తొర్రలోంచి పుట్టారా?"

1944 నాటికే స్త్రీల పట్ల పండిట్‌జీకి స్పష్టమైన అవగాహన వచ్చింది.

ప్రస్తుత కాలంలో మహిళా జగత్తులో వస్తున్న అభివృద్ధిని చూసి సంతోషిస్తూ, భారత స్త్రీ తన దృఢమైన మనోబలంతో, పని సామర్థ్యంతో 'ఆడది అబల కాదు సబల' అని నిరూపించే రోజు దూరం లేదని రాహుల్‌జీ ఆశిస్తున్నారు. "మహిళ ఏ రకమైన అన్యాయం ముందూ తలవంచదు. కచ్చితంగా ఎదిరిస్తుంది. భారత మహిళ తన బాటలు నిర్మించుకుంటున్నది. వందల సంఖ్యలో ఇంగ్లండు, అమెరికా ఇంకా ఇతర దేశాలలో చదవటానికి వెళ్లే మహిళలకి సంరక్షకులుగా ఎవరు పంపబడ్డారు? (మనుస్మృతిలో చెప్పబడినట్లు) పురుషుడు తనని తాను రక్షించుకున్నట్టు గానే స్త్రీలు తమని తాము రక్షించుకుంటారు. తమ దారికున్న అడ్డంకుల్ని తొలగించుకుంటూ ఇతర దేశాల మహిళలు ముందడుగు వేస్తున్నారు. ఆయా దేశాలు చాలాకాలం క్రితమే ఈ పనిని ప్రారంభించాయి. నేటి ప్రపంచ ప్రవాహం మనతో పాటుగా ఉన్నది."



తెలుసుకోవాలనే జిజ్ఞాసలో పురుషులే కాదు ఎంతో ఉత్సాహంతో స్త్రీలు కూడా రాహుల్‌జీ దగ్గరికి వచ్చేవారు. మంచి పనులను చేయటం కోసం పురుషులని ఎలా ప్రోత్సహించేవారో, అలానే స్త్రీల కోసం కూడా ప్రణాళికలు తయారు చేసేవారు. వాటికి కార్యరూపం ఇచ్చే సాధనాలు, ఉపాయాలను కూడా చెప్పేవారు. ఎవరైనా స్త్రీకి, ఆమె భర్తకి మధ్య మనస్పర్థలు వచ్చి వాటిని పూడ్చటంలో ఆమె విఫలమవుతుంటే "భర్తతో కలిసి ఉండగలిగినంతకాలం ఉండడానికి ప్రయత్నించు. పరిస్థితి ఇంకా విషమిస్తే వేరుపడి నువ్వు నీ కాళ్లపై నిలబడే ప్రయత్నం చేయి. నువ్వు కార్యక్షేత్రంలో దిగటమే ఆలస్యం. నీలో ఆత్మవిశ్వాసాన్ని ప్రేరేపించు. నువ్వు ఎవ్వరికీ దేంట్లోనూ తీసిపోవు, వెనుకబడవు" అని ధైర్యాన్నిచ్చేవారు.

స్త్రీ జాతి ఉజ్వల భవిష్యత్ వైపు సూచిస్తూ మహా పండిట్ తన ఉన్నత భావాలని ఇలా ప్రకటిస్తున్నారు. "భారత మహిళలు మూడు తరాలుగా క్రమంగా ముందుకు వెళుతూ ఆధునిక వాతావరణంలో ప్రవేశించారు. మొదటి తరం– పరదాలను తీసేసి పూజా గ్రంథాల దాకా వెళ్ళే సాహసం చేసింది. రెండవ తరం– కొంచెం కొంచెం చదువు సంధ్యలు ప్రారంభించింది. ఇంకా కాలేజీలో చదువుతూ కూడా తనతో చదివే మగపిల్లలతో సమానత్వాన్ని పొందే సాహసం చేయలేదు. ఇప్పటి నవ యువతుల మూడో తరం– యువకులతో సరిసమానమవడానికి తయారుగా ఉన్నది. మామూలు పనులలోనే కాదు ప్రభుత్వ యంత్రాంగంలోకి, పెద్ద పెద్ద ఉద్యోగాలలోకి కూడా పోవడానికి ఇప్పటి తరం తయారుగా ఉంది.

భారత స్త్రీల పట్ల 1944లో రాహుల్‌జీ తన భావాలను ప్రకటించారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో స్త్రీలు ఉన్నతమైన గొప్ప ప్రాముఖ్యత గల స్థానాన్ని తమ కోసం ఏర్పర్చుకుంటున్నారు. అన్ని రంగాలలోనూ సంపూర్ణ మహిళా విముక్తి వైపు సాగిపోవడానికి నేటి తరం యువతులు అన్ని రకాల అడ్డంకులనీ తొలగించుకోవాలనేది రాహుల్‌జీ స్వప్నం.

(రాహుల్ సాంకృత్యాయన్ సహచరి కమలా సాంకృత్యాయన్ హిందీ రచన 'మహామానవ్–మహాపండిత్' పుస్తకం నుంచి)

తెలుగు అనువాదం: **ఆలూరి ఉషారాణి**

(మార్చి 8: అంతర్జాతీయ మహిళా దినోత్సవం)

# న్యాయవ్యవస్థలోనూ మహిళలకు అన్యాయమేనా?

మనకు స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయినా మహిళా న్యాయమూర్తుల సంఖ్యను కోర్టుల్లో పెంచుకోలేకపోయాం. 1989, అక్టోబర్ 6న ఫాతిమా బీవీ సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా నియమితమయ్యే వరకు మన దేశ అత్యున్నత న్యాయస్థానంలో మహిళా న్యాయమూర్తులు లేరు. ఫాతిమా బీవీని నియమించుకున్న ఆనందం కూడా రెండున్నర ఏళ్లకు మించి లేదు. ఆమె తరువాత మళ్లీ రెండేళ్లకు సుజాతా మనోహర్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితురాలయ్యారు. ఆ తర్వాత జస్టిస్ రుమా పటేల్ ఆరేళ్ల మూణ్ణెల్లు కొనసాగారు, కానీ ప్రధాన న్యాయమూర్తి కాలేకపోయారు. ఇలా ఏడు దశాబ్దాలకు పైగా స్వతంత్ర పరిపాలనలో 276 మంది సుప్రీంకోర్టు జడ్జిలను నియమించుకున్నా, కేవలం 11మంది మహిళలు మాత్రమే సుప్రీంకోర్టు జడ్జిలు కాగలిగారు. ప్రస్తుత 34మంది న్యాయమూర్తులలో మహిళలు ఇద్దరే.

ఇక హైకోర్టుల వైపు చూస్తే పరిస్థితి అంత బాగా ఏమీ లేదు. గత ఆగస్టు 31 నాటికి సుప్రీంకోర్టు లెక్కల ప్రకారం దేశం మొత్తం మీద హైకోర్టుల్లో కొలువుదీరిన 754 మంది న్యాయాధీశుల్లో కేవలం 106 మంది మాత్రమే మహిళలు. అంటే 14శాతం అన్నమాట. అన్ని హైకోర్టుల్లో ఉండాల్సిన 1100 పై చిలుకు జడ్జీల సంఖ్య పరిగణిస్తే, మహిళా న్యాయమూర్తుల శాతం ఇంకా పడిపోతుంది. ఒకే ఒక్క మహిళా న్యాయమూర్తి ఉన్న హైకోర్టులు ఎనిమిది ఉన్నాయి. అవి చత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్, ఝార్ఖండ్, మణిపూర్, ఒరిస్సా, పట్నా, సిక్కిం, ఉత్తరాఖండ్.

జిల్లా కోర్టుల పరిస్థితి కాస్త మెరుగ్గా ఉంది. దేశం మొత్తంలోని 719 జిల్లాల్లో గల 2,188 కోర్టుల్లో దాదాపు 37 శాతం జడ్జీలు మహిళలు కావడం ఆనందదాయకమే. కాని వారికి ప్రమోషన్లు వచ్చి హైకోర్టు, సుప్రీంకోర్టుల వరకు వెళ్లగలుగుతున్నారా? లేదు.

ఓ వైపు న్యాయవ్యవస్థలో మహిళల కొరత, మరోవైపు వ్యవస్థలో వారి అవస్థలు మహిళల అస్తిత్వాన్నే ప్రశ్నిస్తున్నాయి. పైపెచ్చు మహిళలకు అధికారాలు అప్పజెప్తే పనులు పకడ్బందీగా జరుగుతాయన్న అభిప్రాయానికి విలువ లేకుండా పోతోంది. నమోదైన న్యాయవాదుల్లో 18 శాతమే మహిళలున్నా వారి సంఖ్య రెండున్నర లక్షల పైనే ఉంది. మనకు అంతమంది మహిళా న్యాయమూర్తులు అవసరం లేదు. దేశంలోని అన్ని కోర్టుల్లో కలిపి ఏభై శాతం నింపితే కనీసం న్యాయవ్యవస్థలోనైనా స్త్రీలకు న్యాయం దొరుకుతుంది.

'పెళ్లి, పిల్లలుకనడం వల్ల స్త్రీలు తమ వృత్తిని వదిలేస్తారు. కానీ పిల్లలు పుట్టిన తర్వాత వారి పెంపకానికి కావాల్సిన సమయం కేటాయించి వారు మళ్లీ వృత్తిలోకి రావచ్చని' ఇటీవలే సుప్రీంకోర్టు జస్టిస్ నాగరత్న ఓ సందర్భంలో అన్నారు. న్యాయవ్యవస్థలో సగం న్యాయమూర్తులు స్త్రీలే ఉండేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

– డా. పి. మాధవరావు
ఐక్యరాజ్యసమితి మాజీ సీనియర్ సలహాదారు






# బల్దియాకు 'పన్ను' పోటు!

- వరంగల్ నగరంలో నత్త నడకన వసూళ్లు
- నిర్లక్ష్యం వహిస్తున్న కొంత మంది సిబ్బంది
- రూ.117.26 కోట్లకు రూ.52.30 కోట్లు మాత్రమే వసూలు
- వరంగల్ బల్దియా తీరుపై సీడీఎంఏ అసంతృప్తి
- అధికారుల పనితీరుపై కమిషనర్ సీరియస్
- 56 మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ
- వంద శాతం చేయకపోతే వేటేనని హెచ్చరిక
- 'వ్యక్తిగత లాభం'లో పడి కొందరు సిబ్బంది ఉదాసీనత




వరంగల్ కార్పొరేషన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో పన్నుల వసూళ్లు నత్త నడకన సాగుతున్నాయి. ఈ యేడు మార్చి 31 వరకు వార్షిక సంవత్సరం ముగుస్తుందని తెలిసి కూడా కొందరు సిబ్బంది పన్నుల వసూళ్లపై శ్రద్ధ చూపడం లేదు. ఇంకా కొందరు ఆర్‌వోలు, ఆర్‌ఐలు, వార్డు ఆఫీసర్లతో పాటు వీరిని పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో వసూళ్లు కుంటుపడుతున్నాయని తెలుస్తోంది. అయితే సర్వేలు, సమీక్షలు, ప్రచారాలు అని ప్రభుత్వం పనులు అప్పగిస్తుండడంతో వసూళ్లు చేయలేకపోతున్నామని కొందరు ఉద్యోగులు మండి పడుతున్నారు.

### పేరుకుపోయిన 48 శాతం బకాయిలు

బల్దియా పరిధిలో ఉన్న 2.58 లక్షల ఇండ్లు, షాపులు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, అపార్ట్‌మెంట్లు, వివిధ రకాల వ్యాపార వాణిజ్య కేంద్రాల నుంచి వార్షిక ఇంటి, గార్బేజ్ (చెత్త) పన్నులతో పాటు ట్రేడ్ లైసెన్స్ యూజర్ చార్జీలను సిబ్బంది వసూలు చేయాలి. 2024-25 వార్షిక సంవత్సరానికి ప్రభుత్వ లక్ష్యం ప్రకారం అన్ని రకాల పన్నులను వంద శాతం వసూలు చేయాల్సి ఉంది. వార్షిక ఆదాయంలో రూ.117.26 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.52.30 కోట్లు మాత్రమే వసూలు చేశారు. అంటే 48 శాతమే బకాయిలను మాత్రమే వసూలు అయ్యాయి.

### కమిషనర్ ఫైర్

వరంగల్ బల్దియా పరిధిలో పనుల వసూళ్ల వెనుకబాటుపై ఇటీవల హైదరాబాద్ నుంచి జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో సీడీఎంఏ డాక్టర్ శ్రీదేవి కమిషనర్‌పై మండిపడ్డట్టు తెలిసింది. దీంతో సంబంధిత అధికారుల తీరుపై బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సీరియస్ అయ్యారు. రెండు రోజుల కిందట కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆర్‌వోలు, ఆర్‌ఐలు, వార్డు ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించి మందలించారు. పన్నుల వసూలు విషయంలో చాలా మంది సిబ్బంది పని తీరు బాగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. 25 రోజుల్లో పూర్తిస్థాయిలో వసూళ్లు కావాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించడంతో అధికారులు, సిబ్బంది కాలనీలలో పరుగులు పెడుతున్నారు. ఏసీ, డీసీ స్థాయి అధికారుల తీరుపై కూడా మండిపడి వార్నింగ్ ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. అంతే కాకుండా ప్రతీ రోజు 66 డివిజన్‌లలో అందరు కలిసి రూ.1 కోటికి పైగా వసూలు చేయాలని ఆదేశించినట్టు తెలిసింది.

### అవగాహన కల్పించని సిబ్బంది

ప్రతీ వార్షిక సంవత్సరం మార్చి 1 నుంచి మార్చి 31 వరకు కార్పొరేషన్ పరిధిలో ఉన్న సొంత ఇండ్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, షాపింగ్ మాల్స్ హోటళ్ల చదరపు గజాల ఆధారంగా బల్దియాకు పన్నుల రూపంలో డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. కాని దీనిపై బల్దియా సిబ్బంది వాల్‌పోస్టర్లు, జీపులు, ఆటోల ద్వారా ప్రచారం, కళాకారుల ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. కానీ బల్దియా ఉన్నతాధికారులు ఎలాంటి ప్రచారాలు, ప్రసారాలు చేయకపోవడం వల్ల పన్నుల వసూళ్ల పర్వం వెనుకంజలో పడ్డట్టు సమాచారం. కొందరు సిబ్బంది పన్ను వసూళ్ల డబ్బులను సొంతానికి వాడుకున్నట్టు సమాచారం. ఈ యేడు ప్రజలు చెల్లించాల్సిన పన్ను వడ్డీ(ఫైన్)పై 90శాతం రాయితీ ఉంది. అది కూడా ప్రజల్లోకి ప్రచారం చేయకపోవడం వల్లనే చెల్లింపులలో కోత పడ్డట్టు తెలుస్తోంది. ఈ యేడాది ఎప్రిల్ 1 నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయికి 25శాతం వడ్డీ జమ చేయనున్నట్టు రాష్ట్ర మున్సిపల్ కార్యాలయంలో నుంచి ఆదేశాలు అందాయి.

### 56 మందికి షోకాజ్ నోటీసులు

వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న సుమారు వంద మంది రెవెన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు అధికారులు కలుపుకుని పన్నుల వసూళ్ల కోసం 108 మంది పని చేస్తున్నారు. ఇందులో సరిగా పని చేయని 56 అధికారులు, సిబ్బందికి సి-1 సెక్షన్ నుంచి షోకాజు నోటీజులు జారీ చేశారు. ఇద్దరు ఆర్‌వోలు, 11 మంది ఆర్‌ఐలు, 43 మంది వార్డు అధికారులు బుధవారం షోకాజు నోటీసులు అందుకున్నారు.



### డబ్బులకు కక్కుర్తి పడి..

గ్రేటర్ వరంగల్ పరిధిలో కొన్ని కార్పొరేట్ సంస్థలు, షాపింగ్ మాల్స్, అపార్ట్‌మెంట్స్, హోటళ్లు, మార్ట్‌లు నగరంలో ఇటీవల పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఇదే అదునుగా భావించిన కొందరు బల్దియా రెవెన్యూ సిబ్బంది పక్కదారి పడుతున్నట్టు తెలిసింది. బడా బకాయిదారులు ఇచ్చే నెల వారి మామూళ్లు, గిఫ్ట్‌లకు ఆశపడి పన్ను వసూళ్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు తెలిసింది. ఇంకా కొందరు బడా వ్యాపారుల వైపు బల్దియా అధికారులు చూడరంటే అతిశయోక్తి కాదు. కొందరు వ్యక్తులు ఏళ్లతరబడి లక్షల రూపాయలు బకాయి ఉన్నా వారిని ముట్టుకోకుండా చిన్న చిన్న వ్యాపారులను ముక్కు పిండి మరీ డబ్బులు వసూలు చేస్తున్నారు. కొందరి వద్దకు బకాయిల కోసం వెళితే మంత్రులు, ప్రజాప్రతినిధులు కలుగజేసుకుంటున్నట్టు తెలిసింది. పెద్ద పెద్ద షాపింగ్‌మాల్స్ నిర్వాహకులకు ఇప్పటి వరకు పన్నులు చెల్లించాలని నోటీసులు జారీ చేయకపోవడం పలు అనుమానాలకు దావిస్తోంది. బల్దియా సిబ్బంది. రెవెన్యూ అధికారులు నిద్ర మత్తులో నటిస్తుండడం వల్లనే బల్దియా బకాయిలు, పన్నుల వసూళ్లు వెనక బడినట్టు తెలుస్తోంది.



కోనాపురం శివారులో బోల్తా పడిన ట్రాలీ వాహనం

# బతుకులు బోల్తా

## కూలీలతో వెళుతున్న ట్రాలీ వాహనానికి ప్రమాదం

- అదుపుతప్పి ఒకరి మృతి
- ఇద్దరి పరిస్థితి విషమం, 20 మందికి గాయాలు
- మిర్చి తెంపేందుకు వెళుతుండగా కోనాపురం వద్ద ఘటన
- ట్రాలీలో 37 మంది వ్యవసాయ కూలీల ప్రయాణం
- పరిమితికి మంచి కూలీలతో వెళ్లడమే ప్రమాదానికి కారణం



మృతిచెందిన బానోతు సుక్యా (ఫైల్)

6





# నేరాలను ముందే పసిగట్టి అరికట్టాలి

- పెట్రోకార్, ఇంటర్ సెప్టార్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్‌కిషోర్ ఝా

వరంగల్ క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నేరాలు జరిగిన తర్వాత పోలీసులు వెళ్లేదాన్ని కన్నా.. నేరం జరగకుండా ముందే కనిపెట్టి ముందస్తు నివారణ చర్యలు తీసుకోవడం మంచిదని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. నిత్యం రోడ్లపై విధులు నిర్వర్తించే పెట్రోకార్, ఇంటర్ సెప్టార్, హైవే పెట్రోలింగ్ సిబ్బంది ఆపదల్లో ఉన్న ప్రజలకు సాయం చేస్తూ పోలీసులపై ఉన్న నమ్మకాన్ని మరింతగా పెంచాలని కోరారు. గురువారం కమిషనరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో పెట్రోలింగ్ విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. విజుబుల్ పోలీసింగ్ భాగంలో పెట్రోలింగ్ సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో పెట్రోలింగ్ పెంచాలన్నారు. ప్రజలకు పోలీసులపై ఉన్న నమ్మకాన్ని పెంచేలా చోరీలు నియంత్రించాలన్నారు. పెట్రోలింగ్ సిబ్బంది ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటు ఇతర అల్లర్లను అరికట్టాలన్నారు. పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వర్తించే సిబ్బంది ఫిర్యాదుదారుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను ఓపికతో విని ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకుపోవాలని సలహా ఇచ్చారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ రవి, పోలీస్ కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఇంటర్ 'ద్వితీయ' పరీక్షలు ప్రారంభం

### వరంగల్‌లో 97.3, హనుమకొండలో 97.5 శాతం హాజరు



హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు



పరీక్ష గదులను చూసుకుంటున్న విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు గురువారం నుంచి ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. వరంగల్ జిల్లాలో 97.3 శాతం మంది విద్యార్థులు హాజరు కాగా, హనుమకొండ జిల్లాలో 97.5 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. రెండు జిల్లాల్లోని అన్ని పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు డీఐఈవోలు డాక్టర్ జి.శ్రీధర్ సుమన్, ఎ.గోపాల్ పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలో జనరల్ విభాగంలో 4,958 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 4,838మంది హాజరయ్యారు వొకేషనల్ విభాగంలో 668మందికి గాను 635మంది హాజరయ్యారు. మొత్తంగా 5,626 మంది విద్యార్థులకు గాను 5,473 మంది హాజరుకాగా 153 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. హనుమకొండ జిల్లాలో జనరల్ విభాగంలో 18,100మంది విద్యార్థులకు గాను 17,659 మంది హాజరు కాగా వొకేషనల్ విభాగంలో 869కి 830మంది హాజరయ్యారు. మొత్తం 18,969మందికి గాను 18,489మంది విద్యార్థులు హాజరు కాగా 480మంది గైర్హాజరయ్యారు. కాగా పరీక్ష రెండు జిల్లాల్లోని పలు పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ బోర్డు బృందాల తో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేశా యి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు డీఐఈవోలు తెలిపారు.

# సమాజంలో మహిళలు డైనమిక్‌గా ముందుకు సాగాలి

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- కేయూలో ఘనంగా మహిళ దినోత్సవ సదస్సు




మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

కేయూ క్యాంపస్ మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలంతా డైనమిక్‌గా ముందుకు సాగుతూ జీవిత లక్ష్యాలను అందుకోవాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఉద్బోధించా రు. గురువారం కేయూ ఆడిటోరియంలో కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు అధ్యక్షతన మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తుగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్యశారద పాల్గొని మాట్లాడారు. మహిళలు మల్టీ టాస్కర్స్ అని అభివర్ణించారు. మహిళలు ధైర్యంగా, డైనమిక్‌గా ఉండాలన్నారు. విజయానికి షార్ట్ కట్‌లు లేవని పేర్కొన్నారు. తెలివితేటలను జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. విజయపథాన్ని ఎంజాయ్ చేయలన్నారు. తల్లిదండ్రులను మరువద్దన్నారు. ప్రపంచాన్ని శ్వాసించే స్థాయి భారతీయ యువతకు ఉందన్నారు. భారతీయ సంప్రదాయాలు, కట్టుబాట్లను గౌరవించాలని అన్నారు. విజయం మానసిక స్థితి అని చెప్పారు.

కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు పరిపాలన పదవుల్లో సమర్థవంతంగా రాణించగలుగుతారని, వర్సిటీలోనూ మహిళ పరిపాలన పదవుల్లో ఉన్నారని గుర్తు చేశారు. వర్సిటీలో మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. మహిళ సాధికారత విద్యతోనే సాధ్యం అవుతోందని చెప్పారు. కేయూ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ బి.రమ మాట్లాడుతూ.. మహిళల్లో మానసిక స్థిరత్వం ప్రధానమన్నారు. టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న క్రమంలో చాలా జాగ్రత్తగా వ్యవరించాలని కోరారు. తెలుగు విభాగం రిటైర్డు ప్రొఫెసర్, రచయిత, విమర్శకురాలు ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే మాట్లాడుతూ.. శ్రామిక వర్గాల పోరాట ఫలితమే మహిళ దినోత్సవం అని చెప్పారు. సంఘటితంగా స్త్రీవాద హక్కులను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. మహిళల్లో ప్రశ్నించే తత్వం ఉండాలని అన్నారు. అనంతరం కలెక్టర్ సత్యశారదను ఘనంగా సన్మానించారు.

ఈ సదస్సులో మహిళ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకురాలు టి.స్వప్న కన్వీనర్‌గా వ్యవరించగా పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు భూ సర్వే ప్రారంభం

### శాంతించిన మామునూరు ఎయిర్‌పోర్టు బాధిత రైతులు

మామునూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మామునూరు విమాశ్రయం కోసం భూ సర్వే గురువారం ప్రారంభమైంది. ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సర్వే పనులు కొనసాగించారు. కాగా, నిన్నటివరకు సర్వేను అడ్డుకున్న రైతులు గురువారం మౌనంగా ఉండిపోయారు. దీనివెనక కారణాలు తెలియడం లేదు. భూమికి బదులు భూమే కావాలి.. ప్రత్యామ్నాయ రోడ్డు వేయాలి.. లేదంటే మార్కెట్ ధర ప్రకారం నష్ట పరిహారం ఇవ్వాల్సిందేనని లేదంటే ప్రాణత్యాగానికైనా సిద్ధమని తేల్చి చెప్పిన రైతులు.. ఒక్కసారిగా శాంతించారు. గాడిపల్లి, నక్కలపల్లి, గుంటూరుపల్లి, నల్లకుంట గ్రామాలకు చెందిన దాదాపు రెండు వందల మంది రైతులు రోడ్డుపై ఆందోళన చేపట్టడం, దీంతో మామునూరులో కొంత ఉద్రిక్తత వాతావరణం నెలకొనడం, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయడం, అయినప్పటికీ రైతులు తగ్గకపోవడంతో రెవెన్యూ అధికారులు సర్వే చేయకుండానే వెళ్లిపోవడం గత మంగళవారం నాడు వెంటవెంటనే జరిగిపోయాయి. దీంతో ఎయిర్‌పోర్ట్ సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని అందరూ అనుకున్నారు. కానీ అందుకు భిన్నంగా గుంటూరుపల్లి గ్రామ రైతులు గురువారి నాటి సర్వేకు సహకరించారు. సర్వే పూర్తి అయిన వెంటనే ఎయిర్ పోర్ట్ పనులు చకాచకా ప్రారంభిస్తారని నగర ప్రజలు భావిస్తున్నారు. కాని, మిగతా గ్రామాలైన నక్కలపల్లి, నల్లకుంట, గాడిపెల్లి రైతులు ఎలా స్పందిస్తారో తెలియాల్సి ఉంది.



గుంటూరుపల్లిలో భూ సర్వే నిర్వహిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ అధికారులు



మాట్లాడుతున్న బత్తిని సుదర్శన్

## వైద్య, ఆరోగ్యశాఖలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం

వరంగల్ మెడికల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని స్టేట్ ప్రెసిడెంట్ బత్తిని సుదర్శన్ అన్నారు. గురువారం ప్రభుత్వ ఫార్మసిస్టు అసోసియేషన్ వరంగల్, హనుమకొండ జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫార్మసిస్టులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు పరిష్కరించ డానికి అధికారులతో మాట్లాడి పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైద్య, ఆరోగ్యశాఖలో ఫార్మసిస్టుల పాత్ర చాలా కీలకమైందని, రోగికి, వైద్యుడికి మధ్య వారధి లాంటి వారని కొనియాడారు. రాష్ట్రంలో రాబోయే రోజుల్లో ఫార్మసిస్టులకు మంచి భవిష్యత్ ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ఫార్మసిస్టులే వి.రాజేందర్, విజయలక్ష్మీ, రత్నప్రభ, అరుణకుమారి, సంతోష్, జ్యోతి, సృజన, స్వరూపరాణి, సరళారాణి, అన్వేష్, సతీష్, అనిత, విజేత, రంగారావు, అనూష, లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్లో పెరిగిన దేశీ మిర్చి ధర

### తగ్గిన సింగిల్‌పట్టీ

వరంగల్‌వ్యవసాయం, మార్చి6(ఆంధ్రజ్యోతి): వరంగల్ వ్యవసాయ మార్కెట్లో కొన్ని రకాల మిర్చి ధరలు పెరిగాయి. మరికొన్నింటి ధరలు తగ్గాయి. బుధవారం సింగిల్‌పట్టీ మిర్చి ధర క్వింటా రూ.41000లు పలుకగా గురువారం రెండు వేల రూపాయలు తగ్గి క్వింటా రూ.39000లు పలికింది. అదే విధంగా బుధవారం దేశీరకం మిర్చికి క్వింటా రూ.28,500లు పలుకగా గురువారం పదిహేను వందల రూపాయలు పెరిగి రూ.30,000లకు చేరింది. ఇక తేజ రకం రూ.14,150లు, వండర్‌హాట్ రూ.16,900లు, డిడి రకం మిర్చి రూ.13,000లు, దీపిక రకం రూ.17,300లు పలికింది.


భావన | రామ్‌చరణ్ | రమ్య | సమత | యశ్వంత్


రమ్య | త్రివేణి | పాల్సన్ | కన్నయ్య | ఆసియా

## ఇన్‌స్పైర్‌లో అవార్డుల పంట

- లింగాల ఘణపురం మండలంలో పదిమంది విద్యార్థుల ఎంపిక
- వనపర్తి పాఠశాల నుంచే ఐదు అవార్డులు

లింగాలఘణపురం, మార్చి 6(ఆంధ్రజ్యోతి) భారత ప్రభుత్వం ప్రతీ ఏటా సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా అందించే ఇన్‌స్పైర్-2024-25 అవార్డుల పంపిణీలో జనగామ జిల్లా లింగాలఘణపురం మండలానికి 10 అవార్డులు దక్కాయి. ఇందులో ఒక్క వనపర్తి జడ్పీ హైస్కూల్‌కే ఐదు అవార్డులు దక్కడం గమనార్హం. ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపికైన వారిలో వనపర్తి జడ్పీ హైస్కూల్‌కు చెందిన దాసరి భావన, కొలనుపాక రమ్య, రాగ్గాల యశ్వంత్, తూడి సమత, ఇంద్రపల్లి రాంచరణ్, లింగాలఘణపురం కేజీబీవీకి చెందిన పాలమాకుల రమ్య, మురాల త్రివేణి, నవాబుపేట జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎండి ఆసియా, కుందారం హైస్కూల్‌కు చెందిన శాడ పాల్సన్, శాడశాడ కన్నయ్యలు ఎంపికైనట్లు ఎంఈవో పడాల విష్ణుమూర్తి తెలిపారు. అయితే భారత ప్రభుత్వం ఇన్‌స్పైర్ అవార్డు స్కీంకు ఎంపికైన ఒక్కో విద్యార్థి ఖాతాలో రూ.10వేల చొప్పున జమ చేయనుంది. ఈ మొత్తం డబ్బులను విద్యార్థుల సొంతానికి కాకుండా తిరిగి జిల్లా స్థాయిలో జరిగే ఎగ్జిబిట్‌లో తమ ప్రతిభను మరింత చాటి వినూత్న రీతిలో ప్రాజెక్టులను తయారుచేసేందుకు వినియోగించాల్సి ఉంటుంది. ఒకే పాఠశాల నుంచి 5ఇన్‌స్పైర్ అవార్డులు దక్కడంపై ఉపాధ్యాయులను, విద్యార్థులను ఎంఈవో అభినందించారు.



# తెలంగాణ పల్లె భాషను కాపాడుకోవాలి

### కేయూ వీసీ ప్రొఫెసర్‌కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పల్లె భాష పలుకుబడులను కాపాడుకోవాలని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం కేయూ తెలుగు విభాగం సెమినార్ హాల్‌లో విభాగాధిపతి డాక్టర్ మామిడి లింగయ్య అధ్యక్షతన మదగాని విజయలక్ష్మి రచించిన భూమనార్య పద్య శతకాన్ని వీసీ ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ మాండలికం ప్రధానంగా తెలంగాణ పల్లె వాడుక భాషలో సహజసిద్ధంగా వ్యవరించబడుతోందని అన్నారు. విజయలక్ష్మి రాసిన భూమనార్య శతకం భవిష్యత్‌లో 10వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశంగా తీసుకునే అవకాశం ఉందన్నారు. పుస్తక స్వీకర్త, హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వీసీ ప్రొఫెసర్ అనుమాండ్ల భూమయ్య మాట్లాడుతూ.. భూమనార్య మాట బుద్ధి మాట మకుటంతో రాయడాన్ని ప్రశంసించారు. రచయిత మదగాని విజయలక్ష్మిని అభినందించారు. శతకంలో ఆధ్యాత్మిక, సామాజిక చిత్రణ ఉందన్నారు. కేయూ పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్రా రాజు గౌడ్ మాట్లాడుతూ.. విజయలక్ష్మి రాసిన శతకం 108 పద్యాలతో తెలంగాణ యాస, భాషలకు ప్రతీకగా నిలస్తోందన్నారు. భాష పరిశోధకులకు అమూల్యమైందన్నారు. ప్రముఖ కవి, సహృదయ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు డాక్టర్ గన్నమరాజు గిరిజామనోహర్‌బాబు మాట్లాడుతూ.. నిర్జీవమైన తెలంగాణ భాష పదాలను శతకం రూపొందించడం గొప్ప విషయమని కొనియాడారు. భాష పదాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ మామిడి లింగయ్య మాట్లాడుతూ.. తెలంగాణలో పద్య సాహిత్యానికి కాణచిగా పేరొందిందన్నారు. యువ పరిశోధకల్లో మదగాని విజయలక్ష్మిరాసిన భూమనార్య శతకం సాహిత్యం గొప్ప స్ఫూర్తిని ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు డాక్టర్ సంగాల కొమల, డాక్టర్ బానోతు స్వామి, బేరి దేవేందర్,అభిరామ్, వేణు, ఎర్ర రాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, మాజీ వీసీ భూమయ్య , తదితరులు

### విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెజ్ఞ్ అవసరం

ఇంజనీరింగ్ విద్యార్థులకు తరగతి పాఠాలతో పాటు ప్రాక్టికల్ నాలెజ్ఞ్ అవసరమని కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం కేయూ సెనెట్ హాల్‌లో వర్సిటీ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రమణ అధ్యక్షతన వర్క్‌షాప్ ప్రారంభ సదస్సు జరిగింది. క్యాడెన్స్ టూల్స్ అనే అంశంపై జరిగిన సదస్సులో కేయూ వీసీ ప్రతాప్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంటరాక్టివ్ లర్నింగ్‌తో వృత్తిపరమైన అభివృద్ధి జరుగుతోందన్నారు. మార్కెట్‌లో యువతకు కొత్త ఆలోచన ద్వారాలు తెరిచి ఉన్నాయని పేర్కొన్నారు. తరగతి గది, ప్రయోగశాలతో పాటు అనుభవజ్ఞులైన వారి శిక్షణ, సలహాలతో పనిచేస్తే మరింత సమర్థవంతంగా రాణిస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపల్ రమణ మాట్లాడుతూ.. వేగవంతమైన టెక్నాలజీతో ప్రపంచం అంతా ఇంటర్నెట్ కనెక్టు అవుతోందన్నారు. దీనికి అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవాలని చూచించారు. కన్వీనర్ డాక్టర్ వి.మహేందర్ మాట్లాడుతూ.. డిజైనింగ్, కోడింగ్ విభాగాల్లో విస్తృతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయని చెప్పారు. సదస్సుకు ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆసీం ఇక్బాల్ వందన సమర్పణ చేయగా అధ్యాపకులు, విద్యార్థులతో పాటు బెంగళూరుకు చెందిన ఎంటీప్లీ ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా, శుక్రవారం రెండో రోజు వర్క్‌షాప్ కొనసాగుతోందని ప్రిన్సిపాల్ రమణ వెల్లడించారు.

# బతుకులు బోల్తా

- కూలీలతో వెలుతున్న ట్రాలీ వాహనానికి ప్రమాదం
- అదుపుతప్పి పడిపోవడంతో ఒకరి మృతి
- ఇద్దరి పరిస్థితి విషమం, 20 మందికి గాయాలు
- మిర్చి తెంపేందుకు వెలుతుండగా కోనాపురం వద్ద ఘటన

చెన్నారావుపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రోజువారి కూలీ పనులకు పోయి కడుపు నింపుకునే ఆ కూలీలు అనుకోని ప్రమాదంతో తల్లడిల్లిపోయారు. వారు ప్రయాణికున్న వాహనం బోల్తాపడడంతో ఒకరు మృతిచెందారు. పలువురికి గాయాలయ్యాయి. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పరిమితికి మించి మనుషులను ఎక్కించుకోవడంతోనే వాహనం ప్రమాదానికి గురైందని బాధితుల కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ దుర్ఘటనవరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని కోనాపురం శివారు ప్రాంతంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంపై బాధితులు, చెన్నారావుపేట ఎస్సై రాజేష్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని జీడిగడ్డ తండాకు చెందిన వ్యవసాయ కూలీలు మిర్చి తెంపడానికి నర్సంపేట మండలం ఇప్పల్‌తండాకు వెళ్తున్నారు. కూలీలను తీసుకెళడానికి ఇప్పల్‌తండాకు చెందిన ట్రాలీ జీడిగడ్డతండాకు ఉదయం వచ్చింది. ట్రాలీలో డ్రైవర్ సంతోష్.. 37 మంది వ్యవసాయ కూలీలను ఎక్కించుకొని ఉప్పరపల్లి గ్రామం మీదుగా ఇప్పల్ తండా గ్రామానికి వెళుతున్నాడు. ఈ క్రమంలో కోనాపురం శివారు ప్రాంతంలోని రాగానే ట్రాలీ అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాలీ బోల్తా పడిన విషయాన్ని గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించటంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై రాజేష్ రెడ్డి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులు 108 వాహనాల్లో నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే తీవ్రంగా గాయపడిన బానోతు సుక్యా(55) అనే వ్యక్తిని నర్సంపేటకు తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు. బానోతు ఈర్య, అంగోతు గమ్లీలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరి పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. బానోతు వీరన్న, భూక్య కమ్లీ, భూక్య సాలీలతోపాటు ట్రాలీలో ప్రయాణించిన 20మందికిపైగా తీవ్రగాయాలతో నర్సంపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, మృతుడు బానోతు సుక్యాకు భార్య శాంతి, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు ట్రాలీ డ్రైవర్ సంతోష్‌పై కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్‌రెడ్డి తెలిపారు. అయితే ప్రమాదానికి కారణమైన ట్రాలీ వాహనం డ్రైవర్ పారిపోయాడు. వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.


కోనాపురంలో శివారులో బోల్తాపడిన వాహనం వద్ద ఆర్తనాదాలు చేస్తున్న క్షతగాత్రులు


తీవ్రంగా గాయాలపాలైనా ఈర్య

### పరిమితికి మించి కూలీలతో వెళ్లడమే కారణం

జీడిగడ్డతండా నుంచి కూలీలతో వస్తున్న ట్రాలీలో పరిమితికి మంచి కూలీలను ఎక్కించుకోవడంతోనే వాహనం అదుపుతప్పి ప్రమాదం జరిగినట్లు బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. చిన్న ట్రాలీలో 31 మంది మహిళలు, 6గురు పురుషులను ఎక్కించుకొని డ్రైవర్ అతి వేగంగా వస్తుండడంతో ట్రాలీ అదుపు తప్పి ఒక్కవైపుగా దూసుకపోవడంతో ప్రమాదం జరిగిందన్నారు.

తండాలో పనులు చేసుకొనే కూలీలకు మొదటి రోజు ఇతర ప్రాంతాలకు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకోవడంతో జీడిగడ్డతండాలో విషాదం చోటు చేసుకుంది.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

## 16న జనగామ జిల్లాకు సీఎం రాక

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఈనెల 16న సీఎం పర్యటన నేపథ్యంలో గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, ఎమ్మెల్యే కడియం శ్రీహరిలు జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 16న స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో వంద పడకల ఆస్పత్రి, రెసిడెన్షియల్ పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బంజారా భవన్, సమీకృత రెవెన్యూ డివిజన్ కార్యాలయ సముదాయం, విద్యుత్ సబ్ స్టేషన్, గ్రామ పంచాయితీల్లో ఎంపిక చేసిన ఇందరమ్మ ఇండ్లు, ఇతర అబివృద్ధి పనులను శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు.

కలెక్టర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరుగుతుందన్నారు. అధికారులు, సిబ్బంది కలిసికట్టుగా పనిచేస్తూ సీఎం పర్యటనను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు గోపిరాం, వెంకన్న, స్టేషన్ ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, డీఆర్డీవో వసంత, డీఎంహెచ్‌వో మల్లికార్జున రావు, డీపీవో స్వరూప, హౌసింగ్ పీడీ మాతృనాయక్, విద్యుత్ ఎస్ఈ వేణుమాధవ్ పాల్గొన్నారు.



వాకథాన్‌లో పాల్గొన్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

## దంత సంరక్షణపై వాకథాన్

వరంగల్ మెడికల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ డెంటల్ అసోసియేషన్ వరంగల్ బ్రాంచ్ నేషనల్ డెంటిస్ట్ డే సందర్భంగా గురువారం దంత సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వాకథాన్ నిర్వహించారు. ఈ వాకథాన్‌ను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ ఆడిటోరియం వరకు నిర్వహించిన వాకథాన్‌లో వైద్యులతో కలిసి వారు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు దంత సంరక్షణ పాటించాలని సూచించారు. దంత సమస్యలు ఏర్పడిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ వి.నరేశ్, దంత వైద్య అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి, సెక్రటరీ డాక్టర్ వేణు యాదవ్, వైద్యులు జయసింహారెడ్డి, అనిల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మనోరంజన్‌రెడ్డి,రమేశ్‌బాబు, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పెంపుడు కుక్క మృతి.. మంత్రి సురేఖ కన్నీరు

వరంగల్ సిటీ, మార్చి6(ఆంధ్రజ్యోతి): అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ కన్నీరుపెట్టుకున్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో అల్లారుముద్దుగా పెంచుకుంటున్న హ్యాపీ (పెంపుడుకుక్క) గురువారం అకస్మికంగా చనిపోవడంతో మంత్రి తట్టుకోలేకపోయారు. తను ఎంత పని ఒత్తిడిలో ఉన్నా ఇంటికి రాగానే దానితో మంత్రి సంతోషంగా గడిపేవారు. అది హఠాత్తుగా చనిపోవడంతో మంత్రితో పాటు సిబ్బంది కూడా కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం దానికి అంతిమ సంస్కారాలు జరిపించారు.


పెంపుడు కుక్క హ్యాపీ మృతి చెందడంతో కన్నీరు పెట్టుకుంటున్న మంత్రి కొండా సురేఖ

### 12న అరుణాచల గిరి ప్రదక్షిణకు రాజధాని ఏసీ బస్సు

హనుమకొండ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బస్టాండ్ నుంచి అరుణాచల గిరి ప్రదక్షిణకు వరంగల్- 1 డిపోకు చెందిన ప్రత్యేక రాజధాని ఏసీ బస్సు బయల్దేరుతుందని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి. విజయభాను తెలిపారు. ఈ బస్సు మార్చి 12న మధ్యాహ్నం 3 గంటలకు హనుమకొండ బస్టాండ్ నుంచి తమిళనాడులోని అరుణాచల గిరికి వెళ్తుందని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్లు : 9959226047 / 7382855793 లలో సంప్రదించాలని కోరారు.

# సిద్ధమైన వసతి గృహం


మహిళా ఉద్యోగుల వసతి గృహం

- దేశాయిపేటలో పూర్తయిన మహిళా ఉద్యోగుల వసతి గృహం
- రూ. 4 కోట్లతో నిర్మాణం
- వంద మంది అతివలతో పాటు పది మంది పిల్లలకు వసతి
- రేపు ప్రారంభించనున్న మంత్రి కొండా సురేఖ?



పోచమ్మమైదాన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహిళా ఉద్యోగులకు ఆశ్రయం కల్పించేందుకు నిర్మించిన వసతి గృహం/డే కేర్ సెంటర్ ప్రారంభానికి సిద్ధమైంది. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దీన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ, దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం ఆధ్వర్యంలో దేశాయిపేటలో దీని నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం సర్వే నెంబరు 61లో 15 గుంటల స్థలాన్ని కేటాయించారు. 2023 జూన్ నెలలో రూ.4కోట్ల వ్యయంతో నిర్మాణాన్ని చేపట్టారు. కేంద్రం వాటా 60 శాతం, రాష్ట్రం వాటా 40 శాతం నిధులతో దీన్ని నిర్మించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వర్కింగ్ ఉమెన్స్‌తో పాటు ఉన్నత చదువుల కోసం, ఉపాధి-శిక్షణ కోసం వచ్చే మహిళలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నామమాత్రపు రుసుంతో ఇక్కడ వసతి, భోజనం కల్పిస్తారు.

### పిల్లలకు సైతం

మొత్తం 47గదులతో వంద మంది మహిళలు, పది మంది పిల్లల కోసం ప్రత్యేకంగా నిర్మాణం చేపట్టారు. భవనం చుట్టూ ప్రహరీ సైతం నిర్మిస్తున్నారు. వసతి గృహంలో ఉండే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సెక్యూరిటీతో పాటు అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధి, శిక్షణ కోసం వచ్చేమహిళలకు ఆశ్రయం కల్పించడమే లక్ష్యంగా ఈ వసతి గృహాన్ని రూపొందించారు.

### రేపు ప్రారంభించనున్న మంత్రి సురేఖ

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8న శనివారం రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఈ భవనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిసింది. ఇందుకోసం జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. మహిళా దినోత్సవం నాడు ప్రారంభించి, మహిళలకు వసతి గృహం సేవలు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో పనులు వేగంగా పూర్తి చేశారు.

## కోల్‌కతా సాహిత్య సదస్సుకు రామా చంద్రమౌళి

హనుమకొండ కల్చరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కోల్‌కత్తా మహానగరంలో అతి పురాతన సాహిత్య, సాంస్కృతిక సంస్థ, ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ ఇంటర్ కల్చరల్ అండ్ రీసర్చ్ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి మూడు రోజులపాటు జరిగే జాతీయ సదస్సులో పాల్గొనేందుకు నగరానికి చెందిన ప్రముఖ కవి, రచయిత ప్రొఫెసర్ రామా చంద్రమౌళికి ఆహ్వానం అందింది. ప్రసిద్ధ జాతీయ కవిగా పేరొందిన రామా గెస్ట్ ఆఫ్ హానర్‌గా ఈ సదస్సులో పాల్గొననుండటం విశేషం. ఈ సదస్సులో 'గతం యొక్క ప్రతిధ్వనులు - భవిష్యత్ వీక్షణలు' అన్న అంశంపై బహుభాషా ప్రసిద్ధ కవులు పాల్గొంటున్నారు. జాతీయస్థాయిలో ప్రముఖంగా పేరున్న జైరామ్ శేషాద్రి, ఐపీఎస్ అధికారి కిల్లాడ సత్యనారాయణ, ఉప్పులూరి ఆత్రేయ శర్మ, పద్మజా అయ్యంగార్ లాంటి ప్రముఖుల సరసన రామా చంద్రమౌళి పాల్గొంటారు.


రామా చంద్రమౌళి

### వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

| పంట | క్వింటా గరిష్ఠం | క్వింటా కనిష్ఠం |
|---|---|---|
| మక్కలు (బిల్టీ రకం) | 2317 | 2100 |
| పల్లికాయ (సూక) | 6950 | 6500 |
| పల్లికాయ (పచ్చిది) | 4600 | 4400 |
| కందులు | 7010 | 5540 |
| పెసళ్లు | 7159 | 4645 |
| పత్తి | 6900 | 5800 |
| పసుపు (కాడి) | - | - |
| తేజ మిర్చి | 14150 | 9000 |
| డిడి | 13000 | 12500 |
| వండర్‌హాట్ | 16900 | 11500 |
| ఎల్లో మిర్చి | 17000 | 15000 |
| యూఎస్341 | 14000 | 9500 |
| దేశీ | 30000 | 25500 |
| సింగిల్ పట్టి | 39000 | 40000 |
| దీపిక | 17300 | 15245 |
| తాలు మిర్చి | 6500 | 3000 |

- వరంగల్ వ్యవసాయం

# యక్షగాన కిరీటి గజవెల్లి

- బాల్యం నుంచే ప్రదర్శనలిస్తున్న సారయ్య
- విభిన్న పాత్రల్లో రాణింపు



'లవకుశ'లో శ్రీరాముడిగా సారయ్య



విరాట పర్వంలో దుర్యోధనుడి పాత్రలో గజవెల్లి సారయ్య

వడ్డెపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పల్లెవాసుల కట్టుబాట్లు.. తెలంగాణ సంస్కృతి సౌరభాలు.. పురాతన ఆచారాలపై అబ్బురపరిచే ప్రదర్శనలిస్తూ యక్షగాన కిరీటిగా వెలుగొందుతున్నారు గజవెల్లి సారయ్య. పాలబుగ్గల ప్రాయం నుంచే పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తూ జిల్లా కీర్తిని రాష్ట్ర నలుదిశల చాటుతున్నారు. నటనలో రారాజుగా తన హావభావలతో అబ్బురపర్చే ప్రదర్శనలతో ఔరా అనిపిస్తున్నారు. హసన్‌పర్తి మండలం పెగడపెల్లి గ్రామానికి చెందిన గజవెల్లి సారయ్య కళారంగంలో అందరికి సుపరిచితుడే. ఐదేళ్ల వయసు నుంచే తండ్రి సమ్మయ్య వెంట గ్రామ గ్రామాన తిరుగుతూ ముఖానికి రంగు పులుముకొని ప్రదర్శనలు ఇచ్చేవారు. ప్రదర్శనల సందర్భంగా ప్రతిఫలంగా గ్రామస్థుల నుంచి నగదు, ధాన్యం, వస్త్రాలు పొందేవారు. లోహితాషుడు, భక్త సిరియాల్, భక్త ప్రహ్లాదుడు, భక్త మార్కండేయ, బాలబద్దిరాజు తదితర పౌరాణిక నాటకాల్లో బాల పాత్రలు వేయడంలో ఆయనకు ఆయనే సాటి. 16 ఏళ్ల వయసు నుంచే శ్రీకృష్ణుడు, భభ్రువాహనుడు, అర్జునుడు, పుండరీకుడు, కీచకుడు, రావణ బ్రహ్మ, మహిరావణుడు, మాయల పకీర్, మాంధాత రాజు, సత్య హరిశ్చంద్ర, హిరణ్యకశ్యకుడు,యమధర్మరాజు లాంటి విభిన్న పాత్రలను పోషిస్తూ ప్రజాదరణ పొందారు. బాల్యంలో నేర్చుకున్న నాటకాలకు మరింత పదును పెట్టిన సారయ్య ఇంతింతై వటుడింతై అన్న చందంగా కళారంగంలో రాణిస్తూ అధికారులు, ప్రజా ప్రతినిధుల నుంచి అవార్డులు, రివార్డులు, ప్రశంసలను పొందుతున్నారు. ప్రస్తుతం గజవెల్లి సారయ్య తెలంగాణ రాష్ట్ర చిందు వృత్తి కళాకారుల సంఘం అధ్యక్షుడిగా పనిచేస్తూ కళాకారుల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. ప్రత్యేక రాష్ట్ర పోరులో ఎన్నో చిందు యక్షగాన ప్రదర్శనలు ఇచ్చి ఉద్యమానికి ఊపిరిలూదారు సారయ్య.



అవార్డులతో గజవెల్లి సారయ్య

### సారయ్య కళా ప్రదర్శనలో మైలురాళ్లు..

1989 సంవత్సరంలో జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సారా నిషేధం, రూ. 2కే కిలో బియ్యం, ఉచిత కరెంటు, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలపై ప్రజలను చైతన్యం చేస్తూ రాష్ట్రంలోని 3 వేల గ్రామాల్లో ప్రదర్శనలిచ్చారు. 1991 నుంచి వరంగల్ ఆకాశవాణి ద్వారా 1500కార్యక్రమాలు హైదరాబాద్ కేంద్రం ద్వారా శ్రోతలకు 300 పౌరాణిక చిందు యక్షగాన ప్రదర్శన నాటకాలను వినిపించారు. 1999లో మద్రాసులో దక్షిణ చిత్రలో పది రోజుల పాటు ప్రదర్శనలు ఇచ్చి అక్కడి అధికారుల ప్రశంసలు అందుకున్నారు. 2010లో తిరుపతిలోని శిల్పారామంలో ప్రదర్శన ఇచ్చారు. 2010లో హైదరాబాద్‌కు చెందిన స్పృహ సాహితీ సంస్థ సారయ్య ప్రదర్శనను గుర్తించి ప్రముఖ కవి జూలూరు గౌరీశంకర్, సీనియర్ పాత్రికేయుడు డాక్టర్ పొత్తూరి వెంకటేశ్వర్లు, చుక్క రామయ్య, ఆచార్య జయధీర్ తిరుమల్‌రావు, సినీ దర్శకుడు బి.నర్సింగరావు, గేయ కవులు అందెశ్రీ, గోరటి వెంకన్న సమక్షంలో ఘనంగా సన్మానించి రూ.10వేల నగదు బహుమతిని అందజేశారు.

### యక్షగాన కళాకారులకు ఫించన్ మంజూరు చేయాలి



"చిందు కళాకారులకు నెలకు రూ.10వేల చొప్పున పింఛను మంజూరు చేయాలి. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డు, నివేశన స్థలాలు ఇవ్వాలి. ఆర్టీసీ బస్సులు, రైళ్లల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలి. చిందు కళాకారులు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం అందించాలి. చిందు యక్షగాన కళాకారులకు గుర్తింపు కార్డులు, గద్దర్, కేంద్ర అవార్డులు ప్రదానం చేయాలి. చిందు కళాకారులకు హైదరాబాద్‌లో ఎకరం స్థలం కేటాయించి చిందు భవనాన్ని ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలి."

- గజవెల్లి సారయ్య, చిందు యక్షగాన వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

# గడ్డి గింజల ఉత్పత్తిలో నెంబర్ వన్



- దేశంలోనే మొదటి స్థానంలో ముల్కనూర్ మహిళా డెయిరీ
- రూ.20కోట్లు కేటాయింపు.. క్వింటా గింజలకు గాను రైతుకు రూ.7500 చెల్లింపు
- ఈ సీజన్లో 6వేల క్వింటాళ్లు ఇతర రాష్ట్రాలకు తరలింపు
- ప్రణాళిక రూపొందించిన జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ



ఓ రైతు సాగు చేసిన జవారి గడ్డి గింజల చేను



ఇతర ప్రాంతాల నుంచి బస్తాల్లో వచ్చిన జవారి గడ్డి గింజలను దిగుమతి చేస్తున్న కార్మికులు

భీమదేవరపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మేలు జాతి పశువులకు మేలైన గడ్డి జాతి గింజలను తయారు చేసేందుకు జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ (ఎన్‌డీడీబీ) ప్రత్యేక ప్రణాళికలు చేపడుతోంది. గతంలో పాడి పశువులు 7-8 లీటర్ల పాలు ఇస్తేనే గగనం. అలాంటిది నేటి రోజుల్లో 15-20 లీటర్లు ఇచ్చే సంకర జాతి పశువులు అందుబాటులోకి వచ్చాయి. అలా ఎక్కువ మోతాదులో పాలు ఇచ్చే పాడి పశువులకు మామూలు పచ్చి మేత వేస్తే సత్ఫలితాలు రావని ఎన్‌డీడీబీ భావించింది. ఇందుకోసం నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో భాగంగా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో 60వేల క్వింటాళ్ల మేలైన గడ్డి గింజలను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం సహకార సంఘాల ఆధ్వర్యంలో నడిచే సంస్థల్లో మేలైన గడ్డి గింజలను తయారు చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించింది. దేశంలోని అన్ని ప్రాంతాల్లో పాడి పశువులకు పశువుల మేత అందుబాటులో ఉంచాలని ఈ పథకానికి ఎన్‌డీడీబీ శ్రీకారం చుట్టింది. పశువుల మేతలో అధిక దిగుబడులను ఇచ్చే వంగడాలు, అధిక పోషకాలిచ్చే గడ్డి జాతి గింజలను విత్తనోత్పత్తి చేసి పాడి రైతులకు రాయితీపై అందించాలని లక్ష్యం నిర్దేశించింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లోని డెయిరీలకు మేలైన గడ్డి గింజలను ఉత్పత్తి చేసేందుకు విత్తనాలను సరఫరా చేసింది. అందులో భాగంగా ముల్కనూర్ మహిళా డెయిరీలో గడ్డి గింజల తయారీని చేపట్టాలని ఆదేశించింది. ప్రస్తుతం ముల్కనూర్ మహిళా డెయిరీ పరిధిలో గడ్డి గింజల ఉత్పత్తి పథకం ముమ్మరంగా సాగుతోంది .



గడ్డి గింజలను ప్యాక్ చేస్తున్న కార్మికులు

### 20వేల క్వింటాళ్ల గడ్డి గింజల ఉత్పత్తి

ముల్కనూర్ మహిళా డెయిరీ పరిధిలో 20వేల క్వింటాళ్ల గడ్డి గింజల ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టింది. డెయిరీ పరిధిలోని వివిధ గ్రామాల్లో రైతులచే పచ్చ జొన్న (జవారి జొన్న), మొక్కజొన్న విత్తనాలను తయారు చేయాలని విత్తనాలను పంపించారు. డెయిరీ పరిధిలో రైతులు పండించిన జవారి గడ్డి విత్తనాలకు క్వింటాల్‌కు రూ. 7500 చెల్లించాలని ధర నిర్ణయించారు. దీంతో డెయిరీ పరిధిలోని పలువురు రైతులు జవారి జొన్న గడ్డి విత్తనాలను తయారు చేసేందుకు ముందుకు వచ్చారు.

### ఉత్పత్తికి రూ.20 కోట్లు విడుదల

ముల్కనూర్ మహిళా డెయిరీలో 20వేల క్వింటాళ్ల జవారి, మొక్కజొన్న గడ్డి విత్తనాలను తయారు చేసేందుకు రూ. 20కోట్ల నిధులను మహిళా డెయిరీకి ఎన్‌డీడీబీ విడుదల చేసింది. ఈ నిధులతో గడ్డి విత్తనాలను తయారు చేసేందుకు డెయిరీ పరిధిలోని అధికారులు తీవ్రంగా రైతులతో శ్రమిస్తున్నారు. 20వేల క్వింటాళ్ల గడ్డి గింజల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకోగా 6వేల క్వింటాళ్ల గడ్డి విత్తనాలను దేశంలోని వివిధ ప్రాంతాల్లోని రాష్ట్రాలకు తరలించారు.

రాజస్థాన్, పంజాబ్, యూపీ, బీహార్, గుజరాత్, పశ్చిమ బెంగాల్, తదితర రాష్ట్రాలకు గడ్డి విత్తనాలను పంపించారు. రత్నగిరి గ్రామంలోని ముల్కనూర్ సహకార బ్యాంక్ సీడ్ ప్లాంట్ ద్వారా తయారైన జవారి విత్తనాలను ప్యాకింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు పంపిస్తున్నారు. 3కిలోలు, 6కిలోల బ్యాగులలో ప్యాకింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రైతులు పండించిన జవారి విత్తనాలకు నేరుగా క్వింటాల్‌కు రూ. 7500 చొప్పున నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేస్తున్నారు. దీంతో నిధుల అవకతవకలకు పాల్పడకుండా ఉంటుందని ఎన్‌డీడీబీ ఈ చర్యలు చేపట్టింది.

### 20వేల క్వింటాళ్ల గడ్డి గింజల ఉత్పత్తే లక్ష్యం..



ముల్కనూర్ మహిళా డెయిరీలో 20వేల క్వింటాళ్ల జవారి గడ్డి గింజలను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 6వేల క్వింటాళ్ల గడ్డి గింజలను దేశంలోని వివిధ రాష్ట్రాలకు తరలించాం. మరో నెల రోజుల్లో మిగతా 14వేల క్వింటాళ్ల గడ్డి గింజలను దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తాం. ఎన్‌డీడీబీ గడ్డి గింజల ఉత్పత్తి కోసం ముల్కనూర్ మహిళా డెయిరీకి రూ. 20కోట్ల నిధులను విడుదల చేసింది. 60వేల క్వింటాళ్ల గడ్డి గింజల దిగుబడి దేశంలో లక్ష్యంగా కాగా ఒక్క ముల్కనూర్ మహిళా డెయిరీ 20వేల క్వింటాళ్ల గడ్డి గింజలను తయారు చేసి దేశంలోనే నంబర్‌వన్‌గా నిలుస్తుంది.

- మార్పాటి భాస్కర్‌రెడ్డి, జనరల్ మేనేజర్, ముల్కనూర్ మహిళా డెయిరీ

### జవారి విత్తనాలు పండిస్తే ఎంతో లాభం



యాసంగిలో జవారి గడ్డి విత్తనాలు పండిస్తే ఎంతో లాభంగా ఉంది. యాసంగిలో నీటి ఎద్దడి ఉండడంతో నేను ముల్కనూర్ మహిళా డెయిరీ ద్వారా జవారి విత్తనాలను తీసుకొని రెండెకరాల్లో సాగు చేశాను. నా పంట ఎండిపోకుండా పండింది. క్వింటాల్‌కు రూ. 7500 ధరగా నిర్ణయించడంతో రైతులకు ఎంతో లాభం ఉంటుంది. ఎకరంలో 10-12క్వింటాళ్ల జవారి విత్తనాలు పండే అవకాశం ఉంది.

- సంగెం సదానందం, రైతు, కొప్పురు

# ఖండాలు దాటిన ప్రేమ

- పెళ్లాడిన దక్షిణ అమెరికా అమ్మాయి.. తెలంగాణ అబ్బాయి
- కేసముద్రంలో ఘనంగా వివాహ వేడుక



కేసముద్రంలో కొలంబియా అమ్మాయి రియా, కేసముద్రం అబ్బాయి సాయిచైతన్య వివాహం

కేసముద్రం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఖండాలు దాటిన వారి ప్రేమ.. పెళ్లితో నూరేళ్ల బంధానికి అడుగులు వేసింది. ఉన్నత చదువులు కోసం ఆస్ట్రేలియా వెళ్లి.. అక్కడే ఉద్యోగం చేస్తున్న క్రమంలో దక్షిణ అమెరికా ఖండం కొలంబియా దేశానికి చెందిన అమ్మాయితో తెలంగాణ అబ్బాయికి ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. చివరకు వారు అబ్బాయి స్వస్థలమైన తెలంగాణలో వివాహం చేసుకున్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రానికి చెందిన వేల్పుల రాజేష్‌యాదవ్- ప్రసన్నలత దంపతుల పెద్దకుమారుడు సాయిచైతన్య ఉన్నత చదువుల నిమిత్తం ఎనిమిదేళ్ల క్రితం ఆస్ట్రేలియాకు వెళ్లాడు. చదువు పూర్తయ్యాక అక్కడే ఒక ప్రముఖ కంపెనీలో ఈవెంట్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఇక దక్షిణ అమెరికా ఖండంలోని కొలంబియా దేశం బొగోట్టా పట్టణానికి చెందిన యుక్లేడిస్ ఖింతేరో-వేల్గా మరియ దంపతుల కుమార్తె రియా కూడా ఆస్ట్రేలియాలో సాయిచైతన్య పని చేసే కంపెనీలోనే అకౌంటెంట్‌గా చేరింది. నాలుగేళ్ల క్రితం ఇద్దరికీ పరిచయం ఏర్పడగా అది ప్రేమగా మారింది. దీంతో ఆ ఇద్దరు తమ పెద్దలను ఒప్పించి గురువారం కేసముద్రం అమినాపురంలో హిందూ సంప్రదాయంలో వివాహం చేసుకున్నారు. నాలుగు రోజులుగా హల్దీ, మెహందీ, సంగీత్ కార్యక్రమాలను నిర్వహించగా.. వధువు తరపున కొలంబియా నుంచి ఆమె అన్న సరియో, వదిన జులియానా హాజరయ్యారు. ఈ సందర్భంగా సరియో, జులియానాలు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఐదు రోజుల పాటు నిర్వహించిన వివాహ వేడుకల్లో తాము పాల్గొన్నామని, ఈ సంస్కృతి, సంప్రదాయాలు తమకు చాలా నచ్చాయని సంతోషం వ్యక్తం చేశారు. తమ దేశంలో గంటలోనే వివాహం జరిపించి, 50 నుంచి వంద మంది హాజరవుతారని, వందల సంఖ్యలో పెళ్లికి రావడం బంధాలకు ఇక్కడ అధిక ప్రాధాన్యతనిస్తారని తమకు అర్థమవుతోందని అన్నారు.

# ఉన్నది రెండు నెలలు.. మొదలు కాని పనులు

- సరస్వతీ పుష్కరాలకు సమీపిస్తున్న సమయం
- భక్తులకు చేయాల్సిన ఏర్పాట్లలో తీవ్ర నిర్లక్ష్యం
- రూ.25కోట్లు విడుదలై టెండర్లు పూర్తయినా ఫలితం శూన్యం





కాళేశ్వర ఆలయం

మహదేవపూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పుష్కర స్నానం చేస్తే సకల పాపాలు పోతాయని పెద్దలు చెప్పిన మాట.. ఈ క్రమంలో పుష్కర స్నానాల కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. ఇక తెలంగాణలోనే ప్రాచీన పుణ్య క్షేత్రంగా.. ఒకే పానవట్టంపై రెండు లింగాలు, గోదావరి ప్రాణహిత అంతర్వాయిహినిగా సరస్వతిగా మూడు నదులు, మూడు రాష్ట్రాల సరిహద్దులో ఉండి త్రిలింగాలలో ఒకటిగా విలసిల్లుతున్న కాళేశ్వరానికి భక్తులు లక్షలాదిగా తరలొస్తారు. భూపాలపల్లి జయశంకర్ జిల్లాలోని మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వరస్వామి క్షేత్రం వద్ద మే 15 నుంచి సరస్వతి పుష్కరాలు జరగనుండగా.. 12ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ పుష్కరాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలోనే భక్తులకు ఎలంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రూ.25కోట్ల నిధులు మంజూరు చేయించారు. పనులకు టెండర్లు పూర్తయ్యాయి. మరో రెండు నెలల్లో సరస్వతి పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. కానీ నేటికీ ఏ ఒక్క పని కూడా ప్రారంభం కాలేదు. గతంలో కూడా రూ.25 కోట్లు బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేస్తే పదేళ్లు దాటినా ఇంకా పనులు పూర్తి కాక ఎక్కడివక్కడే మిగిలిపోయాయి. గతంలో జరిగిన సరస్వతి పుష్కరాలకు 12రోజుల్లో 50వేల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తే ఈ 2025లో జరిగే మహాసరస్వతి పుష్కరాలకు 5లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి. రూ.కోట్లు మంజూరు చేసినప్పటికీ పనులు పూర్తయితాయా లేదా అనేది ప్రశ్నార్థకమే. ఈ సరస్వతి పుష్కరంలోనే ఇండియాలోనే గంగా యమున, సరస్వతి పుష్కరాలకంటే తెలగాణలో జరిగే అతి ప్రాచీనమైన, పవిత్రమైన గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల్లో స్నానాలు చేస్తే ఎంత భాగ్యం కలుగుతుందని, అంత దూరం పోకుండా తెలంగాణలో జరిగే పుష్కరాల్లో స్నానం చేస్తే మరింత పుణ్యం వస్తుందని పురోహితులు తెలిపారు. మేలో జరిగే పుష్కరాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ ఇప్పటివరకు ఒక్క పని కూడా కాకపోవడం గమనార్హం. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో 8, 18 లక్షలకు గాను 26 పనులకు నిధులు మంజూరవగా పంచాయతీ రాజ్‌కు రూ.3కోట్లు మంజూరయ్యాయి.

ఇరిగేషన్‌కు 5కోట్లు మంజూరయ్యాయి. ఆర్‌డబ్ల్యూఎస్, మరుగుదొడ్ల కోసం రూ.2.23కోట్లు మంజూరయ్యాయి. దీంతో పాటు అన్ని పనులకు సీసీ రోడ్లు, ఇతర పనులకు రూ.26కోట్లకు పనులు మంజూరు చేసి టెండర్లు పూర్తి చేసింది. మండుటెండలు ఎక్కువగా ఉండడంతో మేలో జరిగే పుష్కరాలకు తొందరలోనే పనులు పూర్తి చేయాలని పలువురు భక్తులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# ఔషధఫలం రేగు..




### రుచికి రుచి.. ఆరోగ్యానికి ఆరోగ్యం

లింగాలఘణపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే అనేక పండ్లలో రేగు పండ్లకు ప్రత్యేక స్థానముంది. ఉండేది చిన్న సైజు అయినా మనిషికి పెద్ద ప్రయోజనమే ఒకగూరుస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఈ రేగు పండ్లలో అనేక రకాల ఔషధగుణాలు ఉండటం విశేషం. 4వేల ఏళ్ల క్రితం నుంచే రేగు పండ్లను మానవాళి ఎంతో ఇష్టంగా తింటుందని చరిత్ర చెబుతోంది. ప్రస్తుతం రేగు పండ్లు పుష్కలంగా లభించే సీజన్. ఉష్ణమండల ప్రాంతాల్లో పెరిగే రామ్నేసి కుటుంబంలోని జిజిఫస్ జాతికి చెందింది. దీని శాస్త్రీయనామం జిజిఫస్ మార్టియానా. వీటిని తింటే రుచికి తియ్యతియ్యగా.. కాస్త పులుపుగా ఉండే రేగు పళ్లను నోట్లో వేసుకుని చప్పరిస్తుంటే అప్రయత్నంగానే కళ్లు అరమూతలు పడుతుంటాయి. రేగు పండ్ల రుచికి మంత్రముగ్ధుడైన మహావిష్ణువు ఒకనాడు రోజంతా రేగు పండ్లను తిని కడుపు నింపుకున్నాడట అందుకే ఆయనను బదరీ నారాయణుడు అని కూడా పిలుస్తారు. భారతదేశంలో 90 రకాల రేగుజాతులు అందుబాటులో ఉన్నాయి. మొదట చైనాలో మాత్రమే లభించిన రేగు పండ్లు ఆ తర్వాత అమెరికా, ఇండియా, శ్రీలంక, అఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ దేశాలను కూడా చుట్టేశాయి. పెరుగుతున్న ఆధునిక వంటల విధానాల్లో రేగు పండ్లను భారతీయులు అనేక ఆహార రుచులతో ఆస్వాదిస్తున్నారు. జామ్, జెల్లీ, పానీయాల తయారీలోను, స్వీట్లు, సలాడ్స్‌లో వినియోగిస్తున్నారు.

### ఔషధగుణాల సమాహారం..





చిన్న రేగు చెట్టు

రేగు పండ్లు రుచికి మాత్రమే కాదు.. ఆరోగ్యానికి అద్భుతంగా ఉపకరించే ప్రకృతి వరఫలం కూడా. ఇందులో అనేక ఔషధగుణాలున్నాయి. రేగు పండ్లతో తయారు చేసిన మందులు, జీర్ణ శక్తి, ఆకలి పెరగడం, రక్తహీనత నివారణ, విసుగు, నీరసం, శ్వాసనాళాల వాపును తగ్గించేందుకు కీలకంగా ఉపయోగపడుతాయి. గొంతు నొప్పి, హిస్టీరియా, అజీర్తి, కడుపులోమంట సమస్యలను తగ్గించేందుకు అద్భుతంగా పనిచేస్తాయి. పండ్లు మాత్రమే కాకుండా రేగు చెట్టు ఆకులను నూరి కట్టిపెడితే పుండ్లగాయాలు మానిపోతాయి. రేగు చెట్టు బెరడుతో తయారుచేసిన ఔషధాలు జ్వరం, తలనొప్పి, అతిసార, విరేచనాలను అరికడుతాయి. రేగుపండ్లలో సీ విటవిన్‌తో పాటుగా ఏ, బీ1, బీ2, బీ3 విటమిన్లు లభిస్తాయి. వీటిలో చక్కెర, పిండిపదార్థాలు ఉంటాయి. రేగు పండ్లు రోగనిరోధక శక్తిని పెంపొందించడమే కాకుండా చెడుకొవ్వును కూడా కరగదీస్తాయని, మనసు బాగలేనప్పుడు రేగుపండ్లను తింటే మనసుకు స్వస్థత చేకూరుతుందని ఆయుర్వేద వైద్యులు పేర్కొంటున్నారు.

## సబ్జెక్టుపై పట్టుకు కార్యశాలలు దోహదం

కేయూ క్యాంపస్ మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సబ్జెక్టులపై సమర్థవంతమైన అవగాహనకు వర్క్‌షాప్‌లు మరింత విస్తృతంగా దోహదం చేస్తాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ఎదగాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉద్బోధించారు. గురువారం కేయూ జువాలజీ విభాగం నేతృత్వంలో నిర్వహిస్తున్నట్లు జాతీయ స్థాయి వర్క్‌షాప్ ముగింపు సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జువాలజీ విభాగం సెమినార్ హాల్‌లో 'యూజ్ ఆఫ్ రీక్యాబినేట్ డీఎన్ఏ టెక్నాలజీస్ ఇన్ హెల్త్‌కేర్' అనే అంశంపై విభాగాధిపతి షమిత అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ రామచంద్రం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రెండు రోజుల కార్యశాలలో నేర్చుకున్న నూతన అంశాలు, స్పీకర్స్ చెప్పిన సబ్జెక్టులపై విద్యార్థులు విస్తృతమైన నోట్స్ రాసుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలని కోరారు.

హెల్త్‌కేర్‌లో భారత దేశంలో విస్తృత అవకాశాలున్నాయని రిజిస్ట్రార్ రామచంద్రం తెలిపారు. వ్యాక్సిన్ల తయారీతో దేశంలో ప్రపంచాన్ని శాసించిందని అన్నారు. రానున్న రోజుల్లో నాణ్యమైన ఔషధాలు తక్కువ ధరకు పేదలందరికీ అందుబాటులోకి తెచ్చేలా కృషి చేయలన్నారు. ఈ వర్క్‌షాప్‌లో కేయూ యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, ప్రొఫెసర్ ఈసం నారాయణ, శేషాద్రి, ఇతర బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

కాజీపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక యుగంలో నేటి యువత క్యాన్సర్ వ్యాధిని నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తం ఉండాలని సికింద్రాబాద్ రైల్వే సీఎంఎస్ నారాయణస్వామి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం కాజీపేట రైల్వే ఆస్పత్రిలో రైల్వే వుమెన్స్ ఆర్గనైజేషన్, ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో కాన్సర్‌పై వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణస్వామి మాట్లాడారు. స్థూలకాయంతోనే ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. స్థూలకాయం తగ్గించుకునేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. స్త్రీలలో రొమ్ము, సెర్విక్స్ ఓరల్ క్యాన్సర్‌పై స్త్రీలు అవగాహన కల్పించుకోవాలన్నారు. క్యాన్సర్ వ్యాధిపై ఎలాంటి అనుమానాలున్నా వెంటనే వైద్యుడిని సంప్రదించి తగిన సలహాలు తీసుకోవాలన్నారు. మొదటి స్టేజీలో క్యాన్సర్‌ను పూర్తిగా నయంచేసుకునే వీలుంటుందని చెప్పారు. అనంతరం 200 వందల మందికి స్త్రీలకు వివిధ రాకాల టెస్టులు చేశారు. కార్యక్రమంలో కాజీపేట ఏసీఎంఎస్ డాక్టర్ నిరంజన్, డాక్టర్లు నరేందర్ హిర్వాని, యాకుబ్, ధీరజ్ వినయ్, అవినాష్, డాక్టర్ సుస్మిత, చీఫ్ ఫార్మసిస్ట్ చింత తిరుపతి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ సోమరాజు నర్సింగ్ సిస్టర్‌లు కవిత, జమునతోపాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## మోటారు పంపులను మరమ్మతు చేసి వినియోగించాలి : మేయర్



కేయూ రుద్రమాంబ ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : దెబ్బతిన్న మోటారు పంపులను మరమ్మతుచేసి వినియోగంలోకి తీసుకురావాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. గురువారం కాకతీయ యూనివర్సిటీ ప్రాంగణంలోని రుద్రమాంబ ఫిల్టర్‌బెడ్‌ను మేయర్ అకస్మికంగా తనిఖీ చేశారు.ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వేసవికాలం నేపథ్యంలో నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా అధికారులు, సిబ్బంది నిరంతరం పని చేయాలని అన్నారు. ఫిల్టర్‌బెడ్‌లలో పనిచేసే సిబ్బందిని ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు అప్రమత్తం చేయాలని సూచించారు. ఫిల్టర్‌బెడ్‌లలో పచ్చదనం కోసం హార్టికల్చర్ అధికారులు మొక్కలు నాటాలని ఆదేశించారు. అనంతరం అక్కడ పని చేసే సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. ఈఈ మహేందర్, మాధవీలత, సంతోష్‌బాబు, డీఈ రాజ్‌కుమార్, ఏఈలు హరికుమార్, సరిత పాల్గొన్నారు.

## ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి : సీపీ

వరంగల్ క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సుదీర్ఘ కాలంగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన సిబ్బంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. హోంగార్డుగా చాలా ఏళ్లుగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన మోహిన్‌ను సీపీ గురువారం తన చాంబర్‌లో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ఏసీపీ నాగయ్య, ఆర్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## కాకతీయ మ్యూజికల్ గార్డెన్ పనులు పూర్తి చేయండి

- కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే
- కాకతీయ మ్యూజికల్ గార్డెన్ పనుల పునరుద్ధరణ



మ్యూజికల్ గార్డెన్ పనులను పరిశీలిస్తున్న అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కుడా ఆధ్వర్యంలో జరుగుతున్న కాకతీయ మ్యూజికల్ గార్డెన్ పునరుద్ధరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. గురువారం వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయం వెనుక కుడా ఆధ్వర్యంలో మ్యూజికల్ గార్డెన్ పునరుద్ధరణ పనులను కుడా అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిపై అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫౌంటేషన్ పనులను పరిశీలించి సమర్థవంతంగా నిర్వర్తించుటకు అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం భద్రకాళి చెరువు పూడికతీత పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అంతే కాకుండా ఖిలావరంగల్, ఏకశిలా పార్కులను అకస్మికంగా తనిఖీ చేసి అక్కడి సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గడువులోగా మ్యూజికల్ గార్డెన్‌పనులు పూర్తి చేయాలన్నారు. ఇంకా భద్రకాళి చెరువు పూడికతీతలో 3 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికతీత లక్ష్యంగా అధికారులు కృషి చేయాలన్నారు. అప్పటికే 50వేల క్యూబిక్ మీటర్ల మట్టిని డిసిల్టేషన్ చేయడం జరిగిందన్నారు. వరంగల్ నగర ప్రజల సౌకర్యార్థం కోసం ఏకశిల పార్క్‌లో టాయిలెట్లు, కిచెన్, డైనింగ్ హాల్‌తో పాటు పచ్చని చెట్లను పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట కుడా పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

### వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో

## స్కానింగ్ సెంటర్ల తనిఖీ

వరంగల్ మెడికల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కమిషనర్ కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశం మేరకు గురువారం రాష్ట్ర ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుమిత్ర నాయక్ హనుమకొండ, వరంగల్‌లోని పలు ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, అనుమతులను పరిశీలించారు. నిబంధనలు పాటించకుండా చట్టం ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. చెకప్ కోసం వచ్చిన వారికి లింగ వివక్ష, ఆడపిల్లల ప్రాముఖ్యంపై గురించి వివరించాలని తెలిపారు. ఈ తనిఖీల్లో డాక్టర్ మంజుల, ఓ.రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పొగాకు ఉత్పత్తుల పట్టివేత

మడికొండ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అక్రమంగా విక్రయిస్తున్న పొగాకు ఉత్పత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మడికొండ ఎస్సై రాజ్‌కుమార్ వివరాల ప్రకారం.. హెడ్ కానిస్టేబుళ్లు జంపయ్య, జయరాజ్, కానిస్టేబుల్ శ్రావణ్‌కుమార్‌లు గురువారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇండస్ట్రియల్ ఏరియాలో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు వెళ్లి చూడగా రాజస్థాన్‌కు చెందిన పన్నాలాల్ చౌదరి అనే వ్యక్తి తన దుకాణంలో రూ.6,614 విలువ గల పొగాకు ఉత్పత్తులను నిలువ ఉంచాడు. పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని విక్రయిస్తున్న పన్నాలాల్‌ను తదుపరి చర్యల కోసం స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలు

మామునూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా కేంద్రియ విద్యాలయాల్లో ఒకటో తరగతి నుంచి 11వ తరగతి వరకు ప్రవేశాలకు సంబంధించి గురువారం నోటిఫికేషన్ విడుదలైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, వాటి రక్షణ రంగ అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న పిల్లలకు, అంతేగాకుండా ఏకైక సంతానంగా ఉన్న బాలబాలికలకు ఇందులో ప్రాధాన్యం ఉంటుంది. అర్హత ఉన్న వారు ప్రవేశాల కోసం ఈనెల 7వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

## శాంపిల్ పేరుతో అధికారి వేధింపులు

బాలసముద్రం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని ఒక బేకరి షాపులో శాంపిల్ తీస్తానని బెదిరించి, శాంపిల్ తీయకుండా ఉండేందుకు నజరానా కావాలని ఓ ఫుడ్ సేఫ్టీ అధికారి అడిగిన వైనం గలాటాకు దారి తీసింది. సుమారు 15 రోజుల కిందటే ఫుడ్ లైసెన్స్ కోసం రూ.15వేలు తీసుకున్న సదరు అధికారి.. మళ్లీ గురువారం షాపునకు వచ్చి నజరానా కింద రూ.50వేలు ముట్ట చెప్పాలని డిమాండ్ చేశారు.

అందుకు విస్మయం చెందిన షాపు యజమాని దిక్కుతోచక తన మిత్రుడైన ఒకరికి చెప్పడంతో అతడు వచ్చి అధికారిని నిలదీశాడు. శాంపిల్ అసిస్టెంట్‌ను తీసుకొచ్చి శాంపిల్ తీయకుండా ప్రైవేటు వ్యక్తిని ఎందుకు తీసుకొచ్చా రని, ప్రభుత్వ వాహనంలో రాకుండా ప్రైవేటు వాహనంలో ఎందుకు వచ్చారని నిలదీశాడు. దీంతో సమస్య తీవ్రమవుతుందని భావించిన సదరు అధికారి.. అక్కడి నుంచి జారుకున్నాడు.

## రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

ఫటాఫట్



ఎం.శ్రీనివాస్, లీడ్ బ్యాంకు మేనేజర్, హనుమకొండ జిల్లా

హనుమకొండ జిల్లాలో కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాలు, సైబర్ నేరాల నియంత్రణ కోసం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు వివిధ బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణాల వివరాలపై హనుమకొండ జిల్లా లీడ్ బ్యాంకుమేనేజర్ ఎం.శ్రీనివాస్‌తో 'ఆంధ్రజ్యోతి' ఫటాఫట్ ఇంటర్వ్యూ..

**ఆంధ్రజ్యోతి:** చేతి వృత్తిదారుల కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నూతన పథకాలు ఏమిటి?

**లీడ్ బ్యాంకు మేనేజర్:** చేతి వృత్తుల వారికి పీఎం విశ్వకర్మ, ఆహార శుద్ధి కోసం పీఎంఎఫ్ఎంఈ లాంటి పథకాలు అందుబాటులో ఉన్నాయి.

**ఆంధ్రజ్యోతి:** జిల్లాలో ఎన్ని శాఖల బ్యాంకులు ఉన్నాయి, మొత్తం డిపాజిట్లు ఎన్ని?

**లీడ్ బ్యాంకు మేనేజర్:** హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 169 శాఖల బ్యాంకులు ఉన్నాయి. మొత్తం డిపాజిట్లు రూ.15వేల 820కోట్లు, లోన్లు రూ.21070 కోట్లు.

**ఆంధ్రజ్యోతి:** సామాజిక భద్రతలో ఉన్న బీమా సంస్థలెన్ని?

**లీడ్ బ్యాంకు మేనేజర్:** పీఎంజేజేబీవైలో 82,722, పీఎం ఎస్‌బీఐలో 2,83,614, అటల్ పెన్షన్ యోజనలో 53,553 ఉన్నాయి.

**ఆంధ్రజ్యోతి:** పరిశ్రమల రంగానికి బడ్జెట్ ఎంత కేటాయించారు?

**లీడ్ బ్యాంకు మేనేజర్:** హనుమకొండ జిల్లాలో రూ.3,280 కోట్ల లక్ష్యం సాధించినవి రూ.1734కోట్లు

**ఆంధ్రజ్యోతి:** సంవత్సరానికి ప్రాధ్యాన్యత రంగానికి రుణాల లక్ష్యం ఇచ్చినవెన్ని?

**లీడ్ బ్యాంకు మేనేజర్:** హనుమకొండ జిల్లా వ్యాప్తంగా రూ.7,413 కోట్లు లక్ష్యానికి సాధించినవి రూ.58కోట్లు.

**ఆంధ్రజ్యోతి:** వ్యవసాయ రంగానికి ఎంత కేటాయించారు?

**లీడ్ బ్యాంకు మేనేజర్:** జిల్లాలో వ్యవసాయ రంగానికి రూ.3,556 కోట్ల లక్ష్యానికి రూ.3,183కోట్లు రుణాలు మంజూరు చేశాం.

**ఆంధ్రజ్యోతి:** సైబర్ నేరాల నియంత్రణకు కేంద్రం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

**లీడ్ బ్యాంకు మేనేజర్:** సంవత్సర కాలంలో సైబర్, డిజిటల్ అరెస్టులు పెరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం సైబర్ నేరాల నియంత్రణకు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చాం. ఫేక్ ఫోన్ కాల్స్‌తో సైబర్ నేరాలకు గురైన బాధితులు గంటలోపు 1930కు ఫోన్ చేయడం ద్వారా పోగొట్టుకున్న మొత్తం వారి ఖాతాల్లోకి జమ అయ్యే అవకాశం ఉంటుంది.

- హనుమకొండ టౌన్(ఆంధ్రజ్యోతి)

# డంపింగ్ యార్డును తరలించాలి

- ఎమ్మెల్యేలకు వినతిపత్రం అందజేసిన జంగా రాఘవరెడ్డి

మడికొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట మండలం మడికొండ, రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న డంపింగ్ యార్డును త్వరితగతిన తరలించాలని కోరుతూ రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి గురువారం ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. డంపింగ్ యార్డుతో ప్రజలు శ్వాసకోశ వ్యాధితో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని తెలిపారు. ఈ పొగతో రోడ్డును కమ్మివుండటంతో వాహనదారులకు రాకపోకలకు ఇబ్బందులవడమే కాకుండా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నారని పేర్కొన్నారు. డంపింగ్ యార్డు జనవాసాల మధ్య నుంచి తరలించాలని ఆందోళనలు చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈ సమస్యతో చుట్టుపక్కల గ్రామాల వారు క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, తోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు..



కడియం శ్రీహరికి వినతిపత్రం అందజేస్తున్న జంగా రాఘవరెడ్డి

### జంగా దంపతుల ఆర్థిక సాయం

భట్టుపల్లి గ్రామానికి చెందిన వల్లాల రత్నాకర్ కుమారుడు అశ్విత్‌కు కృత్రిమ కాలు శస్త్ర చికిత్సకు కావల్సిన రూ, 50వేలు ఆర్థిక సహాయాన్ని జంగా రాఘవరెడ్డి, సుజాత దంపతులు గురువారం అందజేశారు. తమ కుటుంబానికి అండగా నిలబడి ఆర్థిక సహాయాన్ని అందజేసిన జంగా దంపతులకు అశ్విత్ తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు.

## కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు ఫిర్యాదు

హసన్‌పర్తి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఎల్లాపూర్ రెవెన్యూ శివారు అంగడి భూమితో పాటు ప్రభుత్వ భూముల కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని విలువైన భూములను కాపాడాలని ఎల్లాపూర్ గ్రామస్థులు గురువారం ఆర్డీవో రమేష్‌రాథోడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సంబంధిత ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి కోట్ల విలువచేసే ఇనాం భూమిని కాపాడి ప్రజాప్రయోజనాలకు ఉపయోగపడేలా చూడాలని గ్రామస్థులు కోరారు. ఈ సందర్భంగా ఆర్డీవోను కలిసిన వారిలో గ్రామస్థులు మోతె లింగారెడ్డి, నేదునూరి సునీల్, రేణికుంట్ల దుర్గాప్రసాద్, దోమల శ్రీనివాస్, ఎర్ర నాగరాజు, భాషబోయిన కుమార్ యాదవ్, గోపనబోయిన రవీందర్‌వాల్మీకి, ఎండీ.షేక్‌బాబా, వెలిసోజు బుచ్చిరాములు, తిరుపతి తదితరులున్నారు.

## ముస్లింల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న నయీమొద్దీన్

వడ్డెపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల సంక్షేమం కోసం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలను అమలు చేయకుండా విస్మరించిందని బీఆర్ఎస్ మైనారిటీ సెల్ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎండి నయీమొద్దీన్, మండల కోఆప్షన్ సభ్యుల ఫోరం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.డి. మొహీబుద్దీన్ అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినప్పటికీ మసీదులలో పనిచేసే ఇమామ్, మౌజన్‌లకు వేతనాలను పెంచకుండా దాటవేస్తోందని ఆరోపించారు. గత ఏడాది నుంచి దావత్- ఏ - ఇఫ్తార్ ఏర్పాట్లు లేవన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మైనారిటీ సెల్ జిల్లా నాయకులు లాల్ మొహ్మద్, ఇక్బాల్, ఇస్మాయిల్, అబ్దుల్లాఖాన్, సర్ధార్‌ఖాన్, ఎం.డి.హుస్సేన్, యాకూబ్‌పాషా, తస్లీమ్‌ఖాన్, యాకూబ్, రజాక్, మొహినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## తండ్రికి బాలిక అప్పగింత

కాజీపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో వారితో గొడవ పడి పారిపోయి వచ్చిన బాలికను రైల్వే పోలీసులు గుర్తించి తండ్రికి అప్పగించారు. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్‌కు చెందిన నందిని అనే విద్యార్థిని బొల్లికుంటలోని ఓ కాలేజీ హస్టల్‌లో ఉంటూ బీటెక్ ఫస్టియర్ చదువుతోంది. తల్లి ఇంట్లో నుంచే కాలేజీకి వెళ్లమని మందలించడంతో నందిని ఇంటి నుంచి పారిపోయి తండ్రికి ఫోన్‌చేసింది. తాను కాజీపేట రైల్వేస్టేషన్ ట్రాక్‌పై ఉన్నానని, ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటున్నానని బాలిక తండ్రికి ఫోన్‌చేసింది. నందిని తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఉన్నతాధికారులు ఆదేశాలతో రైల్వే కానిస్టేబుల్ ఆర్.కమలాకర్ కాజీపేట ఆర్ఆర్ఐ క్యాబిన్ వద్ద బుధవారం అర్ధరాత్రి నందినిని అదుపులోకి తీసుకుని తండ్రికి అప్పగించారు.

## రోడ్డు ప్రమాదంలో రైతుకు తీవ్ర గాయాలు

మడికొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో రైతుకు తీవ్ర గాయాలైన ఘటన గురువారం మడికొండలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం., ధర్మసాగర్‌కు చెందిన రైతు మంద కొమురయ్య మడికొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగే బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు ధర్మ సాగర్ నుంచి బైక్‌పై మడికొండకు వస్తున్నాడు. ఈక్రమంలో మడికొండలోని ధర్మసాగర్ మూల మలుపు వద్ద టిప్పర్ లారీని క్రాస్ చేయడానికి ముందుకు వెళ్లగా లారీ కొమురయ్య బైక్ పైకి ఎక్కింది. దీంతో కొముర య్య కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. కొమురయ్యను స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు.

## బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా అవినాష్



బక్కి అవినాష్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

హనుమకొండ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా హనుమకొండ బాలసముద్రం ప్రాంతానికి చెందిన బక్కి అవినాష్ నియమితులయ్యారు. గురువారం హైదరాబాద్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తననివాసంలో నియామకపత్రాన్ని అవినాష్‌కు అందజేశారు.

## ఆర్ట్స్ కళాశాలలో జూట్ బ్యాగుల పంపిణీ

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ జూట్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్ట్స్ కళాశాలలో బోధనేతర సిబ్బందికి ప్రిన్సిపాల్ డాక్టర్ సుంకరి జ్యోతి పంపిణీ చేశారు. కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ చింతం ప్రవీణ్‌కుమార్ సౌజన్యంతో బ్యాగులను పంపిణీ చేశారు. అధ్యాపకులు కరుణాకర్, సదాశివ్, ఫిరోజ్, సతీష్, నాగయ్య పాల్గొన్నారు.

# ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు





నీలిమారెడ్డిని సన్మానిస్తున్న టీఎన్జీవో సంఘం ఉద్యోగులు

హనుమకొండ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని టీఎన్జీవోస్ భవన్‌లో గురువారం ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలను టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నాయిని నీలిమారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలిమారెడ్డిని మహిళా ఉద్యోగులు ఘనంగా శాలువాతో సన్మానించి మహిళా ఉద్యోగులకు ఇటీవల నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన వారికి నీలిమారెడ్డి చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, మహిళా వింగ్ కన్వీనర్ రాజ్యలక్ష్మి, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి రాజేష్, మహిళా ఉద్యోగులు పావని, రజిత, యమున, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

### నేడు టీజీవో ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

హనుమకొండలోని ఐడీఓసీ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శుక్రవారం ఉదయం 10 గంటలకు టీజీవో ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించనున్నట్లు టీజీవో జిల్లా అధ్యక్షుడు డి. మురళీధర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ జిల్లా ప్రిన్సిపాల్ జడ్జి నిర్మల గీతాంబ, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అడిషనల్ కలెక్టర్లు సంధ్యారాణి, వెంకట్‌రెడ్డి, టీజీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్మోహన్‌రావు హాజరు కానున్నట్లు తెలిపారు.

ఇటీవల మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా మహిళా ఉద్యోగులకు వివిధ పోటీలు నిర్వహించగా పోటీల్లో గెలుపొందిన వారికి శుక్రవారం అతిథుల చేత బహుమతుల ప్రదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మహిళా ఉద్యోగులు హాజరు కావాలని కోరారు.

### 8న వికారాబాద్‌లో రాష్ట్ర సదస్సు

వడ్డేపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వికారాబాద్‌లో ఈ నెల 8న నిర్వహించే చైతన్య మహిళా రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని చైతన్య మహిళా సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ కళ, కోకన్వీనర్ అనిత పిలుపునిచ్చారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు విలాసిని, రమ, భవాని, సత్యం, డాక్టర్ మార్క శంకర్‌నారాయణ, రాజు, శ్రీనివాసులు, రాజ్‌మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

### వేడుకలను విజయవంతం చేయాలి

వడ్డేపల్లి : హనుమకొండ వడ్డేపల్లి మెయిన్ రోడ్డులోని వైష్ణవి బంకెట్ హాల్‌లో ఈ నెల 8న నిర్వహించే ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని బీసీ మహిళా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం పద్మజాదేవి, జిల్లా అధ్యక్షురాలు మాడిశెట్టి అరుంధతి పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, విశిష్ట అతిథులుగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మణి మంజరి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ హాజరవుతారని రాజకీయాలకు అతీతంగా అన్ని మహిళా సంఘాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఈసమావేశంలో బీసీ మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మల శోభారాణి, జిల్లా నాయకురాళ్లు బూరుగుల ప్రమదాదేవి, పర్స హైమా, సూర స్రవంతి, నాయిని సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

### మహిళలు అణచివేత నుంచి

## విముక్తి సాధించాలి

హనుమకొండ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలు వివక్షత, దోపిడీ అణచివేతల నుంచి విముక్తి సాధించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి ఆకాక్షించారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో హనుమకొండ జిల్లా సమితి అధ్యక్షురాలు మంచాల రమ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలపై జరుగుతున్న ఆంక్షలు, అత్యాచారాలు వివక్షతపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నెదునూరి జ్యోతి హాజరై మాట్లాడారు. జనాభాలో సగభాగం ఉన్న మహిళలు వారి అభివృద్ధి కోసం రాష్ట్ర, కేంద్ర బడ్జెట్‌లలో సగభాగం కేటాయించి మహిళల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదాలక్ష్మి మాట్లాడుతూ.. తక్షణమే మహిళలకు 33శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి మాట్లాడుతూ.. సమాఖ్య నిర్వహించే పోరాటాలకు సీపీఐ నుంచి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాసమల్ల దీన, తిరుమల, రమ, అంబాల లక్ష్మి, పుశ్ప, వేముల లక్ష్మి, కొమురమ్మ, రాధా, విజయ, లావణ్య, మేరి తదితరులు పాల్గొన్నారు.

## కేయూలో పీడీఎస్‌యూ నిరసన





నిరసన తెలుపుతున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్ మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కేయూ రెగ్యులర్ డిగ్రీ కోర్సుల 1, 3, 5వ సెమిస్టర్ విత్‌హెల్డ్ పరీక్షల ఫలితాలను విడుదల చేయాలని గురువారం కేయూ పరిపాలన భవనం ఎదుట పీడీఎస్‌యూ నేతృత్వంలో నిరసన ఆందోళన చేశారు. అనంతరం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని కలిసి 117 కళాశాలల ఫలితాలను వెల్లడించలేదని పేర్కొన్నారు. ప్రైవేట్ కళాశాలలు వర్సిటీకి ఫీజులు చెల్లించలేదనే సాకుతో ఫలితాలను నిలిపివేయడం సరికాదన్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఫలితాలను విడదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ కేయూ అధ్యక్షకార్యదర్శులు బి.బాలకృష్ణ, వి.కావ్య, గణేశ్‌శ్రీచందన, యాదగిరి, సాధన, హెరియార్, చారి, శ్రీజ, సౌమ్య, నాగ రాజు, వంశీ, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.



సహజయోగ

రేపు మహిళా దినోత్సవం

# సర్వ శక్తులకూ మూలం... ఆమె

'యత్ర నార్యస్తు పూజ్యంతే... రమంతే తత్ర దేవతాః... మహిళలను గౌరవించే చోట దేవతలు నివసిస్తారు' అన్నారు పూర్వులు. మన పురాణాలలో స్త్రీని శక్తిస్వరూపిణిగా వర్ణించారు. ఇంతకీ ఆ శక్తి ఏమిటి? అది ఏ విధమైన శక్తి? దానికి కొలమానం ఏమిటి? అది ఎలా పని చేస్తుంది? ఇలాంటి ప్రశ్నలు ఎన్నిటికో శ్రీమాతాజీ నిర్మలాదేవి వివిధ సందర్భాలలో సమాధానాలు ఇచ్చారు.

"మన ఇతిహాసాలలో శ్రీరాముని శక్తి సీత. శివుడి శక్తి పార్వతి. కృష్ణుడి శక్తి రాధ. ఈ శక్తులు రాక్షస సంహారం కోసమో, యుద్ధం చేయడం కోసమో రణరంగానికి వెళ్ళలేదు. శ్రీరాముడు, కృష్ణుడే యుద్ధం చేశారు. కానీ ఆ శక్తుల ప్రభావం వారితో యుద్ధం చేయించింది. అందుకే... పురుషులది గతి శక్తి అయితే మహిళలది స్థితి శక్తి. బయటనుంచి చూసినప్పుడు ఫ్యాన్ తిరుగుతున్నట్టు కనిపిస్తోంది. కానీ దాన్ని తిప్పుతున్నది దానిలోపల ప్రవహిస్తున్న విద్యుచ్ఛక్తి. అదే విధంగా పురుషులు పనులు చేస్తున్నట్టు కనిపించినా... వారితో ఆ పనులు చేయించేది మాత్రం మహిళల శక్తే. అందుకే స్త్రీని శక్తి స్వరూపిణి అంటారు" అని నిర్మలాదేవి వివరించారు.

### ఆ బాధ్యత మహిళలదే...

జీవశాస్త్రం ప్రకారం కణంలో ఉండే శక్తి కేంద్రాన్ని 'మైటోకాండ్రియా' అంటారు. అది మానవులలో ఒక తరం నుంచి మరో తరానికి సంక్రమించేటప్పుడు... తల్లి ద్వారానే లభిస్తుంది. అంటే ప్రతి మానవుడికి శక్తి తల్లి నుంచే సంక్రమిస్తుంది. కాబట్టి సైన్స్ ప్రకారం కూడా శక్తికి మూలం మహిళే. ఈ తల్లులందరికీ మూలమైన తల్లిని హిందూ ధర్మంలో 'ఆదిశక్తి' అని పిలుస్తారు. ఇక్కడ 'శక్తి' అంటే ఏదో ఒక ప్రత్యేకమైన శక్తి అని కాదు.. 'అన్ని శక్తులూ' అని అర్థం. ఇవన్నీ మన సూక్ష్మ శరీరంలోని షట్చక్రాలపై ఉంటాయి. మొత్తం శక్తి కేంద్రం జగదంబగా మన హృదయ చక్రంలో ఉంటుంది. ఇది చాలా ప్రబలమైనది. ఈ శక్తి ఆరాధన ద్వారా... సర్వ దేవతా శక్తులకూ పూజ జరుగుతుంది. ఆ శక్తులు చెడిపోతే మన శరీరంలోని చక్రాలు దెబ్బతింటాయి. మనకు శారీరక, మానసిక, భావోద్వేగ సమస్యలు వస్తాయి. కాబట్టి ఎల్లప్పుడూ ఈ శక్తులను ప్రసన్నంగా ఉంచుకోవాలి. అందుకే దేవీ ప్రసన్నం చేసుకోవాలని అంటూ ఉంటారు. "స్త్రీ శక్తి స్వరూపిణి కాబట్టి ఆమెను గౌరవించడం గృహిణిని గృహలక్ష్మిగా భావించడం చాలా ముఖ్యమైన విషయం. ఎక్కడ మహిళలను ఇబ్బంది పెడితే అక్కడ దేవతలు నివసించరు. మహిళలకు, పురుషలకు మధ్య సమతుల్యత లేనప్పుడు ఇంట్లో ప్రశాంతత కొరవడుతుంది. పిల్లలపై ఆ దుష్ప్రభావం పడుతుంది. చివరకు సమాజం నాశనం అవుతుంది. దీన్ని నివారించే బాధ్యత ప్రధానంగా మహిళలపైనే ఉంది" అని నిర్మలాదేవి స్పష్టం చేశారు. "ప్రస్తుత కాలంలో మహిళల్లో ఆధ్యాత్మిక ఔన్నత్యం తగ్గడం, విలువలు పోగొట్టుకోవడం జరుగుతోంది. పోటీతత్వం, ధనాశ లాంటివి పెరిగాయి. నిరర్థకమైన విషయాల్లో ఆసక్తి పెరగడం వల్ల ఆధ్యాత్మిక ఉన్నతిపై శ్రద్ధ తగ్గుతోంది.



న్యాయబుద్ధి, మంచి నడవడి, జాలి అనేవి స్త్రీలకు సహజమైన గుణాలు. కరుణ ఆమెకు అలంకారం. మహిళలు తమకున్న శక్తిని గుర్తించినట్టయితే ఈ ప్రపంచాన్ని అత్యంత సుందరంగా మార్చగలరు. కొందరు మహిళలు ఈ మార్గంలో చక్కటి ఉన్నతిని సాధించారు. ఒక శక్తిమంతుడైన పురుషుణ్ణి చూసినప్పుడు... అతని వెనుక ఒక స్త్రీ ఉందని మనం వెంటనే గుర్తించవచ్చు. స్త్రీలకు అటువంటి శక్తులు ఉన్నాయి" అనేది నిర్మలాదేవి ఇచ్చిన సందేశం.

### రక్షణ కవచం

"మహిళలను భూమాతతో పోలుస్తారు. భూమాత ఎంతో ఒత్తిడిని భరిస్తూ మొత్తం ప్రపంచానికి ఆధారంగా నిలుస్తుంది. మహిళలకు ఈ పృథ్వీ తత్త్వాన్ని భగవంతుడే ఇచ్చాడు. అయితే మహిళలను దిగజార్చడానికి ప్రతికూల శక్తులు ఎన్నో ఎదురుచూస్తూ ఉంటాయి. అవి మహిళలను ప్రలోభాలకు, ఆకర్షణలకు గురి చేస్తాయి వాటికి లొంగకూడదు. మానవుల ఆధ్యాత్మిక ప్రయాణంలో మహిళల పాత్ర అత్యంత కీలకమైనది. వారిని శక్తి స్వరూపిణులుగా భావించి గౌరవించాలి. దీనివల్ల మనలోని వివిధ చక్రాలు చైతన్యవంతం అవుతాయి" అని నిర్మలాదేవి సోదాహరణంగా వివరించారు. "మహిళ తన సంపూర్ణ శక్తులను వెలికితీసి ఉపయోగించినప్పుడు... ఆమె చాలా శక్తిమంతురాలిగా, భీకరంగా ఉంటుంది. అలా కాకుండా ఎప్పుడూ వాదిస్తూ, కొట్లాడుతూ, విమర్శిస్తూ, చౌకబారుగా ప్రవర్తించినప్పుడు ఆ శక్తులన్నీ వృథా అవుతాయి. ఆమె కావాలనుకుంటే పురుషులకన్నా ఎక్కువగా పని చేయగలదు. అయితే మొదట ఆమె నమ్రతగా, అణకువగా, హుందాతనంతో, చక్కటి అవగాహనతో, వాత్సల్యపూరితంగా ఉండాలి. తనలోని శక్తులను గౌరవించుకోవాలి, శాంతిని నెలకొల్పడం నేర్చుకోవాలి. ఒక కవచంలా రక్షణ కల్పించడం స్త్రీల బాధ్యత. కత్తి, కవచం ఒకటి చేసే పని మరొకటి చేయలేకపోవచ్చు. కానీ రెండిటిలో కవచమే గొప్ప. ఎందుకంటే అది కత్తి దెబ్బను తట్టుకోవాలి. కత్తి విరుగుతుందేమో కానీ కవచం విరగదు" అని ఆమె పేర్కొన్నారు. మహిళలు తమలోని శక్తులను గుర్తించాలి. వాటిలో స్థిరపడాలి. నమ్రత అనేది ఈ శక్తులకు గొప్ప ఇరుసులాంటిది. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో ఎన్నో హింసాత్మకమైన, అనైతికమైన కార్యక్రమాలను చూస్తున్నాం. వీటి ప్రభావం సమాజం మీద... ప్రధానంగా చిన్న పిల్లల మీద పడుతోంది. మహిళలు సహజయోగ మార్గాన్ని సరైన రీతిలో అర్థం చేసుకొని ఆచరించడం ద్వారా సమాజంలో పరివర్తన తీసుకురాగలరు. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా సహజయోగ సాధన చేస్తున్న ఎందరో మహిళలు... శ్రీమాతాజీ నిర్మలాదేవి అనుసరించిన, ప్రబోధించిన ధర్మాలను ఆచరిస్తున్నారు. ఉత్తమ కుటుంబ సభ్యులుగా, సమాజ పౌరులుగా తమతమ దైనందిన జీవితంలో ప్రశాంతమైన, సమతుల్యమైన జీవితం గడుపుతున్నారు.



డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ


బ్రహ్మకుమారీస్



# మహిళలు ఆధ్యాత్మిక నాయకులు కావాలంటే...

ఆధ్యాత్మిక మార్గాన్ని మహిళలు ఎందుకు ఎంచుకోవాలి? తనను తాను పూర్తిగా తెలుసుకోవడానికి, ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవడానికి, స్వీయ నియంత్రణలో ఉండడానికీ అని భావించవచ్చు. తన అస్థిత్వాన్ని గుర్తించడం అనేది ఎవరికైనా ప్రధానం. ఆధిపత్యం, అణచివేతల నుంచి విముక్తి పొందడం, వేరొకరి సంతోషం కోసమో, మెప్పుకోసమో మనం జీవించనవసరం లేని స్థితికి చేరడం, పరిపూర్ణత, స్వతంత్రత సాధించడం... ఇదే ఆధ్యాత్మిక శక్తి, అదే మనలోని అసలైన శక్తి. దాదాపు గత రెండువేల ఏళ్ళకు పైగా మహిళలు తమ ఆధ్యాత్మిక శక్తిని పూర్తిగా ఉపయోగించుకోలేదు. అన్ని మత సంప్రదాయాలు మహిళలను సంకేత రూపంలో తీసుకున్నాయి. ఒకవైపు వారిని పీఠాలపై ఉంచి పూజిస్తారు. మరోవైపు మతపరమైన ఆచారాల నుంచి వారిని మినహాయించారు. కొన్నిచోట్ల ప్రార్థనా స్థలాల్లో ప్రవేశించకుండా నిషేధించారు. మహిళలను ఉన్నతంగా చూసినా, వివక్ష చూపినా.. ఎప్పుడూ వారిని పురుషులతో సమానంగా పరిగణించకపోవడం అనేది ప్రధాన సమస్య. ఆధ్యాత్మిక నాయకులుగా, ఆధ్యాత్మిక అన్వేషకులుగా సమానత్వం లేకపోవడానికి మూలాలు సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలలో ఉన్నాయి.

### అవి బలహీనతలు కావు...

మహిళలు ఆధ్యాత్మిక నాయకులు కావాలంటే... అటువంటి పాత్ర పోషించే సామర్థ్యం, అవసరమైన లక్షణాలు తమకు ఉన్నాయని వారు స్వయంగా అంగీకరించాలి. అనర్థమైన భావాలు, వైఖరుల నుంచి దూరంగా వెళ్ళడానికి, తనలోనే ఉన్న గొప్పతనాన్ని గుర్తించడానికి వారి చైతన్యంలో మార్పు అవసరం. ప్రేమ, సహనం, కరుణ, అవగాహన, వినయం లాంటివి స్త్రీ లక్షణాలు. అవి ఆధ్యాత్మికమైన పురోగతికి కూడా అవసరం. ఎందుకంటే ఇవి లేకుండా భగవంతుడికి దగ్గర కావడం, స్వీయ సాక్షాత్కారం పొందడం అసాధ్యం. ప్రతి మానవుడిలో ఈ లక్షణాలు ఉంటాయి. కానీ మహిళలు వాటిని సులభంగా పొందగలరు. ఎందుకంటే ప్రేమ, భక్తి భావాలు వారిలో సహజంగానే ఉంటాయి, అవి క్రమశిక్షణతో, వ్యవస్థీకృతంగా ఉంటాయి. వారు నాయకత్వానికి ఉదాహరణగా నిలుస్తారు. సేవ చేయడం, నిస్వార్థంగా ఏదైనా ఇవ్వడం ఎలాగనేది వారికి తెలుసు. సేవ చేయడం, ఇతరుల పట్ల వినయంగా ఉండడం, నమస్కరించడం అనేవి బలహీనతలుగా పరిగణించేవారూ ఉన్నారు. కానీ అవి బలహీనతలు కావు. నిజమైన వినయంతో ఇతరులకు నమస్కరించే సామర్థ్యం... అహంకారాన్ని జయించిన ఆత్మ గొప్పతనానికి సంకేతం. అయితే ధైర్యం, సంకల్పం, స్పష్టమైన ఆలోచన, ఆత్మగౌరవం లాంటి లక్షణాలతో ఈ గుణం సమతుల్యం కావాలి.

> మహిళలను ఉన్నతంగా చూసినా, వివక్ష చూపినా... ఎప్పుడూ వారిని పురుషులతో సమానంగా పరిగణించకపోవడం అనేది ప్రధాన సమస్య. ఆధ్యాత్మిక నాయకులుగా, ఆధ్యాత్మిక అన్వేషకులుగా సమానత్వం లేకపోవడానికి మూలాలు సామాజిక, సాంస్కృతిక వ్యవస్థలలో ఉన్నాయి.

### ఆత్మగౌరవంతోనే సాధ్యం

ఇతరులకు సేవ చేయడంలో, వేరే బాధ్యతల్లో మునిగిన మహిళలు తమ సొంత ఆధ్యాత్మిక అవసరాలను నిర్లక్ష్యం చేస్తారు. వారు తమనుతాము తక్కువ చేసుకోవడానికి, వారిలో ఆధ్యాత్మిక శక్తి లేకపోవడానికి కారణాల్లో ఇదొకటి. వారి ఆలోచనా ధోరణిలో, వివేకంలో వచ్చే మార్పు రావాలి. ఆధ్యాత్మిక నాయకత్వాన్ని మహిళలు స్వీకరించడానికి అదే పునాది. ఆత్మగౌరవాన్ని పెంచుకోవడం ద్వారా మాత్రమే... మహిళలు తాము ఆధ్యాత్మిక నాయకులుగా మారకుండా నిరోధించే శారీరకమైన మతపరమైన సామాజికమైన అడ్డంకులను అధిగమించగలరు. ఆత్మగౌరవం అనే లక్షణం సామాజిక, సాంస్కృతిక, శారీరక గుర్తింపునకు అతీతమైన, శాశ్వతమైన స్వీయజ్ఞానం, అనుభవం నుంచి వస్తుంది. 'ఆత్మ' అనేది స్వచ్ఛమైనది, శాంతియుతమైనది, దైవికమైన, ఆధ్యాత్మికమైన లక్షణాలతో సంపూర్ణమైనది. మహిళలు తమలో అంతర్గతంగా ఉండే శాశ్వతమైన ఈ మూలాన్ని తాకినప్పుడు... తమకు సామర్థ్యం ఉన్న పాత్రను పోషించే ధైర్యాన్ని పొందుతారు. ఆధ్యాత్మిక శక్తి అనేది ఆత్మ తాలూకు స్వాభావిక లక్షణాల వ్యక్తీకరణ. దీనికి లింగపరమైన, శారీరకమైన పరిమితులతో సంబంధం లేదు. తాము ఉన్నతులమనో, తక్కువవారిమనో భావించే పరిస్థితులు ఉన్న చోటే ఆధిపత్యమో, అణచివేతో సంభవిస్తాయి. ఆత్మ పట్ల ఎరుక ఉన్నప్పుడు సమానత్వ భావాలు వ్యక్తమవుతాయి. ఈ భావాలు, వైఖరులు సానుకూల ఫలితాలను ఇచ్చే చర్యల ద్వారా వ్యక్తం అవుతాయి. మహిళలు ఆధ్యాత్మిక నాయకత్వ స్థానాలను అందుకోవడానికి చాలా దూరంలో ఉన్నారు. అలాగే మహిళలు మంచి ఆధ్యాత్మిక నాయకులు అవుతారనే భావనతో సమాజం నేటికీ పూర్తిగా ఏకీభవించడంలేదు. ఎవరైనా వ్యక్తి లేదా వ్యక్తుల సమూహం ఈ భావాలను విచ్ఛిన్నం చేసి, ఆదర్శప్రాయమైన నమూనాను రూపొందించే వరకూ సమాజంలో మార్పు కచ్చితంగా రాదు. అలాంటి మార్పుకోసం 'ప్రపంచ ఆధ్యాత్మిక విశ్వవిద్యాలయం' వ్యవస్థాపకుడు బ్రహ్మ బాబా (లేఖ్‌రాజ్ కృపలాని) చేసిన ఆలోచన నుంచి 'బ్రహ్మకుమారీస్' సంస్థ ఆవిర్భవించింది.

• బ్రహ్మకుమారీస్

సద్బోధ

# భక్తి సంకుచితమైతే...

చైనాలో ఒక భక్తురాలు ఉండేది. బుద్ధుడు అంటే ఆమెకు ఎనలేని ప్రేమ, సాటిలేని భక్తి ఉండేది. తన ఆస్తిపాస్తులన్నిటినీ అమ్మేసి, వచ్చిన డబ్బుతో మేలి బంగారపు బుద్ధ విగ్రహాన్ని ఆమె తయారు చేయించింది. అయినవారందరినీ వదిలేసి సహస్ర బుద్ధ మందిరానికి వెళ్ళి, అక్కడే సన్యాసినిగా జీవించసాగింది.

అదొక పెద్ద ఆలయం. ఒక భారీ పర్వతాన్ని ఆలయంగా మలిచారు. అందులో వెయ్యి బుద్ధుడి విగ్రహాలు ఉండేవి కాబట్టి దాన్ని 'సహస్ర బుద్ధ ఆలయం' అని పిలిచేవారు. తనతోపాటు తెచ్చుకున్న స్వర్ణ బుద్ధుణ్ణి ఆమె అక్కడే కొలువుతీర్చింది. రోజూ భక్తి శ్రద్ధలతో పూజించేది. పూజలో సువాసన వెదజల్లే చాలా ఖరీదైన అగరుబత్తిలను ఈ విగ్రహం ముందు వెలిగించేది. ఆ సువాసనను తన ఇష్టదైవం... అంటే ఆ బంగారు ప్రతిమ మాత్రమే ఆస్వాదించాలనేది ఆమె కోరిక. కానీ అగరు బత్తిల పొగ తన బుద్ధుడివైపు కాకుండా... ఆలయంలో ఉన్న ఇతర బుద్ధ విగ్రహాల వైపు వెళ్తూ ఉండేది. ఇది ఆమెకు నచ్చేది కాదు. కేవలం తన బుద్ధుడికి మాత్రమే ఆ సువాసన చేరాలంటే ఏం చేయాలా? అని రాత్రింబవళ్ళు తీవ్రంగా ఆలోచించింది. చివరకు ఆమెకు ఒక ఉపాయం తట్టింది. వెంటనే దాన్ని అమలుచేసింది.



ఒక గొట్టాన్ని తయారు చేసి, దాన్ని తన బంగారు బుద్ధ విగ్రహం ముందు పెట్టింది. వెలిగించిన అగరు బత్తిలను ఆ గొట్టంలో అమర్చింది. సువాసనను మోసుకొచ్చే పొగ నేరుగా ఆ బుద్ధుడి ముక్కులోకి వెళ్ళే ఏర్పాటు చేసింది. ఆ పొగ తన బుద్ధుడివైపే వెళుతూ ఉంటే చూస్తూ ఆమె ఎంతో ఆనందిస్తూ ఉండేది. కానీ కొద్దిరోజులకే ఆ ఆనందం దుఃఖంగా మారింది. కారణం ఏమిటంటే.. ఆమె రోజూ అలా చేయడం వల్ల.. ఆ బంగారు బుద్ధుడి ముఖం మసిబారిపోయింది, కళావిహీనంగా మారింది. ఎంతో ప్రశాంతంగా, నిర్మలంగా, ప్రకాశవంతంగా ఉండే ఆ ముఖం నల్లగా, దుఃఖభరితంగా కనిపించింది. దాన్ని ఎంత శుభ్రపరిచినా ఇదివరకటి కళ లేదు. దీంతో ఆమె ఎంతో ఆందోళనతో, ఆవేదనతో... ఆ ఆలయ ముఖ్య పూజారి దగ్గరకు వెళ్ళింది. ఆయనను తీసుకువచ్చి, తన బంగారు బుద్ధుణ్ణి చూపించింది. "నా స్వామి, నా బుద్ధుడు ఎలా అయ్యాడో చూడండి. నేను ఏం చేస్తే నా బుద్ధుడు మళ్ళీ ప్రకాశిస్తాడో చెప్పండి" అని ఏడుస్తూ వేడుకుంది.

"అమ్మా! ఇది నీవు ఒక్కదానివి మాత్రమే చేసే తప్పు కాదు. లోకంలో ప్రతి మూఢ భక్తుడు తన ఇష్టమూర్తిని సంకుచిత ధోరణితో ఇలాగే మసిపూసి, మసకబారుస్తున్నాడు" అని ఆమెను ఆయన ఓదార్చాడు.

తన బుద్ధుడే అసలైన బుద్ధుడనీ, ఆయనకు మాత్రమే తన ఆరాధన మొత్తం చేరాలనీ, ఆలయంలో ఇతర బుద్ధ ప్రతిమలకు చేరకూడదనీ ఆమె సంకుచితంగా వ్యవహరించింది. అదే ఆ బంగారు బుద్ధుణ్ణి అందవిహీనుడిగా చేసిందనీ, ఇలాంటి సంకుచిత భక్తి, ప్రేమ దుఃఖాన్నే విగులుస్తాయనే బోధ ఆయన మాటల్లో ఉంది.

• రాచమడుగు శ్రీనివాసులు

చింతన



# సేవే పరమావధి

సమాజానికి మొదటి గురువు... మహిళ. వారికి ఉన్న గొప్ప బలం... మాతృత్వం. సృష్టిని కొనసాగించడం కోసం, భావి తరాలను తీర్చిదిద్దడం కోసం భగవంతుడు అది వారికి ఇచ్చిన వరం, బాధ్యత కూడా. తల్లులు ప్రయత్నించినట్టయితే, తమ పిల్లల్లో మన ఘనమైన సంప్రదాయం గురించి ఆలోచనలు నాటుకొనేలా చేయగలరు. ఆడపిల్లలను, మహిళలను గౌరవించడం ఎంత ముఖ్యమనే పాఠాలు నేర్పగలరు. వారు సరైన పరిస్థితులు సృష్టించినప్పుడు... పిల్లలు ఆదర్శవంతులైన పౌరులుగా ఎదుగుతారు. మన సంస్కృతిపట్ల ఆపేక్షను వారిలో కలిగించగలం. వారి వ్యక్తిత్వాలను సమున్నతంగా రూపుదిద్దగలం. మనిషికి సంబంధించిన చాలా అంశాలను అతనిలోని జన్యువులు నిర్ధారిస్తాయని సైన్స్ చెబుతోంది. కానీ పెరుగుతున్న పిల్లలపై తల్లి, ఇల్లు, పరిసరాలు, పరిస్థితులు చూపే ప్రభావం చాలా పెద్దది.

ఈ రోజు మహిళలు జీవితాల్లో ఎలా పురోభివృద్ధి సాధించాలా అనేది మాత్రమే ఆలోచిస్తున్నారు. అది మంచిదే. మహిళలు అన్ని రంగాల్లో కచ్చితంగా ముందుకు సాగాల్సిందే. కానీ, అప్పుడప్పుడు ఆగి, వెనక్కి తిరిగి చూసుకోవడం కూడా మంచిది. ఎందుకంటే వారి వెనుక వారిని అనుసరించే, అనుకరించే పిల్లలు ఉంటారు. రేపటి సమాజం శక్తి, సౌందర్యం, పరిమళం... వీటన్నిటినీ నిర్ణయించేది నేటి తల్లులే. తల్లి పాలు పిల్లల శరీరానికి పోషకాలు అందించడమే కాదు, వారి మెదడు, తెలివితేటలు, హృదయం అభివృద్ధి చెందడానికి కూడా దోహదం చేస్తాయి. అదేవిధంగా, ఒక ఆదర్శమూర్తిగా తల్లి నేర్పే జీవిత పాఠాలు, విలువలు పిల్లలకు వారు భవిష్యత్తులో ఉపయోగించుకోగలిగే బలాన్నీ, ధైర్యాన్ని అందిస్తాయి. కేవలం తల్లి పాత్ర గురించి ఇంతగా చెప్పడానికి కారణం ఏవిటంటే... మహిళ బలం ఆమె మాతృత్వంలోనే ఉంది. మాతృత్వం అనేది లోకాన్ని రూపాంతరీకరించే ఒక శక్తి. ఇతరుల హృదయాలను అర్థం చేసుకోవడం ద్వారా ఆ శక్తి పని చేస్తుంది. మహిళలో స్వతస్సిద్ధంగా ఉండే ఈ మమకారం చాలా విలువైనది.

> మహిళలు అన్ని రంగాల్లో కచ్చితంగా ముందుకు సాగాల్సిందే. కానీ, అప్పుడప్పుడు ఆగి, వెనక్కి తిరిగి చూసుకోవడం కూడా మంచిది. ఎందుకంటే వారి వెనుక వారిని అనుసరించే, అనుకరించే పిల్లలు ఉంటారు. రేపటి సమాజం శక్తి, సౌందర్యం, పరిమళం... వీటన్నిటినీ నిర్ణయించేది నేటి తల్లులే.

మహిళలు నిస్సహాయులో, వేరేవారిపై ఆధారపడేవారో కాదు. వారికి సింహాల్లా గర్జించే ధైర్యం, శక్తి ఉన్నాయి. వారు వేరొకరు వెలిగించే కొవ్వొత్తులలాంటివారు కాదు. స్వయంప్రకాశకత్వం కలిగిన సూర్యుడులాంటివారు. సరైన అవకాశాలు, స్వేచ్ఛ లభిస్తే వారు అద్భుతాలు చెయ్యగలరు. తెలివితేటల్లో కానీ, సామర్థ్యంలో కానీ మహిళలు పురుషులకు ఏమాత్రం తక్కువ కాదు. ఎలాంటి పనినైనా చక్కగా నిర్వర్తించగలిగే సంకల్పబలం, సృజనాత్మక శక్తి వారికి ఉన్నాయి. ఏ రంగంలోనైనా వారు అత్యుత్తమ శిఖరాలు సాగించగలరు. ఆధ్యాత్మిక రంగానికి కూడా ఇది వర్తిస్తుంది. దీన్ని సాధించడానికి స్వచ్ఛమైన హృదయం, మేథోపరమైన సామర్థ్యం ఉండాలి. ఏ పనినైనా సానుకూల దృక్పథంతో ప్రారంభించాలి. ఆరంభం మంచిగా ఉంటే... అది మంచిగా కొనసాగుతుంది, ముగింపు సైతం మంచిగానే ఉంటుంది. దీనికి సాధన కావాలి. అలా సాధన చేసే క్రమంలో సహనం కలుగుతుంది, తమ పట్ల విశ్వాసం, తోటివారి పట్ల ప్రేమ బలపడతాయి. అయితే ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఏ రంగంలోనైనా నాయకత్వం అంటే ఆధిపత్యం కోసమో, నియంత్రణ కోసమో కాకూడదు. ఇతరులకు ప్రేమతో, ఆప్యాయతతో సేవ చెయ్యడమే మనకు పరమావధి కావాలి.

• మాతా అమృతానందమయి

గీతాసారం


# స్థితప్రజ్ఞుడు ఎవరు?

"స్థితప్రజ్ఞత అంటే ఏమిటి? స్థితప్రజ్ఞుడు ఎలా ఉంటాడు?" అనే అర్జునుడి ప్రశ్నకు, దానికి శ్రీకృష్ణుడు ఇచ్చిన వివరణకు భగవద్గీతలో ఎంతో ప్రాధాన్యత ఉంది. స్థితప్రజ్ఞుడు తన పట్ల తాను సంతృప్తితో ఉంటాడని చెప్పిన కృష్ణుడు... స్థితప్రజ్ఞత కలిగినవారు ఎలా మాట్లాడతారు, కూర్చుంటారు, నడుస్తారు? అనే సందేహంపై స్పందించలేదు.పరిస్థితులను బట్టి అజ్ఞాని, స్థితప్రజ్ఞుడు... ఈ ఇద్దరూ ఒకే మాటలు మాట్లాడవచ్చు, ఒకే రీతిలో కూర్చోవచ్చు, నడవవచ్చు. 'స్వయంతో (తనతో) సంతృప్తి' అనేది పూర్తిగా అంతర్గతంగా జరిగే విషయం. బాహ్య ప్రవర్తన కారణంగా దాన్ని కొలవడానికి అవకాశం లేదు. ఇది స్థితప్రజ్ఞత గురించి మనకున్న అవగాహనను మరింత క్లిష్టతరం చేస్తుంది. మరి ఇది ఎలా తెలుసుకోవాలి?

శ్రీకృష్ణుని జీవితం స్థితప్రజ్ఞత కలిగిన జీవితానికి ఉత్తమమైన ఉదాహరణ. ఆయన పుట్టినప్పుడే తల్లితండ్రుల నుంచి విడిపోయాడు. ఆయనను 'వెన్న దొంగ' అని పిలిచేవారు. ఆయన శృంగారం, నృత్యం, వేణుగానం... ఇవన్నీ ఆయన కథలో ఉన్నాయి. కానీ బృందావనాన్ని విడిచిపెట్టాక శృంగారాన్ని కోరుతూ తిరిగి రాలేదు. అవసరమైనప్పుడు పోరాడాడు. శత్రువులను చంపాడు. కానీ కొన్ని సమయాల్లో యుద్ధానికి దూరంగా ఉన్నాడు. అందుకే ఆయనను 'యుద్ధం నుంచి పారిపోయే వ్యక్తి' అని కూడా అన్నారు. ఆయన ఎన్నో అద్భుతాలు చేశాడు. స్నేహితులకు స్నేహితుడు. తనకు దొంగతనం అంటగట్టినప్పుడు, ఆ తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టడానికి... శమంతకమణి జాడను కనిపెట్టాడు. గీతాజ్ఞానాన్ని ఏ సమయంలో ఇవ్వాలో ఆ సమయంలో అర్జునుడిద్వారా అందించాడు.



గుర్తించాల్సిన విషయం ఏమిటంటే.. బయటికి కనిపించే ఆయన జీవితం ఒక క్రమపద్ధతిలో ఉన్నట్టు అనిపించదు. కానీ అంతరంగికంగా ఆయన ఎప్పుడూ వర్తమానంలోనే జీవించాడు. అనేక ప్రతికూల పరిస్థితులు, సమస్యలు ఎదురైనప్పటికీ... ఆయన జీవితం నిరంతరం ఉత్సాహంగా, ఆనందమయంగా సాగింది. 'స్వయంతో సంతృప్తి' అంటే క్రియాశూన్యత కాదు. కర్తృత్వ భావన అంటే 'చేసేవాడిని నేనే' అనే భావన లేకుండా, కర్మ ఫలాలను ఆశించకుండా కర్మలు నిర్వహించడం. అంటే... గతం తాలూకు భారాన్ని మోయకుండా, భవిష్యత్తు గురించి ఆశ పెంచుకోకుండా వర్తమానంలో జీవించడం. శ్రీకృష్ణుడు తన జీవితం ద్వారా స్థితప్రజ్ఞుడి ప్రవర్తన ఎలా ఉంటుందో చూపించాడు.



కె. శివప్రసాద్



# వారు శాశ్వతులు

సుకృతాత్ములు రససిద్ధులు
సుకవీంద్రులు విజయ నిధులు సుమ్ము తదీయా
ధిక కీర్తి శరీరంబులు
ప్రకట జరామరణ జన్మ భయ రహితంబుల్

ఈ పద్యం... భర్తృహరి రచించిన 'నీతిశతకం'లో సుప్రసిద్ధమైన 'జయంతితే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః... నాస్తి తేషాం యశః కాయే జరామరణజం భయం' అనే శ్లోకానికి ఏనుగు లక్ష్మణకవి చేసిన తెలుగు అనువాదం.

**భావం:** గొప్ప కావ్యాలు రచించిన కవీంద్రులు ధన్యులు, తమ గ్రంథాల ద్వారా వారు సాధించిన రససిద్ధి ద్వారా శాశ్వతులు. వారి కీర్తి శరీరాలకు చావు పుట్టుకలనేవి ఉండవు. వారు సర్వకాలాల్లో ప్రకాశిస్తూనే ఉంటారు.

సుభాషితం





DINESH VIJAN
PRESENTS
MADDOCK FILMS
నేడే
విడుదల
తెలుగులో
ఛావా
DIRECTED BY LAXMAN UTEKAR
PRODUCED BY DINESH VIJAN
MUSIC BY A.R. RAHMAN
A MADDOCK FILMS PRODUCTION


నేడే
విడుదల
సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు
ADITYA MUSIC


SHE films
నేడే
విడుదల
NAARI
THE WOMEN
PRODUCED BY SMT. SASHI VANTIPALLI
WRITTEN & DIRECTED BY SURYA VANTIPALLI
మహిళా
దినోత్సవ
కానుకగా


శ్రీ ఇందిరా కంబైన్స్
ఆపిల్ క్రియేషన్స్
నేడే
విడుదల
జిగేల్
Release By
Sri Vijaya Films
నిర్మాతలు : డా॥ వై.జగన్మోహన్, నాగార్జున అల్లం
దర్శకత్వం : మల్లి యేలూరి


NVR CINEMA
ఉగాదికి
వస్తున్నాడు
CHIYAAN VIKRAM
వీర ధీర శూర
PART-2
AN S.U. ARUN KUMAR PICTURE
A GV PRAKASH KUMAR MUSICAL
HR PICTURES
VEERA DHEERA SOORA
ISSUED BY : NVR CINEMA - 79895 67742, 99669 63111


THEY REMAIN UNSEEN BUT THEIR LOVE LEAVES A MARK
SHREE PADMINI CINEMAS
ADITYA MUSIC
నేడే
విడుదల
రా రాజా


ZEE STUDIOS & PARALLEL UNIVERSE PICTURES
G V PRAKASH KUMAR
కింగ్స్టన్
AND THE CURSED SEA
నేడే
విడుదల

### కార్మికుల ఆచూకీ కోసం
# క్యాండీవర్ శునకాలు!

- 13 రోజులు గడిచినా.. 8 మంది జాడ తెలియలే
- సొరంగంలో కన్వేయర్ బెల్టు ట్రయల్ రన్

నాగర్‌కర్నూల్/దోమలపెంట/అమ్రాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ సొరంగంలో కార్మికుల ఆచూకీని కనుగొనేందుకు సర్కారు సహాయక చర్యలను ముమ్మరం చేసింది. ఇందు కోసం కేరళ నుంచి ప్రత్యేక శునకాలను రప్పించింది. మరోవైపు కన్వేయర్ బెల్టు ట్రయల్ రన్ కూడా కొనసాగుతోంది. 13 రోజులు గడిచినా గల్లంతైన 8 మంది కార్మికుల ఆచూకీ లభించలేదు. సహాయక చర్యల్లో భాగంగా ఆర్మీ, నేవీ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్‌ల సిబ్బంది జీపీఆర్ ద్వారా సెన్సార్లను భూమి లోపలికి పంపించి కార్మికుల ఆనవాళ్ల కోసం ప్రయత్నించిన సంగతి తెలిసిందే. అయితే బురద నీటితో కూడిన ప్రాంతంలో జీపీఆర్ వ్యవస్థ వారి ఆచూకీని పసిగట్టలేకపోయింది. ఐదు ప్రదేశాల్లో మెత్తని భాగాలు ఉన్నట్లు జీపీఆర్ గుర్తించిన ప్రదేశాల్లో మట్టిని తొలగించడంతో పాటు టన్నెల్ బోరింగ్ మిషన్ విడి భాగాలను తరలించే పని చేపట్టారు. ఈ క్రమంలో అధికారులు గురువారం కేరళ నుంచి క్యాండీవర్ శునకాలను రప్పించారు. ఎయిర్‌ఫోర్స్ హెలికాప్టర్లలో తీసుకొచ్చిన రెండు శునకాలను టన్నెల్ లోపలికి తీసుకెళ్లారు. భూమికి ఐదడుగుల లోపల మానవ, జంతు సంబంధ అవశేషాలు ఉంటే ఈ శునకాలు పసిగడతాయి. మరోవైపు కన్వేయర్ బెల్టు పునరుద్ధరణకు ఇంజనీరింగ్ నిపుణులు నిర్విరామంగా శ్రమిస్తున్నారు. కన్వేయర్ బెల్టు పని చేస్తే మట్టిని వేగంగా బయటకు తరలించే అవకాశం ఉంటుంది. సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సెక్రటరీ కర్నల్ కీర్తి ప్రతాప్ ఎసింగ్ సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు.

# భవిష్యనిధి సేవలు మరింత విస్తృతం

- యూపీఐ, ఏటీఎం ద్వారా పీఎఫ్ ఉపసంహరణ
- కేంద్రమంత్రి మాండవీయా
- బేగంపేటలో కిషన్‌రెడ్డితో కలిసి ఈపీఎఫ్‌వో జోనల్ ఆఫీసు ప్రారంభం


బేగంపేటలో ఈపీఎఫ్‌వో నూతన జోనల్ ఆఫీసును ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి మాండవీయా. చిత్రంలో కిషన్‌రెడ్డి, రఘునందన్

బేగంపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) కార్యాలయాలకే రాకుండా డిజిటల్ సేవలను మరింత విస్తృతం చేయనున్నామని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయా తెలిపారు. పీఎఫ్ సొమ్మును యూపీఐ, ఏటీఎం ద్వారా కూడా విత్‌డ్రా చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని బేగంపేటలో ఈపీఎఫ్‌వో నూతన జోనల్ కార్యాలయాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాండవీయా మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి వెన్నెముక కార్మిక శక్తేనన్నారు. కార్మికులకు సేవలందించే ఈపీఎఫ్‌వో దేవాలయమని.. దీని ద్వారా అధికారులు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో మరింత ముందుకెళ్లాలని సూచించారు. దేశంలో అత్యధిక ఎక్కువ నిధులున్న సంస్థ ఈపీఎఫ్‌వోనే అని స్పష్టం చేశారు. కార్మికులు, ఉద్యోగుల డబ్బుతో సమానంగా కేంద్రం కూడా నిధులను జమ చేస్తుందని చెప్పారు. కార్మికుల సేవల కోసం 201 టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా ప్రారంభించామని చెప్పారు. గతంలో చిన్నచిన్న ఆటంకాలు అనేకం ఉండేవన్నారు. ప్రస్తుతం వాటన్నింటినీ దశల వారీగా తొలగించామని తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం కేంద్రం అనేక నూతన విధానాలను ముందుకు తెస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో మరిన్ని ఈఎస్ఐ ఆస్పత్రులు, ఈపీఎఫ్‌వో కార్యాలయాలు నిర్మించాల్సిన అవసరముందని చెప్పారు. ఇందుకోసం ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని.. రామగుండం వంటి చోట్ల స్థలాలు కేటాయిస్తే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ ఎంపీ రఘునందన్‌రావుతో పాటు ఉద్యోగ భవిష్య నిధి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఫాంహౌస్‌లో కీలక భేటీ

**భవిష్యత్తు కార్యాచరణపై కేసీఆర్ కసరత్తు**

**పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో సమీక్ష**



హైదరాబాద్, సంగారెడ్డి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుక్రవారం కీలక సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఇందులో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజ్యసభ ఎంపీలు, ముఖ్య నేతలు పాల్గొంటున్నట్లు సమాచారం. ఇందులో పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై చర్చించి, కీలక నిర్ణయాలు తీసుకునే దిశగా కేసీఆర్ ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రతికూల ఫలితాలు వచ్చినందున.. ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశంపై సమీక్షించనున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంతమందిని బరిలోకి దింపాలనే అంశాన్ని చర్చించడంతోపాటు పార్టీ నుంచి ఎవరిని ప్రతిపాదించనున్నారో ప్రకటించే అవకాశం ఉంది. పార్టీమారిన ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో వ్యూహంపైనా కేసీఆర్ స్పందించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ తరఫున భారీ బహిరంగ సభను ఎక్కడ.. ఎప్పుడు నిర్వహించాలన్న విషయంపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఫాంహౌస్‌ను వీడి తిరిగి రాజకీయ కార్యక్రమాల్లో కేసీఆర్ క్రియాశీలం కానున్న నేపథ్యంలో ఆ పార్టీ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర.. కేసీఆర్ కమింగ్ సూన్ అంటూ గురువారం ఓ వీడియో విడుదల చేశారు.

### వరంగల్ జిల్లా రాజ పత్రము

**నెం.04/ వరంగల్/2025, తేది:05.03.2025**

**శ్రీయుత జిల్లా కలెక్టర్, వరంగల్ వారి ఉత్తర్వులు**

**నెం. జి./ 2200/2021, తేది:05.03.2025**

**తెలంగాణ ప్రభుత్వం**

జిల్లా కలెక్టర్ గారి కార్యాలయం, వరంగల్ జిల్లా

ఫారం-VII

**రూడీ ప్రకటన**

(సబ్ రూల్-1 రూల్-25, సెక్షన్ -19(1) చట్టం -30/2013 ప్రకారం)

**నెం. బి/1590/2024** **తేది: -03-2025**

జిల్లా కలెక్టర్, వరంగల్ వారి ఆదేశానుసారం ఈ దిగువ నిర్దిష్టపరచిన వరంగల్ జిల్లా లోని ఖిలా వరంగల్ మండలములోని నక్కలపల్లి గ్రామములో ఉన్న భూమి విస్తీర్ణం ఎ.47-02గుంటలు ప్రజా ప్రయోజనం నిమిత్తం అనగా మామునూర్ విమానాశ్రయం విస్తరణ నిమిత్తం ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము/ జిల్లా కలెక్టర్, వరంగల్ గారు భావించినారు. కావున ఇట్టి రూడి ప్రకటన జారిచేయనైనది.

ప్రభుత్వ ఉత్తర్వు నెం.46 రవాణా, రోడ్లు మరియు భవనములు (విమానాశ్రయములు) శాఖ, తేదీ: 28.11.2024ప్రకారం, భూసేకరణలో సముచిత పరిహారము మరియు పారదర్శకత, పునరావాస, పునరాశ్రయ హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016లోని చాప్టర్ III A లోని సెక్షన్ 10(A) క్రింద గుర్తించబడినది. కావున, భూసేకరణలో సముచిత పరిహారము మరియు పారదర్శకత, పునరావాస, పునరాశ్రయ హక్కు చట్టం (నం. 30/2013) లోని చాప్టర్ 2 లోని సామాజిక ప్రభావము అధ్యయన నివేదిక మరియు చాప్టర్ 3లోని ఆహార భద్రత పరిరక్షణ వంటి అంశములు వర్తించవు.కావున, వరంగల్ జిల్లాలోని ఖిలా వరంగల్ మండలములోని నక్కలపల్లి గ్రామములో ఉన్న ప్రతిపాదిత భూమి మొత్తం విస్తీర్ణం ఎ. 47-02 గుంటలు ఎక్కువ లేదా తక్కువ స్టాండర్డ్ కొలత గల భూమి అవసరమయి ఉన్నదని భావించి, ఇట్టి రూడీ ప్రకటన చేయబడుతుంది.

**షెడ్యూలు**

గ్రామము: నక్కలపల్లి మండలము : ఖిలా వరంగల్ జిల్లా: వరంగల్

| క్ర.సం | సర్వే నెం/ బై నెం. | పట్టా | భూమి రకం | సర్వే నెం. మొత్తం విస్తీర్ణం | పట్టాదార్ పేరు భరోసా రికార్డు ప్రకారం | వాస్తవ స్వాధీనదారు పేరు ఎంజాయ్‌మెంట్ ప్రకారం | విస్తీర్ణం | ఇతర వివరాలు |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 63 | పట్టా | ఖుష్కి | 0.07 | మన్నె కనకయ్య తండ్రి బాలయ్య, ఐన్న కొమ్మాలు, తండ్రి చిన్న ఉప్పలయ్య | దిడ్డల వెంకటలక్ష్మి భర్త ఉప్పలయ్య | 0-01¼ | |
| | | | | | | మన్నె ఐలమ్మ భర్త ఎల్లయ్య | 0-02½ | |
| | | | | | | మన్నె నర్సింగం తండ్రి కొమురయ్య | 0-02¾ | |
| | | | | | | మొత్తం | 0-07 | |
| [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| 24 | 140 | పట్టా | ఖుష్కి | 4.21 | [illegible] తండ్రి కొమురస్వామి, ఉప్పు మహేందర్ తండ్రి కుమారస్వామి | [illegible] తండ్రి [illegible] | [illegible] | |
| | | | | | | మన్నె బాలరాజు తండ్రి లక్ష్మయ్య | 0-12 | |
| | | | | | | మన్నె [illegible] తండ్రి వెంకటయ్య | 0-10 | |
| | | | | | | దిడ్డల వెంకట లక్ష్మి భర్త ఉప్పలయ్య | 0-04 | |
| | | | | | | ఎయిర్ పోర్ట్ | 0-07 | |
| | | | | | | గుర్తించబడని విస్తీర్ణం | 3-03 | |
| | | | | | | మొత్తం | 4-21 | |
| | | | మొత్తం | 47-02 | | | 47-02 | |

ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) భూసేకరణలో సముచిత పరిహారము మరియు పారదర్శకత, పునరావాస, పునరాశ్రయ హక్కు చట్టం, 2013 (నెం.30/2013) లో సెక్షన్-15 అనుసరించి భూసేకరణపై ఆసక్తి గల వ్యక్తులు దాఖలు చేసిన అభ్యంతరములు / ఆక్షేపణలు విచారించిన పిదప ఈ ప్రకటన జారీ చేయడమైనది మరియు చట్టం నం.30/2013లోని U/s 15 అందించిన ప్రకారం ఆసక్తిగల వ్యక్తుల అభ్యంతరాలను విన్న తర్వాత మరియు తగిన విచారణ తర్వాత ఈ ప్రకటన చేయబడింది. భూసేకరణ కారణంగా పునరావాసం పొందే అవకాశం ఉన్న కుటుంబాలు ఏమీ లేవు. ప్రభుత్వ ఆస్తులు ఏమీ ఇందులో లేవు. భూసేకరణ చేపట్టబడిన భూమిలో బొగ్గు, ఇనుము, సున్నపురాయి మరియు ఖనిజములు, ఇట్టి భూములలో లేదా కొంత భాగము లభ్యమైనచో ఆ ఖనిజములు ప్రాజెక్ట్ నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును, లేని యెడల స్వీకరించబడవు.పైన చూపిన భూసేకరణ చేయు భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, వరంగల్ మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, వరంగల్ గారి కార్యాలయములో అందుబాటులో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు భూసేకరణకు సంబంధించిన భూముల ప్లానును కార్యాలయము పని చేయు దినములలో తనిఖీ చేసుకోవచ్చును.

సం/- భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, వరంగల్ | సం/- అదనపు కలెక్టర్ (రె). వరంగల్ | సం/- జిల్లా కలెక్టర్ వరంగల్

DIPR RO. NO.744/LA-PP/ADVT/PUBLICATION/2024-25

# కాంగ్రెస్ కుట్ర ఫలించలేదు

## రేవంత్ దుష్ప్రచారాన్ని జనం పట్టించుకోలే.. మంత్రులకు ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారు

- ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చేది బీజేపీనే
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి.. బీజేపీపై తప్పుడు ఆరోపణలు చేసినా ప్రజలు పట్టించుకోలేదని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల హామీలను అమలు చేయకుండా, తమపై ఎదురుదాడి చేశారని మండిపడ్డారు. పదేళ్లు తామే అధికారంలో ఉంటామని చెప్పిన కాంగ్రెస్ మంత్రులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు కర్రు కాల్చి వాతపెట్టారని విమర్శించారు. 'ఇది రెఫరెండమా..? కాదా..? రాష్ట్ర ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతనా..?' అన్నది కాంగ్రెస్ ఆత్మ విమర్శ చేసుకోవాలని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. గెలిచిన అభ్యర్థులు మల్క కొమురయ్య, అంజిరెడ్డి, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు రాకేశ్‌రెడ్డి, సూర్యనారాయణగుప్తాతో పాటు పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఈ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టమైందని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో తాము మరికొంత కష్టపడి ఉంటే మరిన్ని ఎంపీ సీట్లు వచ్చేవని చెప్పారు. ప్రధాని మోదీ నేతృత్వంలో డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తేనే ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేరతాయని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్.. ప్రజల ఆశలపై నీళ్లు చల్లాయని విమర్శించారు. రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ విజయం సాధించడం అభినందనీయమన్నారు. 37 శాతం మంది బీజేపీకి మద్దతు ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల పనికిరాని మాటలకు జవాబు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. అవకాశవాదంతో ఒకరితో ఒకరు కలిసిన చరిత్ర ఆ పార్టీలదని మండిపడ్డారు. తమకు బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిందని కాంగ్రెస్ ఆరోపిస్తే అది ప్రజలను అవమానించినట్లేనని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాము ఓడిపోయిన ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో పార్టీని బలోపేతం చేయడమే ప్రస్తుత ఎజెండా అని కిషన్‌రెడ్డి ప్రకటించారు.

### బీజేపీ ఎమ్మెల్సీలకు మోదీ అభినందన..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీజేపీకి అద్వితీయ మద్దతు ఇచ్చి ఆశీర్వదించారని ప్రధాని మోదీ అన్నారు. ఎక్స్ వేదికగా రాష్ట్ర ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల మధ్య కష్టపడి పనిచేస్తున్న పార్టీ కార్యకర్తలను చూసి గర్వపడుతున్నానని మోదీ పేర్కొన్నారు. ఎమ్మెల్సీలుగా గెలిచిన మల్క కొమురయ్య అంజిరెడ్డిలను అభినందించారు.

### రేపు బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్ రాక

బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్ శనివారం హైదరాబాద్ రానున్నారు. పార్టీ సంస్థాగత బలోపేతంపై ఆయన సమీక్ష నిర్వహిస్తారు. రాష్ట్ర పార్టీ కొత్త అధ్యక్షుడిపై త్వరలో ప్రకటన వెలువడవచ్చని ప్రచారం జరుగుతోంది. దీంతో, బన్సల్ కొంతమంది సీనియర్ నాయకుల అభిప్రాయం తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

# 'లెన్స్‌కార్ట్'తో తెలంగాణ బ్రాండ్ విశ్వవ్యాప్తం

- 1500 కోట్లతో రావిర్యాలలో లెన్స్‌కార్ట్ ప్లాంట్
- 2 వేల మందికి ఉద్యోగాలు: మంత్రి దుద్దిళ్ల

హైదరాబాద్, మహేశ్వరం, మార్చి6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతిపెద్ద.. కళ్లద్దాల తయారీ పరిశ్రమ కార్యకలాపాలు అతి త్వరలోనే తెలంగాణలో ప్రారంభం కానున్నాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ప్రముఖ కళ్లజోళ్ల బ్రాండ్ లెన్స్‌కార్ట్ ఏర్పాటు చేస్తున్న ఈ పరిశ్రమతో తెలంగాణ బ్రాండ్ విశ్వవ్యాప్తం కానుందని తెలిపారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ సమీపంలోని రావిర్యాలలో 50 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న లెన్స్‌కార్ట్ విజన్ ఫ్యాక్టరీ నిర్మాణానికి మంత్రి శ్రీధర్‌బాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమ ఏర్పాటుపై తెలంగాణ ప్రభుత్వం, లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య గతేడాది డిసెంబర్ 8న ఒప్పందం జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. లెన్స్‌కార్ట్‌కు రాజస్థాన్‌లో ఇప్పటికే ఓ తయారీ యూనిట్ ఉందని, రాష్ట్రంలో ఏర్పాటు చేసే ప్లాంట్ ప్రపంచంలోనే అతి పెద్దదని తెలిపారు. లెన్స్‌కార్ట్ పరిశ్రమ రాష్ట్రానికి తలమానికం కానుందని అన్నారు. రూ.1500 కోట్లతో ఏర్పాటు చేయబోయే ప్లాంట్ ద్వారా సుమారు 2వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పరిశ్రమలో ఉద్యోగ కల్పనలో స్థానికులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని లెన్స్‌కార్ట్ యాజమాన్యానికి సూచన చేశామని తెలిపారు. రెండేళ్లలో ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభం అవుతుందని, నాలుగేళ్లలో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు మొదలవుతాయని చెప్పారు. ఈ పరిశ్రమలో తయారయ్యే ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అవుతాయని మంత్రి తెలిపారు. దీంతో తెలంగాణ బ్రాండ్ విశ్వవ్యాప్తం అవుతుందన్నారు. ఇక, ప్రపంచ స్థాయి పరిశ్రమలకు రంగారెడ్డి జిల్లా నిలయంగా మారుతోందని ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, లెన్స్‌కార్ట్ ప్రతినిధులు చౌదరి, సుమిత్, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేస్తున్న మహేశ్వరం డీసీపీ కార్యాలయ భవన నిర్మాణానికి మంత్రి శ్రీధర్ బాబు గురువారం శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో పోలీసు శాఖను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా అన్నారు.


డాక్టర్ వెంకటికి వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్స్ ప్రతినిధులు

## జీపీఎస్ నిఘా ఎత్తేయాలి: ఆశా వర్కర్లు

హరిహరకళా భవన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): తమపై జీపీఎస్ నిఘా ఎత్తేయాలని, నెలకు రూ. 18 వేలు స్థిర వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్ వద్ద తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ధర్నాకు దిగింది. అనంతరం యూనియన్ అధ్యక్షురాలు టి.యాదమ్మ, ప్రధాన కార్యదర్శి ఎం.అనిత ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ వెంకటికి డిమాండ్ల వినతిపత్రం అందజేశారు. పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆదివారాలు, పండుగలకు సెలవు ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, ప్రసూతి సెలవులు, నాణ్యమైన యూనిఫాం అందజేయాలని, పని భారం తగ్గించాలని పారితోషికం లేని పనులు చేయించవద్దని వారు డీఎం అండ్ హెచ్‌వోకు విన్నవించింది.

## జానయ్య కేసులపై 4 వారాల్లో చార్జిషీట్లు వేయండి: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట డీసీఎంఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మాజీ నేత వట్టె జానయ్యపై నమోదైన అన్ని కేసులకు సంబంధించి నాలుగు వారాల్లో చార్జిషీట్లు దాఖలు చేయాలని గురువారం సుప్రీంకోర్టు ఆదేశించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తనను వేధింపులకు గురిచేసిందని, ఒకేసారి పెద్ద సంఖ్యలో అక్రమంగా కేసులు నమోదు చేసిందని ఆరోపిస్తూ ఆయన 2023 సెప్టెంబర్ 20న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్రమాస్తులు, నేరపూరిత బెదిరింపులు, దొంగతనం, దోపిడీలకు సంబంధించి పదుల సంఖ్యలో కేసులు నమోదు చేసిందని చెబుతూ ఆరు స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరయినా, అక్రమ కేసులను కొట్టివేయాలని జానయ్య తరఫు న్యాయవాదులు కోరారు. ఇప్పటికీ రెండు కేసుల్లో ఛార్జిషీట్లు దాఖలు చేయలేదని తెలిపారు. అయితే కేసుల కొట్టివేయాలన్న వినతిని ప్రభుత్వ న్యాయవాదులు వ్యతిరేకించారు. వాదనలు విన్న ధర్మాసనం నాలుగు వారాల్లో ఆ రెండు కేసుల్లోనూ చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. వాటిని సవాల్ చేసుకునే వెసులుబాటు పిటిషనర్‌కు ఉంటుందని స్పష్టం చేసింది.

## బండి వ్యాఖ్యలు ఆయన రాజకీయ అవగాహన లేమికి నిదర్శనం

- దమ్ముంటే కేంద్రం నుంచి నిధులు తేవాలి: మంత్రి పొన్నం
- మేమూ త్వరలో బీజేపీకి గిఫ్ట్ ఇస్తాం: దుద్దిళ్ల

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రంజాన్ గిఫ్టు ఇచ్చామంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. ఈ వ్యాఖ్యలు బండిసంజయ్ రాజకీయ అవగాహనా లేమికి నిదర్శనమని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించగా, తామూ బీజేపీకి త్వరలో రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఏకమై కాంగ్రెస్‌ను ఓడించాయని జీవన్ రెడ్డి ఆరోపించారు. గురువారం గాంధీభవన్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మైత్రిని మరింత బహిర్గతం చేశాయని మంత్రి పొన్నం పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గాలు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలోనే ఉన్నాయని, అయినా బీఆర్ఎస్ పార్టీ తరఫున అభ్యర్థిని నిలబెట్టకుండా వారు బీజేపీతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. బండి సంజయ్‌కు దమ్ముంటే కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు తీసుకొచ్చి చూపాలని, రామగుండం నుంచి హైదరాబాద్ వరకు 8 వరుసల రహదారి నిర్మాణం చేపట్టి చూపాలని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తక్కువ ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యామని, ఇది భవిష్యత్తు ఎన్నికలపై ఎలాంటి ప్రభావమూ చూపదని స్పష్టం చేశారు. ఓటమిపై సమీక్షించుకుంటామని పొన్నం చెప్పారు. బీజేపీకి ఇప్పటికే తాము ఎన్నో గిఫ్టులు ఇచ్చామని, త్వరలో ఆ పార్టీకి మరో గిఫ్టు కూడా ఇస్తామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థిని ఓడగొట్టేందుకు బీఆర్ఎస్, బీజేపీ చీకటి ఒప్పందం చేసుకున్నాయని ఆయన ఆరోపించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల తీర్పును గౌరవిస్తున్నామని శ్రీధర్‌బాబు చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఏకమై కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించాయని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆరోపించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని నిలబెట్టనప్పుడే వారు ఏం చేయబోతున్నారో స్పష్టమైందని ఆయన అన్నారు.

## నేటి నుంచి ఐపీఎల్ టిక్కెట్ల విక్రయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) జట్టు టిక్కెట్ల విక్రయాలను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించడంతో తెలుగు రాష్ట్రాల్లో ఐపీఎల్ సందడి మొదలైంది. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 'జొమాటో డిస్ట్రిక్ట్ యాప్‌లో టిక్కెట్లను అమ్మకానికి ఉంచినట్టు ఎస్‌ఆర్‌హెచ్ యాజమాన్యం తెలిపింది. ఉప్పల్ స్టేడియంలో ఈనెల 23న సన్‌రైజర్స్-రాజస్థాన్, 27న సన్‌రైజర్స్-లఖ్‌నవూ జట్ల మధ్య జరిగే రెండు మ్యాచ్‌ల టిక్కెట్లను ఆన్‌లైన్‌లో మాత్రమే విక్రయించనున్నారు. ఆన్‌లైన్‌లో కొన్న టిక్కెట్లను ఏ కేంద్రాల్లో పొందాలో ఎస్‌ఆర్‌హెచ్ ఇంకా ప్రకటించకపోవడంపై ఫ్యాన్స్ సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## వన్డేలకు ముష్ఫికర్ గుడ్‌బై



ఢాకా: బంగ్లాదేశ్ వికెట్ కీపర్-బ్యాటర్ ముష్ఫికర్ రహీమ్ వన్డేలకు గుడ్‌బై చెప్పాడు. తన నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని అతడు సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. 37 ఏళ్ల ముష్ఫికర్ చాంపియన్స్ ట్రోఫీలో కూడా ఆడాడు. 2006లో జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో అతడు వన్డేల్లో అరంగేట్రం చేశాడు. మొత్తం 274 వన్డేలు ఆడిన ముష్ఫికర్ 36.42 సగటుతో 7795 పరుగులు సాధించాడు. టీ20లకు ఎప్పుడో రిటైర్మెంట్ ప్రకటించిన ముష్ఫికర్.. టెస్టుల్లో కొనసాగనున్నాడు.

## సన్‌రైజర్స్ జట్టులో ముల్డర్



హైదరాబాద్: ఐపీఎల్ ఆరంభానికి ముందే సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు గట్టి దెబ్బ తగిలింది. ఆ టీమ్ వేలంలో రూ. కోటికి కొనుగోలు చేసిన ఇంగ్లండ్ పేసర్ బ్రెండన్ కార్స్ కాలికి గాయం కావడంతో మెగా లీగ్‌కు దూరమయ్యాడు. దీంతో అతడి స్థానాన్ని దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ వియాన్ ముల్డర్‌తో భర్తీ చేశారు. వేలంలో అన్‌సోల్డ్‌గా మిలిగిన ముల్డర్‌ను రూ. 75 లక్షలకు తీసుకున్నట్టు సన్‌రైజర్స్ తెలిపింది.

## టాప్‌లో అరవింద్

ప్రేగ్: ప్రేగ్ అంతర్జాతీయ చెస్ ఫెస్టివల్‌లో భారత గ్రాండ్ మాస్టర్లు అరవింద్ చిదంబరం, ప్రజ్ఞానంద టాప్-2లో కొనసాగుతున్నారు. గురువారం జరిగిన ఎనిమిదో రౌండ్ గేమ్‌లో డేవిడ్ నవారో (చెక్)తో అరవింద్, లియమ్ లి (వియత్నాం)తో గేమ్‌ను ప్రజ్ఞానంద డ్రాగా ముగించారు. దీంతో మొత్తం 8 రౌండ్ల నుంచి అరవింద్ 5.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా.. ప్రజ్ఞానంద 5 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఏడో రౌండ్‌లో అనీష్ గిరి (నెదర్లాండ్స్)పై చిదంబరం నెగ్గగా.. వి యి (చైనా)తో ప్రజ్ఞానంద పాయింట్ పంచుకొన్నాడు.



ఫైనల్ మ్యాచ్‌కు

ఫీల్డ్ అంపైర్లు: పాల్ రీఫిల్ (ఆస్ట్రేలియా), రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్ (ఇంగ్లండ్); మ్యాచ్ రెఫరీ: రంజన్ మదుగలే (శ్రీలంక); థర్డ్ అంపైర్: జోయల్ విల్సన్ (వెస్టిండీస్)

# కివీస్‌తో సులువేం కాదు!



### బ్యాటింగ్, ఫీల్డింగ్‌లోనూ సమవుజ్జీలే..

ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లోనూ భారత జట్టు న్యూజిలాండ్‌ను ఎదుర్కొనబోతోంది. గత ఆదివారం గ్రూప్ 'ఏ'లో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ ఇదే జట్టుపై గెలిచిన విషయం తెలిసిందే. కానీ లాహోర్‌లో జరిగిన రెండో 'సెమీ'ఎల్‌లో దక్షిణాఫ్రికాపై విరుచుకుపడిన కివీస్ మరోసారి టీమిండియాకు సవాల్ విసురుతోంది. అయితే ఇదివరకే సునాయాసంగా గెలిచాం కదా అని కివీ'ఎస్‌ను తేలిగ్గా తీసుకుంటే మాత్రం అసలుకే మోసం రావచ్చు. అదీగాకుండా ఆ జట్టు కూడా దుబాయ్‌లోనే ఆడింది కాబట్టి ఇక్కడి పరిస్థితులపై అవగాహన ఉంటుంది. వాస్తవానికి పెద్ద టోర్నీలు జరిగేటప్పుడు న్యూజిలాండ్‌ను చాలామంది ఫేవరెట్‌గా భావించరు. కానీ వారు తమ ప్రణాళికలను సరైన పద్ధతిలో అమలు చేస్తూ ఊహించని విధంగా దాడి చేస్తుంటారు. అందుకే ఫైనల్లో కివీస్‌ను ఓడించడం భారత్‌కు అంత సులువేమీ కాబోదు. మనోళ్లతో పోలిస్తే వారు కూడా అన్ని విభాగాల్లో సమంగానే ఉన్నారు. స్పిన్నర్ల విషయంలో.. తాజా టోర్నీలో భారత్‌కు సమీపంలో ఉన్న జట్టేదైనా ఉంటే అది కివీస్ మాత్రమే. లెఫ్టామ్ స్పిన్నర్ శాంట్నర్ నేతృత్వంలో బ్రేస్‌వెల్, ఫిలిప్స్, రచిన్‌ల రూపంలో బలంగానే కనిపిస్తోంది. గ్రూప్ మ్యాచ్‌లో వీరిపై భారత్ ఆధిపత్యం చూపి మ్యాచ్‌ను గెలవగలిగింది. కానీ ఈసారి దుబాయ్ పరిస్థితులు తెలుసు కాబట్టి పక్కా వ్యూహంతో భారత్‌ను కట్టడి చేయాలనుకుంటోంది. అలాగే కొత్త బంతితో చక్కటి సీమ్‌ను రాబట్టగల పేసర్లు అండగా ఉన్నారు. ఇందుకు వారి ఎత్తు కూడా దోహదపడుతుంది. ఈ కారణంగా బంతి ఎక్కువ సేపు గాల్లో ఉండడంతో పాటు గుడ్ లెంగ్త్‌లో విసరగలుగుతారు. ఐసీసీ టోర్నీల్లో కివీస్ పేసర్లు తమ ఎక్స్‌ట్రా బౌన్స్‌తో భారత టాపార్డర్‌ను ఇబ్బందిపెట్టడం అలవాటే. అందుకే తొలి పవర్‌ప్లేలో వీరిని ఎదుర్కోవాలంటే భారత జట్టు ఆ మేరకు ప్రణాళికలతో బరిలోకి దిగాల్సి ఉంటుంది.

### 'భారత్‌కు స్పష్టత ఉంటుంది'

దుబాయ్‌లోనే మ్యాచ్‌లను ఆడుతున్న భారత్‌కు పిచ్‌లపై అవగాహన ఉండడం సహజమేనని కివీస్ వెటరన్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ అన్నాడు. క్రికెట్‌లో ఇదంతా మామూలేనని, గతంలోనూ తామిక్కడ చాలా మ్యాచ్‌లను ఆడినట్టు గుర్తు చేశాడు. అయినా భారత్‌కు ఉండే అనుకూలతపై కాకుండా ఫైనల్‌ను గెలవడంపైనే దృష్టి సారించినట్టు కేన్ చెప్పాడు.

భారత్ మాదిరే కివీస్ బ్యాటింగ్ ఆర్డర్ కూడా దుబాయ్ పిచ్‌లకు సరిపోయే విధంగా ఉంది. తమ గ్రూప్ మ్యాచ్‌లో భారత్ స్కోరును ఛేదించకపోయినా, వారిని తక్కువ చేయడానికి లేదు. యంగ్, రచిన్, విలియమ్సన్ ఆది నుంచే భారీ షాట్లకు వెళ్లకపోవచ్చు. కానీ మిడిలార్డర్‌కు చక్కటి వేదికను ఏర్పరిచేలా సుదీర్ఘ ఇన్నింగ్స్ ఆడే నైపుణ్యం ఉంది. మధ్య ఓవర్లలో భారత స్పిన్నర్లను ఎదుర్కొనేందుకు ఇతర జట్లు ఇబ్బందిపడ్డాయి. అయితే లాథమ్, మిచెల్, ఫిలిప్స్ అలాంటి బంతులను సమర్థవంతంగా ఎదుర్కొగలరు. దీనికితోడు ఐదు వికెట్లతో దెబ్బతీసిన మిస్టరీ స్పిన్నర్ వరుణ్‌పై ఈసారి ప్రత్యేక దృష్టి సారించడం ఖాయమే. అన్నింటికన్నా ముఖ్యంగా కివీస్ ఫీల్డింగ్ ప్రమాణాల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే. గ్లెన్ ఫిలిప్స్‌ను ఆధునిక జాంటీ రోడ్స్‌గా పిలుస్తున్నారు. మైదానంలో అతడి విన్యాసాలకు ఎవరైనా ఫిదా కావాల్సిందే. అతడితో పాటు యంగ్, బ్రేస్‌వెల్, శాంట్నర్‌లను కూడా సూపర్ ఫీల్డర్లుగా పరిగణిస్తారు. బంతి వారి దరిదాపుల్లోకి వెళ్తే కనీసం సింగిల్ తీసేందుకు కూడా బ్యాటర్లు ఆలోచించాల్సి ఉంటుంది. కనీసం 30-40 పరుగులు ఫీల్డింగ్ ద్వారా కట్టడి చేయగలరు. అందుకే భారత జట్టు చాంపియన్స్ ట్రోఫీని దక్కించుకోవాలంటే ఫైనల్లో కివీస్‌ను ఆషామాషీగా తీసుకుంటే కుదరదు. అంతేకాకుండా 2000లో జరిగిన చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో కివీస్ చేతిలోనే ఓడామన్న విషయం గుర్తుకు తెచ్చుకుంటే మరీ మంచిది..

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ఢిల్లీ x గుజరాత్
రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

# తిప్పేసిన కెర్

- 6 వికెట్లతో ముంబై విజయం
- యూపీ ప్లేఆఫ్స్ ఆశలు ఆవిరి!
- వోల్ ఫిఫ్టీ వృథా




లఖ్‌నవూ: హేలీ మాథ్యూస్ (46 బంతుల్లో 68) అర్ధ శతకంతోపాటు అమేలియా కెర్ (5/38) తిప్పేయడంతో.. మహిళల ప్రీమియర్ లీగ్ ముంబై ఇండియన్స్ రెండో స్థానానికి ఎగబాకింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 6 వికెట్లతో యూపీ వారియర్స్‌ను చిత్తు చేసింది. వరుసగా మూడో ఓటమితో ప్లేఆఫ్స్ అవకాశాలను యూపీ మరింత సంక్లిష్టం చేసుకొంది. తొలుత యూపీ నిర్ణీత 20 ఓవర్లలో 150/9 స్కోరు చేసింది. కెర్ ఐదు వికెట్లకు తోడు.. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ మాథ్యూస్ 2 వికెట్లు పడగొట్టింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన వారియర్స్‌కు ఓపెనర్లు జార్జియా వోల్ (33 బంతుల్లో 55), గ్రేస్ హ్యారిస్ (28) తొలి వికెట్‌కు 74 పరుగుల భాగస్వామ్యంతో అదిరే ఆరంభాన్నిచ్చారు. అయితే, 14 బంతుల తేడాతో మూడు కీలక వికెట్లను చేజార్చుకోవడంతో.. యూపీ ఓమాదిరి స్కోరుకే పరిమితమైంది. హ్యారిస్ ను అవుట్ చేసిన మాథ్యూస్.. జట్టుకు బ్రేక్ అందించింది. కిరణ్ నవ గిరె (0)ను కెర్ డకౌట్ చేయగా.. హాఫ్ సెంచరీతో జోరుమీదున్న వోల్‌ను బ్రంట్ బౌల్డ్ చేసింది. బ్రింద (10), హెన్రీ (6), దీప్తి (27), సోఫీ ఎకెల్‌స్టోన్ (16)ను కెర్ పెవిలియన్ చేర్చింది. అనంతరం ఛేదనలో ముంబై 18.3 ఓవర్లలో 4 వికెట్లకు 153 పరుగులు చేసి నెగ్గింది. హ్యారిస్ 2 వికెట్లు పడగొట్టింది. ఓపెనర్ కెర్ (10)ను హెన్రీ స్వల్ప స్కోరుకే అవుట్ చేసింది. కానీ, హేలీ, వన్‌డౌన్‌లో వచ్చిన సివర్ బ్రంట్ (37) రెండో వికెట్‌కు 58 బంతుల్లో 92 పరుగులు జోడించడంతో.. ముంబై అలవోకగా నెగ్గింది. హేలీ నాలుగు బౌండ్రీలు, సిక్సర్‌తో చెల రేగడంతో.. పవర్‌ప్లేలో ముంబై 50/1తో నిలిచింది. మధ్య ఓవర్లలో వీరిద్దరూ పోటీపడి మరీ షాట్లు ఆడుతూ స్కోరుబోర్డును పరుగులు పెట్టించారు. 11వ ఓవర్‌లో బౌండ్రీతో మాథ్యూస్ అర్ధ శతకం పూర్తి చేసుకోగా.. జట్టుస్కోరు సెంచరీ మార్క్‌ను అందుకొంది. అయితే, వరుస ఓవర్లలో బ్రంట్, మాథ్యూస్, ఆపై హర్మన్‌ప్రీత్ (4) అవుటైనా.. అమన్‌జోత్ (12 నాటౌట్), యాస్తిక భాటియా (10 నాటౌట్) మరో 9 బంతులు మిగిలుండగానే జట్టును గెలిపించారు.

**సంక్షిప్త స్కోర్లు: యూపీ:** 20 ఓవర్లలో 150/9 (వోల్ 55, హ్యారిస్ 28; కెర్ 5/38, హేలీ 2/25); **ముంబై:** 18.3 ఓవర్లలో 153/4 (మాథ్యూస్ 68, బ్రంట్ 37; హ్యారిస్ 2/11).

## ఛెత్రి మళ్లీ వస్తున్నాడు!

రిటైర్మెంట్ వెనక్కి



న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ సునీల్ ఛెత్రి తన రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకున్నాడు. జాతీయ జట్టు తరఫున మళ్లీ బరిలోకి దిగనున్నాడు. ఏఎఫ్‌సీ ఆసియా క్వాలిఫయర్స్‌లో భాగంగా ఈనెల 25న మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో బంగ్లాదేశ్‌తో భారత్ తలపడనుంది. ఈ మ్యాచ్ ద్వారా 40 ఏళ్ల ఛెత్రి తిరిగి ఆటలోకి అడుగుపెట్టనున్నట్టు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) గురువారం ప్రకటించింది. ఆ మ్యాచ్‌లో తలపడే 26 మంది సభ్యులతో కూడిన జట్టులో అతడిని కూడా చేర్చింది. 'కెప్టెన్, లీడర్, లెజెండ్ సునీల్ ఛెత్రి మళ్లీ వస్తున్నాడు' అని ఎక్స్‌లో ఏఐఎఫ్‌ఎఫ్ పోస్ట్ చేసింది. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు గత ఏడాది జూన్‌లో ఛెత్రి వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే.

## స్పేర్ టైర్ కంటే ఎక్కువగా వాడేస్తున్నారు!



న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీలో వికెట్ కీపర్, బ్యాటర్ కేఎల్ రాహుల్ భారత్ విజయాలలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ నేపథ్యంలో రాహుల్‌పై మాజీ బ్యాటర్, కామెంటేటర్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ ప్రశంసలు కురిపించాడు. వివిధ స్థానాలకు అనుగుణంగా తన బ్యాటింగ్ శైలిని మార్చుకోవడం అతడికే చెల్లిందన్నాడు. 'కేఎల్ రాహుల్‌ను స్పేర్ టైర్ కంటే ఎక్కువగా వాడేస్తున్నారు. వికెట్ కీపర్‌గా బాధ్యతలు నిర్వర్తించాలంటారు. ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు దింపుతారు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ వస్తే మూడో నెంబర్‌లో ఆడాలంటారు. అంతేకాదు ఒక్కోసారి ఓపెనర్‌గానూ దిగాలని ఆదేశిస్తారు. ఇన్ని స్థానాల్లో ఆడుతూ, నిస్వార్థంగా రాహుల్ జట్టుకు సేవలందిస్తున్నాడు' అని సిద్ధూ కొనియాడాడు.

## బ్యాటింగ్‌కు రాకుండా నిద్రపోయాడు!




రావల్పిండి: పాకిస్థాన్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అరుదైన ఘటన చోటు చేసుకుంది. ప్రెసిడెంట్ కప్ గ్రేడ్-1 టోర్నీ ఫైనల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ పాకిస్థాన్‌కు ఆడుతున్న సౌద్ షకీల్ మ్యాచ్ సమయంలో నిద్రపోయి టైమ్డ్ అవుట్ అయ్యాడు. ఐసీసీ నిబంధనల ప్రకారం ఓ బ్యాటర్ అవుటయ్యాక మరో బ్యాటర్ మూడు నిమిషాల్లోపు క్రీజులోకి రావాల్సి ఉంటుంది. లేనిపక్షంలో అతడిని 'టైమ్డ్ అవుట్'గా ప్రకటిస్తారు. మంగళవారం పాక్ టెలివిజన్ టీమ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లోని 27వ ఓవర్ 3, 4 బంతులకు ఆటగాళ్లు వరుసగా అవుటయ్యారు. ఆలస్యంగా వచ్చిన షకీల్‌పై ప్రత్యర్థి కెప్టెన్ ఫిర్యాదు చేయడంతో అంపైర్ అవుట్‌గా ప్రకటించాడు. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్ కూడా ఐదో బంతికి వెనుదిరగడంతో షకీల్‌తో కలిపి ఆ ఓవర్లో మొత్తం నలుగురు అవుటైనట్టయ్యింది. ఇక టైమ్డ్ అవుటైన తొలి పాక్ క్రికెటర్‌గా షకీల్ నిలిచాడు.

# గోల్డ్ లోన్.. ఇక ఈజీ కాదు!

త్వరలో నిబంధనలు కఠినతరం!!



న్యూఢిల్లీ: బంగారం తాకట్టు పెట్టి రుణం పొందడం ఇకపై అంత సులభం కాకపోవచ్చు. ఎందుకంటారా..? గోల్డ్ లోన్ నిబంధనలను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మరింత కఠినతరం చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఈ రుణాల మంజూరు ప్రక్రియలో నిబంధనలను తూ.చ తప్పకుండా పాటించాలని, రుణగ్రహీత నిధులను ఎందుకోసం ఖర్చు చేయనున్నారనే విషయంపైనా కన్నేసి ఉంచాలని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలను ఆర్‌బీఐ ఆదేశించనున్నట్లు సమాచారం. అంతేకాదు, రుణగ్రహీతల బ్యాక్‌గ్రౌండ్‌నూ చెక్ చేయాలని, తాకట్టు పెట్టే బంగారం వాస్తవ హక్కుదారు ఎవరనేదీ తెలుసుకోవాలని నిర్దేశించనుందని సమాచారం. పసిడి రుణాల వ్యాపారంలో అనైతిక వ్యవహారాలకు చెక్ పెట్టడంతో పాటు ఆర్థిక వ్యవస్థ స్థిరత్వానికి భంగం కలగకుండా చూడటమే ఆర్‌బీఐ ఉద్దేశంగా ఉన్నట్లు తెలుస్తోంది.

### బ్యాంకుల పసిడి రుణాల్లో 50 శాతం వృద్ధి

ఈ మధ్య కాలంలో బంగారం తాకట్టు రుణాలకు డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. 2024 సెప్టెంబరు నుంచి బ్యాంకుల గోల్డ్ లోన్ వ్యాపారం 50 శాతం మేర పెరుగుతూ వస్తోంది. మొత్తం రుణాల వృద్ధి కంటే చాలా అధికమిది. గత ఏడాది ఆర్‌బీఐ తనఖారహిత వ్యక్తిగత రుణాల నిబంధనలను కఠినతరం చేయడంతో పాటు పసిడి ధరలు వేగంగా పెరుగుతూ రావడం ఇందుకు కారణాలని ఇండస్ట్రీ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం 10 గ్రాముల మేలిమి బంగారం రూ.89,000 స్థాయికి చేరుకుంది.

### ప్రపంచంలో రెండో అతిపెద్ద బంగారం వినియోగదారు

భారతీయులకు బంగారంపై మోజు ఎక్కువే. ప్రపంచంలో చైనా తర్వాత రెండో అతిపెద్ద బంగారం వినియోగ దేశం మనదే. పండగలు, పెళ్లిళ్లకు బంగారం కొనుగోలు చేయడం సంప్రదాయంగా వస్తోంది. మన వారికి బంగారమంటే కేవలం అలంకరణే కాదు ఆపద నుంచి గట్టెక్కించేది కూడా. వ్యక్తిగత, వ్యాపార అత్యయిక, స్వల్పకాలిక అవసరాల్లో తక్షణమే పొందగలిగేది పసిడి రుణం. కరోనా కష్టకాలం నుంచే బంగారం తాకట్టు రుణాలకు డిమాండ్ వేగంగా పెరుగుతూ వచ్చింది. తనఖారహిత రుణాల మంజూరు కఠినతరం కావడంతో రుణగ్రహీతలు కూడా పసిడి రుణాలపై ఎక్కువగా ఆధారపడుతున్నారు.


### పసిడి రుణాల మంజూరులో అవకతవకలపై ఆర్‌బీఐ నజర్

పసిడి రుణాల మంజూరులో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు అనుసరిస్తున్న అనుచిత విధానాలపై 2024 సెప్టెంబరు 30న ఆర్‌బీఐ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ రుణాల సోర్సింగ్, తాకట్టు బంగారం విలువ మదింపు, తనిఖీ ప్రక్రియ, పర్యవేక్షణ, బంగారం వేలం, లోన్ టు వాల్యూ (ఎల్‌టీవీ) రేషియో, రిస్క్ వెయిటేజీ అంశాల్లో లోపాలను ఎత్తి చూపింది. అంతేకాదు, రుణగ్రహీతలు తాకట్టు పెట్టే బంగారంపైనే ఆధారపడకుండా వారి తిరిగి చెల్లింపుల సామర్థ్యాన్నీ పరిశీలించాలని రుణదాతలను ఆర్‌బీఐ ఆదేశించింది. పాక్షిక చెల్లింపులపై రుణ కాలపరిమితి రెన్యువల్‌నూ ఆర్‌బీఐ తప్పుపట్టింది.

# బిజినెస్

## కృత్రిమ మేధ ఆవిష్కరణలకు మరింత ప్రోత్సాహం

- ఇండియాఏఐ కంప్యూట్ పోర్టల్, ఏఐకోష ప్రారంభం
- గంటకు రూ.67కే జీపీయూ సేవలు అందుబాటులోకి..


అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ: ఇండియా ఏఐ మిషన్ తొలి వార్షికోత్సవం సందర్భంగా కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గురువారం ఇండియాఏఐ కంప్యూట్ పోర్టల్, డేటా సెట్ ప్లాట్‌ఫామ్ 'ఏఐకోష'తో పాటు దేశంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు పలు కార్యక్రమాలను ప్రారంభించారు.

**ఇండియాఏఐ కంప్యూట్ పోర్టల్:** ఈ వేదిక ద్వారా 18,000కు పైగా జీపీయూ (గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్)లతో పాటు క్లౌడ్ స్టోరేజ్, ఇతర ఏఐ సేవలను వినియోగించుకోవచ్చు. విద్యార్థులు, స్టార్టప్‌లు, పరిశోధకులు, ప్రభుత్వ శాఖలు అందుబాటు ధరలో కంప్యూటింగ్ వనరులను ఉపయోగించుకోవడంతో పాటు దేశంలో ఏఐ మోడల్ ట్రైనింగ్, డెవలప్‌మెంట్‌ను వేగవంతం చేసేందుకు కేంద్రం ఈ మౌలిక వసతిని ప్రారంభించింది. ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్‌లోనే అత్యంత చౌకగా గంటకు రూ.67కే జీపీయూల వినియోగ సేవలను ఈ పోర్టల్ ద్వారా అందుబాటులోకి తెచ్చామన్నారు. భారత చంద్రయాన్ మిషన్ తరహాలో చాలా తక్కువ ఖర్చుతో భారత్ సొంత ఏఐ మోడళ్లను అభివృద్ధి చేసుకోనుందని మంత్రి ఈ సందర్భంగా అన్నారు. అంతేకాదు, 3-4 ఏళ్లలో మేడ్ ఇన్ ఇండియా జీపీయూలు అందుబాటులోకి రానున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఏఐకోష:** ఇది సమగ్ర డేటాసెట్ ప్లాట్‌ఫామ్. అత్యంత నాణ్యమైన వ్యక్తిగతేతర డేటా సెట్ల వినియోగాన్ని క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం దీన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ వేదిక దేశీయ అవసరాలకు అనుగుణమైన ఏఐ మోడళ్ల అభివృద్ధిని ప్రోత్సహించేందుకు డెవలపర్లకు వనరులు, టూల్స్, నిపుణుల మార్గదర్శకత్వ సేవలను అందించనుంది.

**ఇండియాఏఐ మిషన్:** పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యాల ద్వారా దేశంలో ఏఐ ఆవిష్కరణలకు ఊతమివ్వడంతో పాటు సొంత ఏఐ ఆవరణ వ్యవస్థను అభివృద్ధి చేసే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం రూ.10,371 కోట్ల బడ్జెట్‌తో ఇండియాఏఐ మిషన్‌ను ప్రారంభించింది. గత ఏడాది మార్చిలో కేంద్ర కేబినెట్ దీని ఆమోదం తెలిపింది.

# 74,000 పైకి సెన్సెక్స్

- 22,500 స్థాయిని దాటిన నిఫ్టీ
- వరుసగా రెండో రోజూ లాభాలు

రూ.4.54 లక్షల కోట్ల సంపద వృద్ధి

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా రెండో రోజూ లాభపడ్డాయి. గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 609.86 పాయింట్లు బలపడి 74,340.09 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 207.40 పాయింట్ల వృద్ధితో 22,544.70 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో జోరుగా కొనుగోళ్లు జరగడంతో పాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల విషయంలో కాస్త మెత్తబడటం మార్కెట్ ర్యాలీకి దోహదపడ్డాయి. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.54 లక్షల కోట్ల మేర పెరిగి రూ.397.58 లక్షల కోట్లకు చేరుకుంది.

- నయారా ఎనర్జీ (గతంలో ఎస్సార్ ఆయిల్) తన మైనారిటీ షేర్ హోల్డర్ల నుంచి 2.59 కోట్ల షేర్లను ఒక్కొక్కటీ రూ.731 చొప్పున తిరిగి కొనుగోలు (బైబ్యాక్) చేయనున్నట్లు తెలిపింది.

### ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్‌కు అవంతి ఫీడ్స్‌లో మరో 4.4% వాటా

ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసెస్ అనుబంధ విభాగమైన ఐఐఎఫ్ఎల్ ఫెసిలిటీస్ సర్వీసెస్..ఓపెన్ మార్కెట్లో బ్లాక్ డీల్ ద్వారా హైదరాబాద్‌కు చెందిన అవంతి ఫీడ్స్‌లో మరో 4.4 శాతం వాటాను రూ.470 కోట్లకు దక్కించుకుంది. ఈ మంగళవారం కూడా ఐఐఎఫ్ఎల్ సర్వీసెస్ అవంతీ ఫీడ్స్‌లో 4.4 శాతం వాటాను రూ.435 కోట్లకు కొనుగోలు చేసింది.

### నాలెడ్జ్ రియల్టీ ట్రస్ట్ రూ.6,200 కోట్ల రీట్స్ ఇష్యూ

ప్రముఖ రియల్టీ కంపెనీ సత్వ గ్రూప్, అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్ స్పాన్సర్లుగా ఉన్న నాలెడ్జ్ రియల్టీ ట్రస్ట్.. రీట్స్ (రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్) పబ్లిక్ ఇష్యూకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఈ ఇష్యూ ద్వారా రూ.6,200 కోట్లకు పైగా సమీకరించాలనుకుంటోంది.

- బాత్‌వేర్ సొల్యూషన్స్, టైల్స్, మార్బుల్స్ సంస్థ ఏషియన్ గ్రానిటో ఇండియా లిమిటెడ్.. హైదరాబాద్‌లో 3,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో లగ్జరీ డిస్‌ప్లే కేంద్రాన్ని ప్రారంభించింది. ఈ సెంటర్‌ను క్రెడాయ్ జాతీయ కార్యదర్శి జీ రాంరెడ్డి, కంపెనీ సీఎండీ కమలేశ్ పటేల్ ప్రారంభించారు.
- మారికో ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎంఐఎఫ్).. పదో ఎడిషన్ ఇండియన్ ఇన్నోవేషన్ ఐకాన్స్ కార్యక్రమంలో ఏడు ఇన్నోవేటర్స్‌ను ఎంపిక చేసింది. భిన్న రంగాల నుంచి వెయ్యికి పైగా దరఖాస్తులు రాగా అందులో నుంచి అత్యంత ప్రభావం, వ్యాపారపరంగా వృద్ధికి అవకాశాలున్న సంస్థలను ఎంపిక చేసింది. ఇందులో స్కైరూట్ ఏరోస్పేస్ కూడా ఉంది.
- మహిళా దినోత్సవం సందర్భంగా ఫ్రెష్‌బస్.. మహిళలకు తన ఫ్రెష్ కార్డ్ ద్వారా ఈ నెల 7,8 తేదీల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చింది. అయితే ఫ్రెష్‌బస్ వెబ్‌సైట్, యాప్ ద్వారా ఫ్రెష్‌కార్డ్ బుకింగ్ చేసుకున్న మహిళలకు మాత్రమే ఈ అవకాశం అందుబాటులో ఉండనుంది. ఈ కార్డు కాలపరిమితి ఆరు నెలలు.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

| 7వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 410 | విజయవాడ | 410 |
| వరంగల్ | 412 | గోదావరి | 425 |
| చిత్తూరు | 443 | విశాఖపట్నం | 435 |
| | | డజను గుడ్లు రూ. 66 | |

## దారికొస్తున్న పన్ను చెల్లింపుదారులు

### రూ.29,000 కోట్ల విదేశీ ఆస్తుల వెల్లడి



న్యూఢిల్లీ: భారతీయుల విదేశీ ఆస్తులు లేదా విదేశీ ఆదాయ వివరాలు కక్కించేందుకు ఆదాయ పన్ను (ఐటీ) శాఖ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. గత ఏడాది నవంబరు 17 నుంచి ఐటీ శాఖ ఇందుకోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా 19,501 మందికి ఎస్‌ఎంఎస్‌లు, ఈ-మెయిల్స్ పంపించింది. వెంటనే మీ అసలు విదేశీ ఆస్తులు, ఆదాయాలకు అనుగుణంగా ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేయాలని కోరింది. దీంతో 2024-25 అసెస్‌మెంట్ ఇయర్‌కు సంబంధించి 24,678 మంది తమ పన్ను రిటర్న్‌లను సమీక్షించుకోవటంతో పాటు మరో 5,483 మంది ఆలస్యంగా రూ.29,208 కోట్ల అదనపు విదేశీ ఆస్తులు, ఆదాయం వెల్లడిస్తూ కొత్త ఐటీ రిటర్న్‌లు దాఖలు చేశారు. మరో 6,734 మంది తమ నివాస హోదాను రెసిడెంట్ నుంచి నాన్-రెసిడెంట్ స్థాయికి మార్చుకున్నారు.

## అమితవ ముఖర్జీ చేతికే ఎన్‌ఎండీసీ పగ్గాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వ రంగంలోని ఎన్‌ఎండీసీ కొత్త ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా అమితవ ముఖర్జీ నియమితులయ్యా రు. ప్రస్తుతం ఆయన సీఎండీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2028 ఫిబ్రవరి 29వ తేదీ వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయన ఆ పదవిలో ఉంటా రు. 2018 నవంబరులో ఎన్‌ఎండీసీలో డైరెక్టర్ (ఫైనాన్స్)గా చేరిన ఆయన 2023 మార్చి నుంచి సీఎండీగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కాగా ఎన్‌ఎండీసీతో పాటు ఎన్‌ఎండీసీ స్టీల్, లెగసీ ఐరన్ ఓర్ లిమిటెడ్‌కు ముఖర్జీ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు.

### బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 87,490 ▼ | 80,200 ▼ | 1,08,000 ▲ |
| విజయవాడ | 89,000 ▼ | 84,250 ▲ | 98,500 ▲ |
| విశాఖపట్నం | 86,210 ▼ | 79,030 ▼ | 98,020 ▲ |
| రాజమండ్రి | 87,930 ▲ | 80,600 ▲ | 99,500 ▲ |
| ప్రొద్దుటూరు | 88,350 ▼ | 81,810 ▲ | 98,800 ▲ |
| ముంబై | 85,876 ▼ | 78,662 ▼ | 96,460 ▲ |

## విశాఖలో రెండో ప్లాంట్ షురూ

### సల్ఫర్ ఉత్పత్తి సామర్థ్యం రెండింతలు పెంపు
### కోరమాండల్ ఇంటర్నేషనల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మురుగప్పా గ్రూప్‌నకు చెందిన కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సల్ఫర్ తయారీ సామర్థ్యాలు రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా విశాఖపట్నంలో రెండో తయారీ ప్లాంట్‌ను ప్రారంభించింది. ఈ ప్లాంట్ ఏర్పాటుతో సల్ఫర్ తయారీ సామర్థ్యాన్ని 50 వేల మెట్రిక్ టన్నులకు చేర్చాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. రైతులకు అత్యధిక నాణ్యత గల బెంటోనైట్ సల్ఫర్‌ను నిలకడగా సరఫరా చేయాలనుకుంటున్నామని కంపెనీ ఎండీ, సీఈఓ ఎస్ శంకరసుబ్రమణియన్ తెలిపారు. ఇందుకు అవసరమైన ముడిసరుకు సరఫరాకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఈ ప్లాంట్ ఫాస్పారిక్, సల్ఫ్యూరిక్ యాసిడ్‌తో పాటు 12 ఎల్ఎంటీ కాంప్లెక్స్ ఎరువులు తయారుచేస్తుందని ఆయన చెప్పారు. రాబోయే 4-5 ఏళ్ల కాలంలో బెంటోనైట్ సల్ఫర్ ఎరువులకు పెరిగే డిమాండ్‌ను ఈ ప్లాంట్ తీరుస్తుంది.

### ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 73 | విజయవాడ | 95 |
| వరంగల్ | 73 | గుంటూరు | 88 |
| కరీంనగర్ | 73 | ఒంగోలు | 88 |
| మహబూబ్‌నగర్ | 73 | చిత్తూరు | 82 |
| కర్నూలు | 73 | నెల్లూరు | 87 |
| విశాఖపట్నం | 94 | అనంతపురం | 87 |
| గోదావరి | 95 | | |



జానారెడ్డిని ఆయన నివాసంలో కలిసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

### లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై
## రేవంత్ సర్కారు నజర్

- అఖిలపక్ష భేటీలు నిర్వహించాలని క్యాబినెట్ నిర్ణయం
- డిప్యూటీ సీఎం భట్టి, మాజీ మంత్రి జానారెడ్డికి బాధ్యత
- జానారెడ్డితో సీఎం భేటీ మర్మమూ ఇదే

హైదరాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకిస్తూ తెలంగాణ సర్కారు ప్రత్యక్ష కార్యాచరణలోకి దిగింది. దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా పునర్విభజన జరగాలనే నినాదంతో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను ఒకతాటిపైకి తీసుకువచ్చేందుకు సిద్ధమైంది. ఇందుకోసం ప్రభుత్వ పరంగా అఖిలపక్ష సమావేశాలను విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సమావేశాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మాజీ మంత్రి జానారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించాలని సచివాలయంలో గురువారం జరిగిన సమావేశంలో రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గ పునర్విభజన జరిగితే.. కుటుంబ నియంత్రణను కచ్చితంగా పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని వివిధ వేదికలపై సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇదే అంశంపై గురువారం క్యాబినెట్‌లోనూ చర్చించారు. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం, పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం తగ్గనున్నందున ఈ విధానాన్ని నిరసిస్తూ అఖిలపక్ష సమావేశాల్లో చర్చించాలని నిర్ణయించారు. ఏ ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరగాలన్నది ఈ సమావేశాల్లో తీర్మానించి కేంద్రానికి పంపనున్నారు. తొలి సమావేశం త్వరలో హైదరాబాద్‌లోనే జరగనుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. కాగా, జానారెడ్డి నేతృత్వంలో అఖిలపక్ష సమావేశాలు నిర్వహించాలని క్యాబినెట్లో నిర్ణయించడానికి ముందు.. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా జానారెడ్డి నివాసానికి వెళ్లారు. ఆయనతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అన్ని పార్టీలను, పక్షాలను ఒక తాటిపైకి తీసుకురాగల పెద్దరికం ఉన్నందున.. అఖిలపక్ష సమావేశాల బాధ్యతను అప్పగిస్తున్నామని, దీన్ని స్వీకరించాలని జానారెడ్డిని సీఎం కోరినట్లు సమాచారం. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఢిల్లీ వెళ్లనున్నారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు అక్కడ జరిగే ఇండియా టుడే కాన్క్లేవ్‌లో పాల్గొని హైదరాబాద్‌కు తిరిగి వస్తారు. ఇక, శనివారం సాయంత్రం పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే మహిళా శక్తి సదస్సులో సీఎం పాల్గొంటారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై అధిష్ఠానంతో చర్చించేందుకు శనివారం సాయంత్రం లేదా ఆదివారం ఆయన మరోమారు ఢిల్లీ వెళ్లే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

### పెసా బలోపేతానికి రూ.33 కోట్లు: సీతక్క

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన గూడేల్లో స్వయం నిర్ణయాధికారం, హక్కులు, చట్టాలు, సంస్కృతి సంప్రదాయాలు కాపాడుకునేందుకు రూపొందించిన షెడ్యూల్ ప్రాంతాలకు పంచాయతీల విస్తరణ (పెసా) చట్టాన్ని మరింత బలోపేతం చేసేందుకు సర్కార్ చర్యలు చేపట్టిందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. అందుకుగానూ ప్రజాప్రభుత్వం గురువారం రూ.33 కోట్లు విడుదల చేసినట్లు ఆమె వెల్లడించారు. ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధిలో కీలకంగా పనిచేసే పెసా కో- ఆర్డినేటర్ల, 600 మొబిలైజర్ల వేతనాలతోపాటు పెసా కార్యకలాపాల కోసం ప్రభుత్వం ఈ నిధులను వెచ్చించనుందని సీతక్క తెలిపారు.

### ఇసుకపై ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్ 155242

హైదరాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇసుక లోడింగ్, రవాణా సమస్యల పరిష్కారానికి తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీఎల్) టోల్ ఫ్రీ నంబర్ 155242 ను ఏర్పాటు చేసింది. ప్రతి రోజూ 24 గంటల పాటు ఈ నంబర్ పని చేస్తుందని తెలిపింది. ప్రజలు ఈ నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, ఫిర్యాదులను తెలియజేయవచ్చని ఓ ప్రకటనలో వెల్లడించింది. ప్రతి ఫిర్యాదు లేదా విజ్ఞాపనకు అధికారులు ఒక యూనిక్ ఇంటర్నల్ ట్రాకింగ్ నంబర్‌ను కేటాయించి, ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు ఫాలో అప్ చేస్తారని వివరించింది. ఒకవేళ సమస్య ఇతర శాఖలకు చెందినదైతే దానిని సంబంధిత శాఖలకు, జిల్లాలకు పంపిస్తామని తెలిపింది.

### ఛత్తీస్‌గఢ్‌లో వింత వ్యాధి.. 13 మంది మృతి

చర్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా దనికోడత గ్రామంలో వింత వ్యాధి ప్రబలుతోంది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో ఉన్న ఈ గ్రామంలో వారం రోజుల్లోనే సుమారు 13 మంది మృతి చెందారని స్థానికులు తెలిపారు. మృతుల్లో యువకులు కూడా ఉన్నారని చెబుతున్నారు. గ్రామంలో అనేకమంది జ్వరం, జలుబు, ఛాతీ నొప్పితో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అనారోగ్యం బారిన పడిన వారు ఆస్పత్రులకు రాకుండా నాటు మందులు వాడటం వల్ల మరణాల సంఖ్య పెరిగిందని అధికారులు చెబుతున్నారు. గ్రామంలో ప్రజలు ఏ వ్యాధితో చనిపోతున్నారనే విషయాన్ని అధికారులు నిర్ధారించలేదు. ప్రస్తుతం ఆ గ్రామంలో అధికారులు వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు.

### కాంగ్రెస్‌లో పదవుల భర్తీపై కసరత్తు!

- 32 మంది నేతలతో ఏఐసీసీ కార్యదర్శుల ముఖాముఖి

హైదరాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పదవుల భర్తీపై కాంగ్రెస్‌లో భారీగా కసరత్తు జరుగుతోంది. పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులతో ఏఐసీసీ ఇన్‌ఛార్జి కార్యదర్శులు విశ్వనాథన్, విష్ణునాథ్‌లు గురువారం గాంధీ భవన్‌లో భేటీ అయ్యారు. ముఖాముఖిగా సమావేశమై వారి సమర్థతపై ఆరా తీశారు. ఎన్నాళ్ల నుంచీ పార్టీలో ఉన్నారు? పార్టీ ఏ బాధ్యతలు అప్పగించినా నిర్వహిస్తారా? ఫలానా బాధ్యత ఇస్తే సమర్థంగా నిర్వహించగలమని అనుకుంటున్నారా? ఇంతవరకు పార్టీ కోసం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టారు? తదితర ప్రశ్నలను వేసి సమాధానాలు రాసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 32 మందిని పిలిపించుకుని మరీ ఇంటర్వ్యూలు చేశారు. పార్టీ ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, వంశీకృష్ణ, ఎడ్మ బొజ్జు, కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, పార్టీ నేతలు సరితా తిరుపతయ్య, రేఖానాయక్ తదితరులు ఉన్నారు. టీపీసీసీ కార్యవర్గం, నామినేటెడ్ పోస్టుల విషయంలో ఇప్పటికే వీరి పేర్లు ప్రచారంలో ఉన్నాయి.

### ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు
## కేకేఆర్ గౌతమ్ విద్యార్థి అర్హత



హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలంపియాడ్ ట్రైనింగ్ క్యాంప్‌కు తమ విద్యార్థి ఉజ్వల్ రామ్ అర్హత సాధించాడని కృష్ణ జిల్లా గుడివాడలోని కేకేఆర్ గౌతమ్ హైస్కూల్ గురువారం తెలిపింది. ఈ క్యాంప్ మే 8 నుంచి 31 వరకు చెన్నైలో జరగనుందని వెల్లడించింది. ఇటీవల హోమిబాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియన్ నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ఉజ్వల్ రామ్ అత్యంత ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సత్యారామ్ తెలిపారు. జాతీయ పోటీలకు దేశవ్యాప్తంగా 69 మంది ఎంపికవగా, ఆంధ్రప్రదేశ్ నుంచి కేవలం తమ విద్యార్థి మాత్రమే ఉన్నాడని ఆయన చెప్పారు.

# ఎస్సీ.. బీసీ.. సై!

(మొదటిపేజీ తరువాయి)

రాత్రి 9 గంటల వరకూ ఆరు గంటలపాటు సుదీర్ఘంగా కొనసాగింది. అనంతరం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాబినెట్ నిర్ణయాలను విలేకరులకు వెల్లడించారు.

### ఎస్సీ వర్గీకరణపై ముసాయిదా బిల్లు

"ఎస్సీ వర్గీకరణకు దశాబ్దాలుగా పోరాటాలు జరిగాయి. సుప్రీం కోర్టు తీర్పునిచ్చిన కొన్ని గంటల్లోనే.. దానిని తమ ఇందిరమ్మ ప్రభుత్వం తూ.చా. తప్పకుండా అమలు చేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అన్న మాట ప్రకారం.. జస్టిస్ షమీమ్ అక్తర్ ఆధ్వర్యంలో ఏక సభ్య కమిషన్ వేశారు. ఆయన ఇచ్చిన నివేదికను ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చించింది. కమిషన్ సిఫారసులను పునఃపరిశీలన చేయాలంటూ వివిధ వర్గాల నుంచి 71 విజ్ఞప్తులు వచ్చాయి. వాటిని పరిశీలించాలంటూ మళ్లీ షమీమ్ అక్తర్ కమిషన్‌కు ఇవ్వడం జరిగింది. భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండడానికి, మొక్కుబడిగా చేశారన్న ఇబ్బంది రాకుండా ఉండడానికి మళ్లీ కమిషన్‌కు అప్పగించాం. వీటిని పరిశీలించిన కమిషన్.. ప్రభుత్వానికి మరోసారి నివేదిక ఇచ్చింది. దాని ఆధారంగా ముసాయిదా బిల్లును రూపొందించాం" అని పొంగులేటి వివరించారు. దీనిని రాబోయే అసెంబ్లీ సమావేశంలో ప్రవేశపెట్టి, చట్ట రూపంలో తీసుకురావాలని క్యాబినెట్‌లో నిర్ణయించడం జరిగిందని తెలిపారు. బీసీ రిజర్వేషన్లపై కుల గణన సర్వే, బలహీన వర్గాల సంఘాలు, మేధావుల సలహాలపై క్యాబినెట్‌లో చర్చించామని, ఈ వివరాలతో రాబోయే శాసన సభ సమావేశాల్లో బిల్లులను ప్రవేశపెట్టనున్నామని వెల్లడించారు. గత శాసన సభలో (2017) 37 శాతంతో పెట్టిన బిల్లును వాపసు చేయాలని నిర్ణయించామని తెలిపారు.

### 'ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ)' ఏర్పాటు

ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకూ 'ఫ్యూచర్ సిటీ'గా ప్రకటించడం జరిగిందని, ఈ ప్రాంతంలోని ఏడు మండలాలు, 56 గ్రామాలను కలిపి 'ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ)'గా ఏర్పాటు చేస్తూ క్యాబినెట్ నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. నాగార్జున సాగర్ హైవే నుంచి శ్రీశైలం హైవే మధ్యలో ఉన్న దాదాపు 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. "ఈ 56 గ్రామాలతోపాటు ఇదివరకు హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న 36 గ్రామాలను ఎఫ్‌సీడీఏకు బదిలీ చేయడం జరిగింది. దీనికి 90 పోస్టులను మంజూరు చేస్తూ క్యాబినెట్ ఆమోదించింది. హెచ్‌ఎండీఏ పరిధిని రీజినల్ రింగు రోడ్డు దాటి 2 కిలోమీటర్ల బఫర్ జోన్ వరకు విస్తరించడం జరిగింది. అంటే... 11 జిల్లాలు, 104 మండలాలు,



1,355 గ్రామ పంచాయతీలు హెచ్‌ఎండీఏ పరిధిలో ఉంటాయి. మరో 332 రెవెన్యూ గ్రామాలు హెచ్‌ఎండీఏ పరిధిలోకి రాబోతున్నాయి" అని వివరించారు.

### మహిళా గ్రూపుల్లో సభ్యుల అర్హత వయసు పెంపు

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న చిత్తశుద్ధితో ఇందిరా మహిళా శక్తి మిషన్ కింద 'ఇందిరా మహిళా శక్తి పాలసీ-2025'ని క్యాబినెట్ ఆమోదించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు ఎలాంటి భద్రత, సహాయాన్ని అందించారో అదే మాదిరిగా ఇప్పుడు వారి అభివృద్ధి కోసం పాలసీని తెస్తున్నామన్నారు. "గతంలో గ్రామీణ ప్రాంత మహిళా సంఘాలను సెర్ప్ కింద, పట్టణ ప్రాంత మహిళా సంఘాలను మెప్మా కింద పెట్టారు. ఇకపై రాష్ట్రంలో ఈ మహిళా సంఘాలన్నీ ఒకే గొడుగు కింద ఉండాలని నిర్ణయించడం జరిగింది. ఇందిరా మహిళా శక్తి గ్రూపుల్లో గతంలో 60 ఏళ్లకే సభ్యులకు రిటైర్మెంట్ ఉండేది. దీనిని 65 సంవత్సరాలకు పొడిగించాం. గతంలో 18 ఏళ్లు నిండినవారికే సభ్యులుగా చేరే అవకాశం ఉండేది. ఇప్పుడు దీనిని 15 ఏళ్లకు కుదించాం. అంటే... 15 ఏళ్ల నుంచి 65 ఏళ్ల మధ్య వయసు వారు మహిళా శక్తి గ్రూపుల్లో సభ్యులుగా ఉండొచ్చు" అని వివరించారు.

### లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై అఖిలపక్ష భేటీ

"కేంద్ర ప్రభుత్వం దురాలోచనతో లోక్‌సభ నియోజక వర్గాలను పునర్విభజన చేయాలని అనుకుంటోంది. ఉత్తరం, దక్షిణం అనే భావనతో దక్షిణాదికి నష్టం చేయాలని యోచిస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఆలోచనపై చర్చించాలని, పునర్విభజనను పక్కాగా చేపట్టాలన్న డిమాండ్‌తో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించాం. ఉత్తరాదికి లాభం చేకూరకుండా, దక్షిణాదికి నష్టం జరగకుండా చూడాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన. ఇందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మాజీ మంత్రి జానారెడ్డి ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించాం" అని మంత్రి పొంగులేటి తెలిపారు. ఉత్తరాదికి పెంచే దామాషా పద్ధతిలోనే దక్షిణాదికి కూడా సీట్లు పెంచాలంటూ డిమాండ్ చేయాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు.

### క్యాబినెట్‌లో తీసుకున్న ఇతర నిర్ణయాలు..

- * తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్టు బోర్డు మాదిరిగానే యాదగిరిగుట్ట నర్సింహస్వామి ఆలయానికి ట్రస్టు బోర్డును ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగింది. అందుకు వీలుగా తెలంగాణ చారిటబుల్ అండ్ హిందూ రెలిజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్ యాక్ట్- 1987ను సవరించాలని నిర్ణయించాం.
- * గడిచిన పదేళ్లలో తెలంగాణ పర్యాటక రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. రాష్ట్రంలో అనేక టూరిస్టు స్పాట్‌లు ఉన్నా, ఒక పాలసీ లేకపోవడం వల్ల నష్టం జరిగింది. తెలంగాణకు కూడా ఒక టూరిజం పాలసీ ఉండాలని సమావేశంలో నిర్ణయించడం జరిగింది. ఈ మేరకు 'తెలంగాణ టూరిజం పాలసీ-2025-30'ను ఆమోదించడం జరిగింది. రాష్ట్రంలోని 27 టూరిజం స్పాట్‌లను ప్రత్యేక పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. రాబోయే ఐదేళ్లలో దీనివల్ల రూ.15 వేల కోట్లకు తగ్గకుండా పెట్టుబడులు వచ్చేలా నిర్ణయాలు తీసుకోవడం జరిగింది.
- * మేలో జరిగే 'మిస్ వరల్డ్' పోటీలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. దీనికి ప్రపంచవ్యాప్తంగా 140 దేశాల నుంచి వచ్చే అతిథులకు లోటు జరగకుండా చూడాలని నిర్ణయించడం జరిగింది.
- * రెవెన్యూ శాఖకు సంబంధించి 10,954 రెవెన్యూ గ్రామాలకు నాథుడు లేరు. గడిచిన పదేళ్లలో ప్రజలు ఇబ్బందిపడ్డారు. సీఎం, మంత్రులు చెప్పిన మాట ప్రకారం.. వీటికి గ్రామపాలన అధికారులను నియమించాలని నిర్ణయించడం జరిగింది. గతంలో రద్దు చేసిన వీఆర్‌ఓ, వీఆర్‌ఏ వ్యవస్థలోని అర్హులైన వారిని ఈ పోస్టుల్లో నియమించాలని నిర్ణయించడం జరిగింది.
- * శంషాబాద్ మండలంలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి 5.15 ఎకరాలు కేటాయించడం జరిగింది.
- * పారాలింపిక్స్-2024 కాంస్య పతక విజేత దీప్తి జీవాంజికి ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయం.
- * కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాలను గత ప్రభుత్వంలో మొక్కుబడిగా ఏర్పాటు చేశారు. వాటికి పోస్టులను కేటాయించలేదు. అందుకే, వాటికి 361 పోస్టులను మంజూరు చేయాలని నిర్ణయం.
- * తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ పరిధిలోని గురుకుల పాఠశాలలకు 330 రెగ్యులర్, 165 ఔట్‌సోర్సింగ్.. మొత్తం 495 పోస్టులకు ఆమోదం.

### 12 నుంచి బడ్జెట్ సమావేశాలు!

- వర్గీకరణ, బీసీ బిల్లులకు ఆమోదం
- ఒకట్రెండోజుల విరామమిచ్చి సీఎం నేతృత్వంలో ఢిల్లీకి అఖిలపక్షం
- ఆ తర్వాతే బడ్జెట్ ప్రవేశపెట్టనున్న సర్కారు

హైదరాబాద్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 12న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రసంగంతో మొదలవుతాయి. అయితే సమావేశాలు ఎప్పటిదాకా కొనసాగుతాయనేది 13న జరిగే అసెంబ్లీ బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్ణయించనుంది. సచివాలయంలో గురువారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్లు సమాచారం. తొలి రోజున గవర్నర్ ప్రసంగం ఉండగా.. ఆ తర్వాత రోజు ఆ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, సమాధానం ఉంటాయి. అనంతరం ఎస్సీ వర్గీకరణ, స్థానిక సంస్థలు.. విద్యా ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లులను అసెంబ్లీలో ప్రవేశ పెట్టి.. చర్చించి ఆమోదిస్తారు. బీసీ రిజర్వేషన్‌ను పెంచుకునేందుకు వీలుగా రాజ్యాంగాన్ని సవరించాలంటూ కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించనున్నారు. అనంతరం సభకు ఒకటి, రెండు రోజులు విరామం ఇచ్చి.. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన అఖిలపక్షం ఢిల్లీకి వెళ్లనుంది. ప్రధానిని కలిసి అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని ఇవ్వనుంది. సమావేశాలు పునఃప్రారంభమయ్యాక రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు. ఈ నెలఖరులోగా ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం లభించనుంది.

### బిల్లులు, ఇతర అంశాలపై సుదీర్ఘ చర్చ

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కీలకమైన బిల్లులు ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఈ అంశాలపైన సుదీర్ఘంగా క్యాబినెట్లో చర్చ జరిగింది. అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులును కూడా పిలిపించుకుని మాట్లాడారు. అసెంబ్లీ నిర్వహణపైన ఆయనకు సూచనలిచ్చారు. కీలకమైన బిల్లులు, కులగణన సర్వేలతోపాటుగా 50 అంశాలపైన సుదీర్ఘంగా మంత్రివర్గం చర్చించి నిర్ణయాలు తీసుకుంది. కాగా, భేటీ ముగిసిన తర్వాత అధికారులను బయటికి పంపేసిన మంత్రులు..రాజకీయ, ఇతర అంశాలపైనా చర్చించుకున్నట్లు సమాచారం. పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటమిపైనా విశ్లేషణ చేసినట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల తరహాలోనే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీజేపీకి బీఆర్ఎస్ సహకరించిందని, కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి ఓట్లను చీల్చారన్న అవగాహనకు వచ్చినట్లు సమాచారం.

# సమన్వయలేమితోనే ఓటమి

### గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలపై క్యాబినెట్ భేటీలో చర్చ

- స్థానికసంస్థల ఎన్నికల సమయానికి బలపడాలని నిశ్చయం
- నియోజకవర్గాల పునర్విభజనపైనా సుదీర్ఘంగా చర్చ
- బీసీ బిల్లును ఆమోదించుకునేలా కేంద్రంతో చర్చలు

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవల జరిగిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిపై మంత్రి మండలి సమావేశంలో లోతుగా చర్చ జరిగింది. ఓటమికి కారణాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. పార్టీ సమన్వయ లోపంతోనే ఓటమి చెందామనే అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైనట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గెలుచుకున్న ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత గెలవలేకపోవంపై అధిష్ఠానం కూడా సీరియస్‌గా ఉందనే విషయం సమావేశంలో చర్చకు వచ్చింది. ఈ నేపథ్యంలో.. స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి పార్టీని బలోపేతం చేసుకోవడంతోపాటు.. క్షేత్రస్థాయిలో మరింత బలపడాలని నిర్ణయించినట్లు తెలిసింది. అందుకోసం ఇకపై జిల్లాలవారీగా కూడా రాజకీయ పరిస్థితులు, పరిణామాలపై సమావేశాలు, సమీక్షలు నిర్వహించి, నివేదికలు తీసుకోవాలనే నిశ్చయానికి వచ్చారు. అలాగే. ప్రభుత్వంపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టాలని, అందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, అవలంబించాల్సిన విధానాలపై దృష్టి పెట్టాలని నిర్ణయించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని దానికి అనుగుణంగానే నిర్ణయాలు తీసుకోవాలనే అంశంపై కీలకంగా చర్చించారు. దీంతోపాటు పెండింగ్ బిల్లుల పరిష్కారం దిశగా చర్చ జరిగినట్లు సమాచారం.

### డీలిమిటేషన్‌పై..

రాష్ట్రంలోని బీసీలకు స్థానిక సంస్థలు, విద్య, ఉపాధి రంగాల్లో 42 శాతం చొప్పున రిజర్వేషన్లను అమలుచేయాలని నిర్ణయించిన సర్కారు.. అసెంబ్లీ సమావేశాల్లో బీసీల బిల్లులను ప్రవేశపెట్టి, చర్చించి, వాటిని ఆమోదించనుంది. అనంతరం ఆ చట్టాలను ఆమోదించాలని కోరుతూ పార్లమెంటుకు పంపనుంది. 50% రిజర్వేషన్ల నిబంధనకు సంబంధించి సుప్రీం తీర్పును మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, దాని సడలింపునకు ఉన్న అవకాశాలపై కేంద్రంతో చర్చించనుంది. దీన్ని రాజ్యాంగంలోని షెడ్యూల్ 9లో చేర్చేందుకు కృషి చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తులను కేంద్రం ఆమోదించకపోతే.. అఖిలపక్షంతో కలిసి వెళ్లాలనే ఆలోచనకు కూడా వచ్చారు. అలాగే.. నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణ భారతదేశానికి అన్యాయం జరగకుండా చూడాలంటూ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేయనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటుచేయనుంది. ఆ కమిటీ త్వరలోనే భేటీ కానుంది. అనంతరం అఖిలపక్ష సమావేశంలో తీర్మానం చేసి, దాన్ని కేంద్రానికి పంపాలని నిర్ణయించినట్లు తెలిసింది.

# సీతారామపై మంత్రుల సంవాదం!

- పథకం పాత పేర్లను ప్రస్తావించిన కీలక మంత్రి
- వద్దనుకుంటే పక్కనబెట్టేయాలని మరో మంత్రి ఆగ్రహం


హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు అంచనాలను పెంచే అంశంపై క్యాబినెట్ సమావేశంలో ఇద్దరు కీలక మంత్రుల మధ్య వాడివేడిగా సంవాదం జరిగినట్లు తెలిసింది. సీతారామ ఎత్తిపోతల పథకాన్ని 2016 ఫిబ్రవరి 18న రూ.7,926 కోట్ల అంచనాతో ప్రభుత్వం పరిపాలన అనుమతులిచ్చిన విషయం తెలిసిందే. తర్వాత పథకంలో పలు మార్పులు చేశారు. సీతారామ ఎత్తిపోతల పథకంలోనే సీతమ్మ బ్యారేజీని కూడా చేర్చారు. దాంతో, 2018 ఆగస్టులో రూ.13,057 కోట్లకు అంచనాలను సవరించారు. తాజాగా వీటిని రూ.13,057 కోట్ల నుంచి రూ.19,324.92 కోట్లకు సవరించాల్సి ఉంది. ఇందుకు క్యాబినెట్ ఆమోదం తెలపాల్సి ఉంది. ఈ అంశం చర్చకు వచ్చినప్పుడు.. ఉమ్మడి రాష్ట్రంలో రాజీవ్‌సాగర్/ఇందిరాసాగర్ ప్రాజెక్టును ప్రతిపాదించారని, ఆ స్థానంలో తెలంగాణ ఏర్పడిన తర్వాత సీతారామ ఎత్తిపోతల పథకం చేపట్టారంటూ కీలక మంత్రి ఒకరు అభ్యంతరం తెలిపినట్లు తెలిసింది. దీంతో, మరో కీలక మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో 4,15,621ఎకరాలకు సాగునీటిని, మరో 3,89,366 ఎకరాలను స్థిరీకరించడానికి చేపట్టిన పథకానికి ఇప్పటి వరకూ రూ.10వేల కోట్లదాకా ఖర్చు చేసిన తర్వాత మళ్లీ పాత పథకాలను లేవనెత్తడం ఎందుకని ప్రశ్నించారు. సాంకేతిక సలహా మండలి అనుమతి కోసం ప్రయత్నాలు చేస్తున్నామని, పాత వివాదాన్ని లేవనెత్తి.. సమస్యను జఠిలం చేసుకుంటూ పోతే ప్రాజెక్టు ఏ విధంగా ముందుకెళుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొర్రీలు వేసుకుంటూపోతే ఫలితం ఉండదని, ప్రాజెక్టుపై స్పష్టత ఉండాలని, చేపట్టకూడదనుకుంటే పక్కనపెట్టేయడం లేదా రద్దు చేసుకోవాలని సదరు మంత్రి స్పష్టం చేశారు. దీంతో, ప్రాజెక్టు అంచనాలను కాంపోనెంట్ వారీగా వారం రోజుల్లో పరిశీలించే బాధ్యతను ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అప్పటికి దీనిపై స్పష్టత వస్తే.. తదుపరి క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోనున్నారు. కాగా, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో నార్లాపూర్, ఏదుల రిజర్వాయర్ల మధ్య 8.325 కిలోమీటర్ల ఓపెన్ కెనాల్ నిర్మాణ అంచనాను సవరించడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీన్ని రూ.416.10 కోట్లతో చేపట్టగా.. అంచనాలను సవరించకపోతే పనులు చేసేది లేదని నిర్మాణ సంస్థ రెండేళ్లుగా పక్కనపెట్టింది. దీని అంచనాను రూ.416.81కోట్ల నుంచి రూ.780.63కోట్లకు సవరించడానికి క్యాబినెట్లో ఆమోదం తెలిపారు. అలాగే, ఆర్.ఎస్.ఘన్‌పూర్ రిజర్వాయర్‌లోని ప్రధాన కాలువ 12.650 కిలోమీటర్ల నుంచి 31.20 కిలోమీటర్ల దాకా రూ.148.76 కోట్లతో సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనుల ర్యాటిఫికేషన్‌కు;రొల్లవాగు చెరువు సామర్థ్యం పెంపునకు సంబంధించి రూ.153కోట్లతో సవరణ అంచనాలకూ ఓకే చెప్పింది. ఇక, గంధమల్ల రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.41 టీఎంసీలకు తగ్గించే పనులకు రూ.574.56 కోట్లతో క్యాబినెట్ ఆమోదించింది. వాస్తవానికి ఈ రిజర్వాయర్‌ను 9.8 టీఎంసీలతో చేపట్టగా.. స్థానికుల ఆందోళనలతో తొలుత 4.8 టీఎంసీలకు, తాజాగా 1.41 టీఎంసీలకు సామర్థ్యాన్ని తగ్గించారు.

# స్టార్ హోటల్‌లా స్టేట్ గెస్ట్ హౌస్!



స్టేట్ గెస్ట్ హౌస్‌ను ప్రారంభిస్తున్న కోమటిరెడ్డి, పొన్నం

హైదరాబాద్, మార్చి6 (ఆంధ్రజ్యోతి): విదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు వచ్చే అతిథులతోపాటు కేంద్ర ప్రభుత్వ అధికారులకు ఆతిథ్యం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభవన్ ప్రాంగణంలో స్టేట్ గెస్ట్ హౌస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. గతంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు సీఎం క్యాంప్ ఆఫీసుగా వినియోగించిన భవన సముదాయాన్ని స్టేట్ గెస్ట్ హౌస్‌గా మార్చింది. ఈ స్టేట్ గెస్ట్ హౌస్‌ను రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ స్టేట్ గెస్ట్ హౌస్‌ను ఫైవ్ స్టార్ హోటల్‌ను మరిపించేలా అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దామని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రానికి వచ్చిన అతిథులకు ఫైవ్ స్టార్ హోటళ్లలో బస ఏర్పాటు చేసి రూ.కోట్లలో ప్రజాధనాన్ని వృథా చేసిందని అన్నారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు తమ ప్రభుత్వం ఇకపై స్టేట్ గెస్ట్ హౌస్‌ను వినియోగిస్తుందని వివరించారు.



## ఎస్ఎల్‌బీసీ దుర్ఘటనకు ప్రభుత్వానిదే బాధ్యత

- ప్రమాదం జరుగుతుందని తెలిసీ సొంత లాభం కోసం పనులు: కేటీఆర్



హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం కుడి గట్టు కాలువ సొరంగం (ఎస్ఎల్‌బీసీ టన్నెల్)లో జరిగిన దుర్ఘటనకు ప్రభుత్వానిదే బాధ్యత అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రమాదం జరుగుతుందని ముందే తెలిసినా పనులు చేపట్టిందని విమర్శించారు. గురువారం ఎక్స్‌లో ఆయన పోస్ట్ పెడుతూ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని రెడ్ జోన్‌గా ప్రకటిస్తూ నిపుణులు ఇచ్చిన రెండు నివేదికలు ప్రభుత్వం దగ్గర ఉన్నప్పటికీ సొంత లాభం కోసం టన్నెల్ పనులు కొనసాగించి ఎనిమిది మంది కార్మికులను బలితీసుకుందని ఆరోపించారు. నిపుణులు గుర్తించిన ప్రాంతంలోనే ప్రస్తుతం ప్రమాదం జరిగిందని తెలిపారు. దీనిపై హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో దర్యాప్తు జరిపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సర్కార్ ప్రారంభించిన తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్‌నాలెడ్జ్ (టాస్క్) కు నీతిఆయోగ్ ప్రశంసలు దక్కాయని, ఇది తమ సర్కార్‌చేసిన కృషికి గుర్తింపు అని కేటీఆర్ పేర్కొన్నారు.

## రేవంత్ చేసేది తెలంగాణ రైజింగ్ కాదు ఫాలింగ్

- రాష్ట్ర ఆదాయం తగ్గడంపై క్షమాపణ చెప్పాలి:హరీశ్



హైదరాబాద్, మార్చి6(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ ఆదాయంలో తక్కువ వృద్ధిరేటు, రిజిస్ట్రేషన్లు, వెహికిల్ టాక్స్‌లో నెగెటివ్ వృద్ధిరేటు రేవంత్‌రెడ్డి పాలనా వైఫల్యాన్ని ఎండగడుతున్నాయని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రేవంత్ చేస్తున్నది తెలంగాణ రైజింగ్ కాదని ఫాలింగ్ అని ఎద్దేవా చేశారు. హైడ్రా, మూసీ వంటి తలాతోకలేని నిర్ణయాలు, అనాలోచిత చర్యలవల్ల ఆగస్టు 2024 తర్వాత రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం గణనీయంగా తగ్గిందని ఎక్స్‌వేదికగా ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయం తగ్గడంపై ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి ప్రజలకు క్షమాపణలు చెప్పి పాలనపై దృష్టి పెట్టాలన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గవ్వల

బర్కత్‌పుర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా గవ్వల భరత్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనకు ఎంపీ ఆర్.కృష్ణయ్య నియామకపత్రం అందజేశారు. గురువారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఫలితాలే 2028 ఎన్నికల్లో పునరావృతమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ గడ్డపై ఎగిరేది కమలం జెండాయేనని, బీసీ ముఖ్యమంత్రి అయి తీరుతాడని అన్నారు. . విద్య, ఉద్యోగ రంగాల్లో కొంత విజయం సాధించామని, రాజ్యాధికారాన్ని సాధించడమే లక్ష్యంగా బీసీలు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని కోరారు. నూతన అధ్యక్షుడుగా నియమితులైన గవ్వల భరత్‌కుమార్ మాట్లాడుతూ.. బీసీలలో 139 కులాలను కలుపుకుని కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.



గవ్వల భరత్‌కుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

## బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందం

- ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే నిదర్శనం : మల్లు రవి

న్యూఢిల్లీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల చీకటి ఒప్పందం మరోసారి బయట పడిందని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే దీనికి నిదర్శనమని చెప్పారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు అందరం కలిసి సంతోషించామని, ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమిపైనా సమష్టిగా బాధ్యత వహిస్తామని తెలిపారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి అంతర్గతంగా మద్దతు తెలిపిన బీఆర్ఎస్.. ఈసారి మాత్రం పోటీలో లేకుండానే ఓట్లను బీజేపీకి బదలాయించిందని ఆరోపించారు. రెండు ఎమ్మెల్సీలు రాగానే ఇక అన్ని ఎన్నికల్లో మేమే గెలుస్తామని కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అనడం వారి అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని చెప్పారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు

- బీసీల ఓటమికి కలిసి పనిచేశాయి: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని, ఇందుకు కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికనే నిదర్శనమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీలు గెలిచి.. ప్రజాస్వామ్యం ఓడిపోయిందని, పార్టీలు, సిద్ధాంతపరంగా ఓట్లు చీలడంవల్ల పోటీలో ఉన్న బీసీ అభ్యర్థి గెలవలేదన్నారు. బీసీల ఓటమికి రెండు జాతీయ పార్టీలు కలిసి పనిచేశాయని విమర్శించారు. ఆ రెండు పార్టీలు బీసీయేతర అభ్యర్థులను బరిలోకి దింపడంతో బీసీ అభ్యర్థికి నష్టం కలిగిందన్నారు.

## శ్రీవారి అన్నప్రసాదంలో మసాలా వడ

తిరుమల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని వెంగమాంబ నిత్యాన్నప్రసాద భవనంలో మసాలా వడ వడ్డింపు మొదలైంది. టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు గురువారం ఉదయం భక్తులకు మసాలా వడలను వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా శ్రీవారి చిత్రపటం వద్ద వడలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ అన్నప్రసాదం మెనూలో భక్తులకు అదనంగా ఓ పదార్థాన్ని వడ్డించాలనే ఆలోచన తనకు కలగడంతో సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా అంగీకారం తెలిపారన్నారు. ఇప్పటికే భక్తులకు నాణ్యమైన దినుసులతో రుచికరమైన అన్నప్రసాదాలను అందిస్తున్నామని చెప్పారు.

## ఏసీబీకి చిక్కిన ధర్మపురి మున్సిపల్ కమిషనర్

- వేతన క్లియరెన్స్ కోసం రూ.20 వేల లంచం
- 70 వేల లంచంతో దొరికిన చౌటుప్పల్ ట్రాన్స్‌కో ఏడీఈ

ధర్మపురి, చౌటుప్పల్ రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వేతన క్లియరెన్స్ కోసం ఒకరు, సోలార్ విద్యుత్ సింక్రనైజేషన్ కోసం మరొకరు.. ఇలా ఇద్దరు అధికారులు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు చిక్కారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ నియామకంపై ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరుగా పైడిపెల్లి మహేష్ పని చేస్తున్నాడు. ఆరు నెలల నుంచి మహేశ్‌కు వేతనం ఇవ్వకుండా కమిషనర్ శ్రీనివాస్ వేధింపులకు గురి చేస్తున్నారు. రూ. 20 వేలు లంచం ఇస్తేనే జీతం ఫైల్ ఉన్నతాధికారులకు పంపిస్తానని మహేశ్‌కు కమిషనర్ చెప్పారు. దీంతో మహేశ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, వారి సూచనల మేరకు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాస్‌కు మహేశ్ లంచం ఇస్తుండగా అధికారులు పట్టుకున్నారు. అలాగే, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మునిసిపాలిటీ పరిధి తంగడపల్లి శివారులోని ఓ పరిశ్రమలో 390 కిలోవాట్స్ సోలార్ పవర్ పరికరాలను ఏర్పాటు చేయడానికి నిజామాబాద్‌కు చెందిన ఫ్రీ ఎనర్జీ సోలార్‌సిస్టమ్ ఏజెన్సీకి కాంట్రాక్టు అప్పగించారు. సోలార్ విద్యుత్‌ను సింక్రనైజేషన్ చేయడానికి ఈ నెల 4న నెట్ మీటర్‌ను బిగించారు. తనిఖీ చేసి సింక్రనైజేషన్ అనుమతి ఇవ్వడానికి రూ.70 వేలు లంచం ఇవ్వాలని చౌటుప్పల్ ట్రాన్స్‌కో ఏడీఈ గాజుల శ్యాంప్రసాద్ ఆ కాంట్రాక్టర్‌ను డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు గురువారం ఏడీఈకి కాంట్రాక్టర్ రూ.70 వేలు ఇస్తుండగా అధికారులు పట్టుకున్నారు.

# అమెరికన్లు, ఎన్నారైలే లక్ష్యంగా..సైబర్ దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

పౌరులు, ఎన్నారైలకు కాల్ చేసి.. తాము పేపాల్ సిబ్బంది అని నమ్మించేవారు. దుబాయ్‌కి చెందిన ఆజాద్, విక్కీ ద్వారా పేపాల్ ఖాతాదారుల వివరాలను సేకరించేవారు. టార్గెట్ చేసిన వినియోగదారులకు ముందు మెయిల్ చేసి ఒక కస్టమర్ కేర్ సెంటర్ నంబరు ఇచ్చేవారు. ఖాతాదారులు ఆ నంబరుకు ఫోన్ చేయడంతో మనస్విని బృందం రంగంలోకి దిగేది. మీ పేపాల్ ఖాతాలో 500-1000 డాలర్ల వరకు అక్రమ లావాదేవీలు జరిగాయని చెప్పేవారు. పేపాల్ నుంచి అదనంగా పొందిన డబ్బు తిరిగి ఇవ్వకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని బెదిరించేవారు. ఇలా అమెరికన్ పౌరుల నుంచి కాజేసిన సొమ్మును వివిధ ఖాతాల ద్వారా క్రిప్టో కరెన్సీగా మళ్లించి దుబాయ్‌కి పంపిచేవారు. ఈ దందాకు సూత్రధారి గుజరాత్‌కు చెందిన కైవన్ పటేల్ అలియాస్ జాదు భాయ్, దుబాయ్‌లో ఉండే అతని సోదరుడు విక్కీ, వీరి మరో భాగస్వామి ఆజాద్ అని షికా గోయల్ తెలిపారు. ఈ ముగ్గురూ పరారీలో ఉన్నారన్నారు. వీరితో కలిసి మనస్విని ఈ కాల్ సెంటర్‌ను నడుపుతున్నారని చెప్పారు. ఉద్యోగుల్లో 22 మంది మహిళలు, 41 మంది పురుషులు ఉన్నారని.. మనస్విని సహా వీరందరికీ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

### తెలిసే నేరం చేశారు..

ఈశాన్య రాష్ట్రాల నుంచి పొట్టకూటి కోసం హైదరాబాద్ వచ్చి కాల్ సెంటర్ నిర్వాహకుల వలలో చిక్కిన యువతను అరెస్టు చేయడం సరైన నిర్ణయమేనా? అని విలేకరులు ప్రశ్నించగా.. వారంతా నేరం చేస్తున్నామని తెలిసే కాల్ సెంటర్‌లో పనిచేశారని, అందుకే అరెస్టు చేశామని గోయల్ చెప్పారు. తెలంగాణలో సైబర్ నేరాలను పూర్తిగా అరికట్టడం కోసమే కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మాదాపూర్ కాల్ సెంటర్‌లో పని చేసిన వాళ్లంతా అమెరికా కాలమానం ప్రకారం షిఫ్టుల్లో పనిచేశారన్నారు. ఇలాంటి షిఫ్టుల్లో నడుస్తున్న కాల్ సెంటర్లలో స్థానిక పోలీసులు తనిఖీలు నిర్వహించాలని.. వారేం పని చేస్తున్నారో నిఘా పెట్టాలని గోయల్ సూచించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. పెండింగ్‌లోనే రెడ్‌కార్నర్ నోటీసు

- సీబీఐతో సంప్రదింపులు: సీఐడీ డీజీ

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో పరారీలో ఉన్న నిందితులు ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావును పట్టుకునేందుకు ఇంకా రెడ్ కార్నర్ నోటీసు జారీ కాలేదని సీఐడీ డీజీ షికా గోయల్ తెలియజేశారు. రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయడానికి కావాల్సిన చట్టపరమైన ప్రక్రియను సీబీఐ పూర్తిచేయాల్సి ఉందని ఆమె వివరించారు. రెడ్ కార్నర్ నోటీసులు జారీ అయినట్లు తమకు సీబీఐ నుంచి సమాచారం అందలేదని చెప్పారు. రెడ్ కార్నర్ నోటీసు జారీ అయినట్లు వస్తున్న వార్తలను ఆమె తోసిపుచ్చారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావు అమెరికా నుంచి మరో దేశానికి వెళ్లినట్లు తెలుస్తోందని, వారెక్కడికి వెళ్లినా రెడ్ కార్నర్ నోటీసు జారీ అయిన తర్వాత చిక్కుతారని ఆమె తెలిపారు. ఈ కేసును హైదరాబాద్ పోలీసులు చూస్తున్నారని, వారు పంపిన రెడ్ కార్నర్ నోటీసు వినతిని సీబీఐకి పంపామని షికా గోయల్ తెలియజేశారు.

# బడికి చిన్నారి శ్రీవిద్య

**బాలికను బడిలో చేర్పించాలంటూ సీఎం ఆదేశాలు.. దాసారం బస్తీలోని శ్రీవిద్య ఇంటికి డీఈవో రోహిణి**

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- తల్లి మమత తోడుగా చిన్నారిని వెంటబెట్టుకొని బడికి
- ఒకటో క్లాసులో చేర్పించి.. పుస్తకాలు అందజేత
- శ్రీవిద్య చదువులలో రాణించాలి: రేవంత్
- చిన్నారికి సహకరిస్తాం: కేటీఆర్, తలసాని

హైదరాబాద్ సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీవిద్య ముఖంలో వెలుగులొచ్చాయి. అందరిలా తానూ రోజూ బడికి వెళ్లి చక్కగా చదువుకోవొచ్చునన్న ఆనందం ఆ చిన్నారిలో! అక్షరాలు దిద్దుదువుగానీ రా అంటూ బడి ఆమెను అక్కున చేర్చుకుంది. నోటుబుక్కులు, పెన్సిళ్లు ఇచ్చి ముద్దుచేసింది. చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా సరైన పత్రాలు లేకపోవడంతో ఇంట్లోనే నిరాశగా గడుపుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీవిద్య గురించి 'ఆధార్ ఇప్పిస్తే ఈ చిన్నారి చదువుకుంటుంది' అనే శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. సనత్‌నగర్ దాసారం బస్తీకి చెందిన ఎనిమిదేళ్ల మల్లెల శ్రీవిద్య బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు లేని కారణంగా బడికి వెళ్లలేని పరిస్థితులు ఏర్పడ్డాయని అందులో వివరించింది. ఈ కథనంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ఆదేశాలతో డీఈవో రోహిణి వెంటనే చర్యలు తీసుకున్నారు. ఆమే స్వయంగా దాసారం బస్తీలోని శ్రీవిద్య ఉంటున్న నివాసానికి వెళ్లారు. బాలిక తల్లిదండ్రులు అశోక్, మమతతో మాట్లాడి సమస్య ఏమిటో తెలుసుకున్నారు. ఏ పాఠశాలలోనైతే శ్రీవిద్య పేరును కొట్టేశారో.. అదే పాఠశాల అయిన బీకే గూడలోని 'శ్రీ విద్యాంజలి స్కూల్ ప్రిన్సిపాల్‌తో రోహిణి మాట్లాడారు. బాలికను బడిలో చేర్చుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. అనంతరం తల్లి మమత తోడుగా శ్రీవిద్యను వెంటబెట్టుకొని డీఈవో స్వయంగా ఆ బడికి వెళ్లారు. అక్కడ శ్రీవిద్యను ఒకటో తరగతిలో చేర్పించి.. క్లాసులో కూర్చోబెట్టారు. అక్కడ చిన్నారికి అవసరమైన పుస్తకాలు, నోటుబుక్కులు ఇచ్చారు. 'ఆంధ్రజ్యోతి' కథనంపై మాజీ మంత్రి కేటీఆర్ కూడా సామాజిక మాధ్యమం వేదికగా స్పందిచారు. శ్రీవిద్య చదువుకు సహకరిస్తామని పేర్కొన్నారు. ఇక.. రెండ్రోజుల్లో శ్రీవిద్యకు అవసరమైన పత్రాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటానని సనత్‌నగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఆయన ఆదేశాలతో జీహెచ్ఎంసీ అధికారులు గురువారం సాయంత్రం చిన్నారి ఇంటికి వెళ్లారు. బర్త్ సర్టిఫికెట్ కోసం తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలను నమోదు చేసుకున్నారు. సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ, చిన్నారి ఇంటికి వెళ్లి సమస్యను తెలుసుకుని స్కూల్ నిర్వాహకులతో మాట్లాడారు. అంతకుముందు.. రాష్ట్ర న్యాయ సేవాధికార కార్యదర్శి పంచాక్షరి ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లా సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావేద్, బస్తీలో శ్రీవిద్య ఉంటున్న నివాసానికి వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈవో రోహిణితో మాట్లాడి చిన్నారిని బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



చిన్నారి శ్రీవిద్యతో డీఈవో రోహిణి, స్కూల్ సిబ్బంది

### శ్రీవిద్య చదువులతో రాణించాలి: రేవంత్

శ్రీవిద్య సమస్యపై సీఎం రేవంత్ ఎక్స్ వేదికగా స్పందించారు. చిన్నారి పాఠశాలకు హాజరుకాలేకపోతున్నట్లు పత్రికల ద్వారా తన దృష్టికి వచ్చిందని, దీనిపై డీఈవో రోహిణి ద్వారా విచారణ జరిపించినట్లు చెప్పారు. నివేదిక ప్రకారం.. కుటుంబ కారణాల వల్ల ఆమె పాఠశాలకు దూరమైందని, తన ఆదేశాల మేరకు అధికారులు తిరిగి శ్రీవిద్యను పాఠశాలలో చేర్పించారని పేర్కొన్నారు. శ్రీవిద్య మంచి చదువులు చదివి భవిష్యత్తులో గొప్పగా రాణించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఆయన పేర్కొన్నారు.

## ఏసీబీ పేరిట సైబర్ వల

**ప్రభుత్వ ఉద్యోగి నుంచి రూ.లక్ష కాజేసిన సైబర్ నేరగాళ్లు**

**అరెస్టు చేస్తామని బెదిరించి డబ్బు వసూలు**

**హైదరాబాద్‌లో ఘటన, ఆలస్యంగా బయటకు**

హైదరాబాద్ సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అమాయకులను బురిడీ కొట్టించి డబ్బు కాజేసేందుకు సైబర్ నేరగాళ్లు రకరకాల మార్గాలు అన్వేషిస్తున్నారు. ఈ క్రమంలో అవినీతి అధికారుల ఆట కట్టించే అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) పేరును కూడా సైబర్ కేటుగాళ్లు వాడేస్తున్నారు. ఏసీబీ నుంచి ఫోన్ చేస్తున్నామని, కేసులు, అరెస్టు అని బెదిరించి ఓ ప్రభుత్వ ఉద్యోగి నుంచి రూ.లక్ష కొట్టేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సైబర్ మోసం ఆలస్యంగా వెలుగు చూసింది. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి(58)కి 99595 23187 అనే నెంబర్ నుంచి రెండు వారాల క్రితం ఫోన్ వచ్చింది. కాల్‌కు స్పందించిన సదరు ఉద్యోగి ఎవరూ అని ప్రశ్నించగా.. తాను ఏసీబీ అధికారిని అని అవతలి వ్యక్తి పరిచయం చేసుకున్నాడు. మీపై ఫిర్యాదులు ఉన్నాయని, విచారణ చేస్తున్నామని చెప్పి.. సదరు ఉద్యోగి, అతని కుటుంబసభ్యుల బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించాడు. బ్యాంకు లావాదేవీల్లో అవకతవకలు ఉన్నాయని, పలు ఫిర్యాదులకు సంబంధించి మిమ్మల్ని త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పాడు. దీంతో సదరు ఉద్యోగి భయపడి పోగా.. అడిగినంత డబ్బు ఇస్తే అరెస్టు నుంచి తప్పించుకోవచ్చు అంటూ అవతలి వ్యక్తి వల వేశాడు. ఈ వలలో పడిన సదరు ప్రభుత్వ ఉద్యోగి.. ఆ వ్యక్తి డిమాండ్ చేసిన రూ.లక్షను అతను సూచించిన బ్యాంకు ఖాతాకు బదిలీ చేశాడు. ఆ తర్వాత తాను మోసపోయానని గ్రహించిన సదరు ప్రభుత్వ ఉద్యోగి సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించడంతో విషయం బయటికొచ్చింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



## మధ్యభారత రాష్ట్రాలకే లాభం

**నియోజకవర్గాల పునర్విభజనతో వాటికి మాత్రమే ప్రయోజనం**

**ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాలకూ నష్టమే**

**పంజాబ్, హరియాణాకు ఇప్పుడు 23 సీట్లు**

**పునర్విభజనతో ఆ రెండింటికీ కలిపి 18 సీట్లే**

**కాంగ్రెస్ ఎంపీ మనీశ్‌తివారీ వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ, మార్చి 6: ప్రస్తుతం అమలులో ఉన్న 'ఒక వ్యక్తి-ఒక ఓటు-ఒకే విలువ' సూత్రం ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాలే కాక, ఉత్తరాది రాష్ట్రాలు కూడా నష్టపోతాయని.. జనాభా నియంత్రణలో వెనకబడిన మధ్యభారత రాష్ట్రాలే దీనివల్ల ఎక్కువగా లబ్ధి పొందుతాయని కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభతోపాటు రాజ్యసభలో సైతం దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల సీట్ల శాతం తగ్గుతుందని.. కాబట్టి, నియోజకవర్గాల పునర్విభజనకు కొత్త సూత్రాన్ని రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు. జనాభా లెక్కల ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేపడితే తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందంటూ దక్షిణాది రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్న సమయంలో.. దక్షిణాదికే కాక ఉత్తరాదికీ నష్టం జరుగుతుందంటూ మనీశ్ తివారీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. "ఉదాహరణకు.. ప్రస్తుతం పంజాబ్‌కు 13 సీట్లు, హరియాణాకు 10 సీట్లు ఉన్నాయి. జనాభా లెక్కల ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేపడితే పంజాబ్, హరియాణాకు కలిపి 18 సీట్లే మిగులుతాయి. లోక్‌సభలో పెరిగే మొత్తం సీట్లతో పోల్చితే.. సభలో వారి వాటా మరింతగా తగ్గిపోతుంది. ఏ రకంగా చూసినా ఆ రాష్ట్రాల ప్రాముఖ్యం తగ్గిపోతుంది" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "సీట్ల సంఖ్య విషయంలో హరియాణాతో సమానంగా ఉండడాన్ని పంజాబ్ అంగీకరిస్తుందా? తమ సీట్ల సంఖ్య యథాతథంగా ఉండడాన్ని హిమాచల్ ప్రదేశ్ ఒప్పుకొంటుందా? జమ్మూకశ్మీర్ తన సీట్ల సంఖ్య స్వల్పంగా ఆరు నుంచి తొమ్మిదికి పెరగడాన్ని ఆమోదిస్తుందా?" అని మనీశ్ ప్రశ్నల వర్షం కురిపించారు. "ఈ మొత్తం ప్రక్రియలో లబ్ధి పొందేది మధ్యభారత రాష్ట్రాలే. జనాభా నియంత్రణలో వెనకబడినందున.. వాటి పార్లమెంటు సీట్ల సంఖ్యలో పెరుగుదల ఉంటుంది. కాబట్టి, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు ఒక కొత్త సూత్రాన్ని రూపొందించాలి. లేదా ఈ ప్రక్రియను శాశ్వతంగా నిలిపివేయాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

# అత్యవసరంగా భూసేకరణ ఎందుకు?

- రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు
- లగచర్ల, హకీంపేట భూసేకరణ
- నోటిఫికేషన్లపై స్టే విధించిన కోర్టు

హైదరాబాద్/దుద్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల, హకీంపేట గ్రామాల్లో అత్యవసరంగా భూమిని సేకరించాల్సిన అవసరం ఏముందని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. లగచర్లలో 110 ఎకరాలు, హకీంపేటలో 351 ఎకరాలు సేకరించే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన రెండు నోటిఫికేషన్లపై స్టే విధించింది. భూములను అత్యవసరంగా సేకరించాల్సిన అగత్యం ఏంటని నిలదీసింది. లగచర్ల, హకీంపేటలో 461 ఎకరాలు సేకరించే నిమిత్తం గత ఏడాది నవంబరు 29న నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. వీటిని సవాల్ చేస్తూ లగచర్లకు చెందిన పత్లావత్ గోపాల్ నాయక్ మరో 14 మంది, హకీంపేటకు చెందిన కుమ్మరి శివకుమార్ వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదిస్తూ.. గతంలో ఫార్మాసిటీ కోసం భూసేకరణ నోటిఫికేషన్లు ఇచ్చిన ప్రభుత్వం వాటిని రద్దు చేసి, మళ్లీ రెండు రోజుల వ్యవధిలోనే మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు పేరుతో నోటిఫికేషన్ జారీచేసిందని తెలిపారు. గ్రామసభ నిర్వహించకుండా, నిపుణులతో సామాజిక ప్రభావ మదింపు చేపట్టకుండా భూసేకరణ చట్టంలోని సెక్షన్ 10(ఏ)ను ఉపయోగించి అత్యవసరంగా భూసేకరణ చేయాలని చూస్తోందని చెప్పారు. 2013 భూసేకరణ చట్టానికి విరుద్ధంగా జారీ చేసిన ఈ నోటిఫికేషన్లను కొట్టివేయాలని కోరారు. స్పందించిన ధర్మాసనం భూసేకరణ నోటిఫికేషన్ల జారీలో అంత అత్యవసరం ఏంటని ప్రశ్నించింది. తదుపరి ప్రొసీడింగ్స్‌పై స్టే విధించింది. కౌంటర్ దాఖలు చేయాలంటూ తదుపరి విచారణను ఏప్రిల్ 7కు వాయిదా వేసింది.



వికారాబాద్ జిల్లా రోటిబండ తండాలో గిరిజనుల సంబరాలు

### రోటిబండతండా, హకీంపేటలో సంబరాలు

కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలంలో హకీంపేట, రోటిబండ తండా, లగచర్ల, పులిచర్లకుంట తండాకు చెందిన రైతులు గురువారం రాత్రి సంబరాలు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్లపై హైకోర్టు స్టే విధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని కోరారు.

## ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షకు 10,823 మంది డుమ్మా

**విస్తృతంగా స్క్వాడ్ తనిఖీలు.. 4 మాల్‌ప్రాక్టీస్ కేసులు**

- తండ్రి మృతి.. దేవరకద్రలో పరీక్షకు హాజరైన కుమారుడు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 1,532 కేంద్రాల్లో ద్వితీయ భాష పరీక్ష జరిగింది. మొత్తం 4,52,028 మంది విద్యార్థులకు.. 4,40,513 మంది హాజరయ్యారని ఇంటర్ విద్యా కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. 10,823 (2.39 శాతం) మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. పరీక్షల పర్యవేక్షణకు హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాలకు ప్రత్యేక పర్యవేక్షకులను పంపించామన్నారు. జగిత్యాలలో మూడు, నిజామాబాద్‌లో ఒక మాల్ ప్రాక్టీస్ కేసు నమోదైందని పేర్కొన్నారు. ఓ విద్యార్థి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తండ్రి మరణించిన విషయాన్ని దాచి ఇంటర్ పరీక్ష రాయించిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో చోటుచేసుకుంది. గద్వాల జిల్లా లింగనవాయికి చెందిన మైబుబాష కుమారుడు సమీర్ దేవరకద్రలోని మైనారిటీ గురుకుల కళాశాలలో ఇంటర్ ఎంపీసీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. మైబుబాష అనారోగ్యంతో బుధవారం సాయంత్రం మృతి చెందాడు. తండ్రి చనిపోయిన విషయం పరీక్ష అయ్యే వరకు సమీర్‌కు చెప్పొద్దని కళాశాల ప్రిన్సిపాల్ రహెమతుల్లాను అతడి తల్లి కోరారు. దీంతో పరీక్ష అయిపోయాక అసలు విషయం చెప్పి అతడిని ఇంటికి పంపించారు. వికారాబాద్ జిల్లా తాండూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలోని ఓ తరగతి గదిలోకి పాము చొరబడింది. అప్రమత్తమైన అక్కడి సిబ్బంది ఆ పామును చంపేశారు. దీంతో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాశారు. వరంగల్ జిల్లా పర్వతగిరిలో పరీక్ష కారణంగా పొద్దున జరగాల్సిన వివాహం మధ్యాహ్నానికి వాయిదా పడింది. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల (టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ)లో పరీక్షా కేంద్రం ఎదురుగా నివాసం ఉండే గుగులోతు కల్యాణ్ వివాహం ఉదయం 9:30 గంటలకు జరగాల్సి ఉంది. కానీ భాజాభజంత్రీల శబ్దానికి పరీక్ష రాసే విద్యార్థులకు ఆటంకం కలుగుతుందంటూ విద్యాశాఖ అధికారులు, స్థానిక ఎస్సై సదరు కుటుంబసభ్యులను సంప్రదించారు. దీంతో సదరు కుటుంబం పరీక్ష పూర్తయిన అనంతరం వివాహం జరిపించింది.

## సరస్వతీ పవర్ షేర్ల బదిలీపై ట్రైబ్యునల్‌లో విచారణ

- ప్రతివాదిగా తన పేరు తొలగించాలని షర్మిల వినతి

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ పవర్‌కు సంబంధించిన షేర్ల బదిలీని అడ్డుకోవాలని కోరుతూ ఏపీ మాజీ సీఎం జగన్, ఆయన భార్య భారతి దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్సీఎల్టీ) హైదరాబాద్ బెంచ్‌లో విచారణ జరిగింది. జగన్, భారతిల తరఫున సీనియర్ న్యాయవాది, రాజ్యసభ ఎంపీ ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ప్రతివాదులైన వైఎస్ విజయలక్ష్మి, షర్మిల తరఫున సీనియర్ న్యాయవాది వివేక్‌రెడ్డి, విశ్వరాజ్ హాజరయ్యారు. ఈ కేసుతో తనకు సంబంధం లేదని, ఆస్తుల పంపకాలకు కంపెనీ పిటిషన్‌కు సంబంధం లేదని షర్మిల విన్నవించారు. ప్రధాన పిటిషన్ సహా ఇతర మధ్యంతర దరఖాస్తుల నుంచి తనను ప్రతివాదిగా తొలగించాలని కోరారు. ఆమె వినతితో పాటు, ఇతర దరఖాస్తులపై సమాధానాలు ఇవ్వాలని సంబంధిత పార్టీలకు బెంచ్ నోటీసులు జారీచేసింది. ప్రధాన పిటిషన్‌పై తొలుత వాదనలు వినాలని జగన్ తరఫు న్యాయవాది నిరంజన్‌రెడ్డి కోరారు. ఇది చాలా చిన్న విషయమని, 30 నిమిషాల్లో వాదనలు పూర్తిచేస్తానని చెప్పారు. ఇందుకు బెంచ్ అంగీకరించలేదు. మధ్యంతర దరఖాస్తులపై ఉత్తరప్రత్యుత్తరాలు పూర్తయిన తరువాత అన్నింటినీ కలిపి వింటామని పేర్కొంది. తదుపరి విచారణను ఏప్రిల్ 3కు వాయిదా వేసింది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.